సత్యమేవ జయతే

సాక్షి


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురాకక్షల జోలికి వెళ్లరు'

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 32

బుధవారం 24-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



టీటీలో భారత నంబర్‌వన్ శ్రీజ

కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న తెలంగాణ టేబుల్ టెన్నిస్ (టీటీ) క్రీడాకారిణి ఆకుల శ్రీజ కెరీర్‌లో గొప్ప ఘనత సాధించింది. మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా అవతరించింది. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో శ్రీజ కెరీర్ బెస్ట్ 38వ ర్యాంక్‌ను అందుకుంది. - 14లో



'చాలీసా' విన్నా నేరమే..

కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో కనీసం హనుమాన్ చాలీసా వినడం కూడా పెద్ద నేరమే అవుతుందని ప్రధాని మోదీ అన్నారు.
- వివరాలు 6లో



మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం!

కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు నేపథ్యంలో.. మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని ఈసీ వర్గాలు తెలిపినట్టు ఓ వార్తా సంస్థ వెల్లడించింది.
- వివరాలు 6లో



జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు మరో 14 రోజులపాటు పొడిగించింది.
- వివరాలు 2లో



వేలం వద్దు.. మేమే కేటాయిస్తాం

2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని 12 ఏళ్ల తర్వాత సుప్రీంకు కేంద్రం విజ్ఞప్తి చేసింది.
- వివరాలు 6లో

రెండంకెల బలం

కమలం టార్గెట్ | 10 నుంచి 12 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యం



కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కంటే ముందుగా ఇప్పటికే ఓ రౌండ్ ప్రచారం పూర్తిచేసిన బీజేపీ

- 2 నెలల్లో 5 సభలకు ప్రధాని మోదీ హాజరు.. నేతలకు దిశా నిర్దేశం
- ఉత్సాహంగా సాగుతున్న పార్టీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు
- జాతీయ స్థాయి నేతలు పాల్గొంటుండటంతో శ్రేణుల్లో జోష్
- నామినేషన్లు ముగిసిన తర్వాత అగ్రనేతల ముమ్మర ప్రచారం
- మే 11లోగా మరో మూడుసార్లు మోదీ రాక.. రేపు సిద్దిపేటకు అమిత్ షా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రెండంకెల (డబుల్ డిజిట్) ఎంపీ సీట్లు కైవసం చేసుకోవాలని కమలదళం ఉవ్విళ్లూరుతోంది. 17 ఎంపీ సీట్లకుగాను 10 నుంచి 12 స్థానాలు గెలిచి సత్తా చాటాలని భావిస్తోంది. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభా స్థానాల్లో గెలుపొందిన పార్టీగా రికార్డు సృష్టించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీని, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పూర్తిస్థాయిలో వెనక్కి నెట్టేలా ఫలితాలు రాబట్టాలని బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు గట్టి పట్టుదలతో ఉన్నాయి. ఆ రెండు పార్టీల కంటే ముందుగా ఇప్పటికే ఓ రౌండ్ ప్రచారాన్ని ముగించుకున్న బీజేపీ అదే దూకుడుతో ముందుకెళ్లాలని భావిస్తోంది. అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమాల్లో జాతీయ స్థాయి నేతలు పాల్గొనేలా వ్యూహరచన చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రేకెత్తిస్తోన్న కమలదళం, అగ్రనేతల పర్యటనలతో ప్రచార పర్వాన్ని మరింత వేడెక్కించే ప్రయత్నాల్లో ఉంది.

మోదీ మ్యాజిక్‌పైనే ఆశలు

రాష్ట్రంలో గత రెండు నెలల్లో ఐదు సభల్లో పాల్గొన్న ప్రధాని మోదీ ఓ విడత ప్రచారం పూర్తి చేయడంతో రాష్ట్ర పార్టీకి ఊపు వచ్చింది. మిగతా పార్టీల కంటే ముందుగానే ప్రచారాన్ని ప్రారంభించడంతో పాటు రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలకు మోదీ దిశానిర్దేశం చేశారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఐదు రోజులు ఐదు చోట్ల బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడానికి ముందే రాష్ట్రంలో తొలివిడత ప్రచారాన్ని మిగతా 2వ పేజీలో ▶


భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న జైశంకర్. పక్కన లక్ష్మణ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు

మోదీ విజయంతోనే దేశ భవిష్యత్తు
కేంద్ర మంత్రి జైశంకర్ 10లో

దేవుళ్లపై ఒట్లు పెట్టుడు.. కేసీఆర్‌ను తిట్టుడు

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై కేసీఆర్ వ్యాఖ్యలు

- నన్ను బదనాం చేసేందుకే రేవంత్ అసంబద్ధ ఆరోపణలు
- కాళేశ్వరాన్ని ఎలా వాడుకోవాలో తెలియని అసమర్థ ప్రభుత్వమిది
- లిక్కర్ కేసు నుంచి కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తుంది
- లోక్‌సభ ఎన్నికల్లో 8 నుంచి 12 స్థానాల్లో గెలుస్తాం
- కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు టచ్‌లో ఉన్నారు
- సందర్భాన్ని బట్టి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటును కొట్టి పారేయలేం
- ఏపీలో జగన్ మళ్లీ అధికారంలోకి...


ఓ టీవీ చానల్‌లో మాట్లాడుతున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'దేవుళ్ల మీద ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లు' అనే రీతిలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను బదనాం చేయడం ద్వారా పబ్బం గడుపుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. మంగళవారం ఓ టీవీ చానల్‌కు సుదీర్ఘంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై కేసీఆర్ మాట్లాడారు. పదేళ్ల పాలనలో విద్యుత్, తాగునీటి రంగాల్లో బీఆర్‌ఎస్ మిగతా 3వ పేజీలో ▶

నేటి నుంచి కేసీఆర్ ప్రగతి రథం యాత్ర

- బస్సుకు తెలంగాణ భవన్‌లో ప్రత్యేక పూజలు... బుధవారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న యాత్ర
- యాత్రలో 100 వాహనాలు.. 200 మంది వలంటీర్లు
- తొలిరోజు మిర్యాలగూడ, సూర్యాపేటలో రోడ్ షో

3లో

న్యూస్‌రీల్

నేడు ఇంటర్ ఫలితాలు



ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలు బుధవారం ఉదయం 11 గంటలకు వెలువడనున్నాయి. ఫలితాలను https://tsbie.cgg.gov.in లేదా https://results.cgg.gov.in వెబ్‌సైట్ల నుంచి పొందవచ్చని ఇంటర్ బోర్డు తెలిపింది. ఇక, 'సాక్షి' www.sakshieducation.com వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది.
- వివరాలు 2లో

నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు



రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు బుధవారం నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఇస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి.
- వివరాలు 16లో

శం'షేర్'



శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడుతోంది. దేశంలోని మెట్రో నగరాల్లో ప్రయాణికుల రద్దీలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలవగా.. దక్షిణాదిలో బెంగళూరు తర్వాత శంషాబాద్ బిజీ విమానాశ్రయంగా నిలుస్తోంది.
- వివరాలు 7లో

అప్నా నంబర్ ఆయేగా



మీ షూ సైజు ఎంత? యూకే సైజులో అయితే ఈ నంబర్.. యూఎస్ సైజులో అయితే ఈ నంబర్ అని చెబుతాం.. చాలా చెప్పుల షాపుల్లో ఈ నంబర్లే నడుస్తున్నాయి. ఎప్పుడైనా ఆలోచించారా? మన పాదాల సైజు గురించి చెప్పేందుకు.. వేరే దేశాల నంబర్లపై ఎందుకు ఆధారపడుతున్నామో.. మన దేశానికి సొంత ఫుట్‌వేర్ సైజుల నంబర్ ఎందుకు లేదో? ఇకపై ఆ సీన్ మారనుంది. 16లో

ఇదండీ జగత్


ఎవరేశారో తెలుసుకోకుండా దోశలు తినేయడమేనా!!

విజయనగరం జిల్లా చెల్లూరు వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జన సందోహంలో ఓ భాగం..




మేమంతా సిద్ధం సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

మీ డ్రీమ్సే... నా స్కీమ్స్

- ప్రజలందరి కలలు మన సంక్షేమ పథకాలతో సాకారం
- విజయనగరం జిల్లా చెల్లూరు మేమంతా సిద్ధం సభలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వివరాలు 5లో

రుణమాఫీ చేస్తా.. బీఆర్‌ఎస్ రద్దు చేస్తావా?

- ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతా
- జోగుళాంబ సాక్షిగా మాట ఇస్తున్నా..
- హరీశ్ నువ్వు.. నీ మామ నా సవాలును స్వీకరించండి
- రేవంత్ మాటిస్తే ఎలా ఉంటదో నీ మామను అడుగు
- లోటు బడ్జెట్ ఉన్నప్పుడు అధికారం చేపట్టా
- మద్దూరు, బిజినేపల్లి సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, నాగర్‌కర్నూల్/కోస్గి/మద్దూరు: 'జోగుళాంబదేవి సాక్షిగా మాట ఇస్తున్నా.. ఆగస్టు 15లోపు ఆరునూరైనా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతా. అదే రోజు నువ్వు, నీ మామ బీఆర్‌ఎస్ పార్టీని రద్దు చేస్తారా? నా రాజీనామా కాదు. నీ పార్టీ రద్దుకు సిద్ధంగా ఉండండి'అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. దమ్ముంటే మాజీమంత్రి హరీశ్‌రావు తన సవాలును స్వీకరించాలని చెప్పారు. మంగళవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నారాయణపేట జిల్లా మద్దూరులో నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం, అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర భారీ బహిరంగసభలో సీఎం మాట్లాడారు. 'ఆగస్టు 15 లోగా రుణమాఫీ మిగతా 2వ పేజీలో ▶

ఒట్టేసి చెబుతున్నా..!

- రేవంత్ 'ఒట్లపై' రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- హామీల అమల్లో విఫలం కావడం వల్లే దేవుళ్ల పేరిట ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారంటున్న విపక్షాలు
- విపక్షాల ప్రచారానికి కౌంటర్‌గా తప్పనిసరి పరిస్థితుల్లో రేవంత్ ఒట్లు పెడుతున్నారంటున్న కాంగ్రెస్ వర్గాలు

- వివరాలు 10లో

రానున్న రెండ్రోజులు వడగాడ్పులు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువే

- దేశంలోని నాలుగు రాష్ట్రాలకు హీట్‌వేవ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ... తెలంగాణ, ఏపీల్లో తేలికపాటి వర్షాలకూ అవకాశమని ప్రకటన

- వివరాలు 2లో




కుప్పకూలిన ఓడేడ్ - గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై నిర్మాణంలో ఉన్న వంతెన గడ్డర్లు

ఈదురుగాలుల ఎఫెక్ట్

కూలిన వంతెన

కుప్పకూలిన మూడు గడ్డర్లు

- అర్ధరాత్రి కూలడంతో తప్పిన పెను ప్రమాదం
- మరో ఐదు గడ్డర్లు కూలిపోయే ప్రమాదం!
- గర్మిళ్లపల్లి–ఓడేడ్ మానేరు వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన
- గత ప్రభుత్వానిదే తప్పిదం: మంత్రి శ్రీధర్‌బాబు

టేకుమట్ల/మహాముత్తారం/ముత్తారం(మంథని): జయశంకర్ భూపాలపల్లి–పెద్దపల్లి జిల్లాను అనుసంధానం చేస్తూ ఓడేడ్ – గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై నిర్మాణంలో ఉన్న వంతెన గడ్డర్లు కుప్పకులాయి. సోమవారం రాత్రి వీచిన బలమైన గాలుల ధాటికి పియర్లపై అమర్చిన మూడు గడ్డర్లు ఒక్కసారిగా కిందపడ్డాయి. 2016 ఆగస్టు 4న రూ.47.4కోట్ల అంచనా వ్యయంతో 40 మీటర్ల పొడవున 24 పియర్లతో వంతెన నిర్మాణం ప్రారంభించారు. నాటినుంచి ఈ అంతర్ జిల్లా వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు సగం గడ్డర్లు కూడా పూర్తి కాలేదు. కాగా, సోమవారం రాత్రి బలమైన గాలులకు రెండు, మూడు పియర్లపై అమర్చిన మిగతా 2వ పేజీలో ▶

సాక్షి ఎలక్షన్ 2024

తెలంగాణ

నారీ పవర్

- ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి సై అంటున్న నారీమణులు
- తొలి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 22 మంది మహిళలు
- 2009లో 50 దాటిన మహిళా ఎంపీల సంఖ్య.. 2019లో అత్యధికంగా 78 మంది గెలుపు
- నేడు మహిళల రాజకీయ సాధికారత దినోత్సవం

10లో

జాతీయం..

ఆ ఐదుచోట్ల అమీతుమీ

లోక్‌సభ రెండో విడత ఎన్నికల్లో భాగంగా గురువారం దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల పరిధిలోని 89 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. వాటిలో బిహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లోని ఐదు లోక్‌సభ స్థానాల్లో హోరాహోరీ పోరు నెలకొంది. 11లో

ఆంధ్రప్రదేశ్

ఆర్థికాభివృద్ధి అదుర్స్

బాబు పాలనలో కంటే సీఎం జగన్ హయాంలోనే ఎక్కువ అభివృద్ధి 12లో

మేం 10 సీట్లు గెలిస్తే పాలిటిక్స్‌లో మార్పులు

- బీఆర్‌ఎస్‌కు మంచి భవిష్యత్తు: మాజీ మంత్రి కేటీఆర్
- సీక్వెల్ మోసంతో రేవంత్‌రెడ్డి రెడీగా ఉన్నారు
- కాంగ్రెస్ పాలనపై ప్రజలు కోపంగా ఉన్నారు
- బీజేపీ వాళ్లు ఏమీ చేయలేక జైశ్రీరాం అంటున్నారు..
- అలంపూర్ సభలో ప్రసంగం



అలంపూర్: కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని సంకల్పిస్తే, దురదృష్టవశాత్తు 39 సీట్లలోనే గెలిచామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. 14 సీట్లలో వెయ్యి, రెండు, నాలుగు వేల తేడాతో ఓడిపోయామని, ఆ 14 సీట్లు గెలిచి ఉంటే మనదే ప్రభుత్వం ఉండేదని చెప్పారు. లేదా వాటిలో ఆరు సీట్లు గెలిచినా ప్రధాన పాత్ర పోషించేవారమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 8 నుంచి 10 సీట్లు గెలిస్తే రాష్ట్ర రాజకీయాల్లో చాలా మార్పులు వస్తాయని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో, అలంపూర్ చౌరస్తాలో జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడారు. 'సీక్వెల్ సినిమాల తరహాలో మిగతా 3వ పేజీలో ▶

రేవంత్ నిజం చెప్పారు

సాక్షి, వరంగల్: 'అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలిచ్చి గద్దెనెక్కిండు రేవంత్... అయితే తప్పు రేవంత్‌రెడ్డిది కాదు... ఎందుకంటే ఆయన చాలా స్పష్టంగా, నిజాయితీగా చెప్పిండు ఎన్నికలకు ముందు టీవీ చర్చా వేదికల్లో. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారు... ప్రజలు మోసపోవాలనే కోరుకుంటారు... అందుకే మేం మోసం చేస్తాం అని చెప్పారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. వరంగల్, హనుమకొండలో మంగళవారం జరిగిన వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. తప్పు ఎవరిదన్నా ఉందంటే మనదే తప్పు ఇంకెవరిదీ కాదన్నారు.

క్లుప్తంగా...

'పాలమూరు-రంగారెడ్డి' కేసు విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ బీఆర్ఎస్ నేత నాగం జనార్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బేలా ఎం. త్రివేదిల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. పాలమూరు-రంగారెడ్డి పథకంలో నిర్మాణ సంస్థ రూ. 35 వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై వెంటనే విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమయంలో తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది దేవీనా సైగల్ జోక్యం చేసుకొని రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని సూచనలు అందాల్సి ఉందని, విచారణ జూలైకి వాయిదా వేయాలని కోరారు. దీనికి ప్రశాంత్ భూషణ్ అభ్యంతరం తెలపగా.. ప్రభుత్వాలు మారినప్పుడు ఇదంతా సహజమని, కొంత ఓపిక పట్టాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. అనంతరం మే 17 లోపు ఈ పిటిషన్‌ను జాబితాలోకి చేర్చవద్దని రిజిస్ట్రీని జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు.

శివబాలకృష్ణ కేసులో మరో ముగ్గురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా శివబాలకృష్ణకు బినామీలుగా వ్యవహరించిన ముగ్గురు ప్రైవేటు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోడవర్తి సత్యనారాయణమూర్తి (ఏ-3), పెంట భరత్‌కుమార్ (ఏ-4), పెంట భరణికుమార్ (ఏ-5)లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ ముగ్గురు శివబాలకృష్ణ టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో భారీగా ఆస్తులు కూడబెట్టడంలో సహకరించినట్లు తెలిపారు. శివబాలకృష్ణ అవినీతి సొమ్ముతో కొనుగోలు చేసే ఆస్తులను కూడా ఈ ముగ్గురి పేరిట రిజిస్టర్ చేయించినట్లు ఆధారాలు సేకరించామన్నారు. ముగ్గురు నిందితులను హైదరాబాద్ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు. అనంతరం వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి



కాచిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాల భర్తీకి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నందగోపాల్, వేముల రామకృష్ణ తదితర ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి ఉద్యోగాల భర్తీ అంశంపై విన్నవించారు.

32 మంది జిల్లా జడ్జీలు, న్యాయాధికారుల బదిలీ


సాక్షి, హైదరాబాద్: రిజిస్ట్రార్ జనరల్ (విజిలెన్స్) 32 మంది సీనియర్ సివిల్ జడ్జి, న్యాయాధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో జిల్లా న్యాయ సేవల అథారిటీ న్యాయాధికారులు కూడా ఉన్నారు. వీరంతా తమ బాధ్యతలను ఉత్తర్వు ల్లో పేర్కొన్న అధికారులకు అప్పగించి..మే 2వ తేదీలోగా కొత్త పోస్టుల్లో చేరాలన్నారు. ఇప్పటికే తీర్పు రిజర్వు చేసిన కేసుల్లో ఈ లో గా తీర్పులు వెలువరించాలని సూచించారు.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల బంద్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బోర్డు ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ కేటాయించిన కోటా మేరకు ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాల నిమిత్తం...నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువకు మొత్తం 5.50 టీఎంసీల జలాల విడుదల పూర్తైన నేపథ్యంలో మంగళవారం నుంచి నీటి విడుదలను నిలిపివేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు సభ్యుడు శంఖువ మంగళవారం ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీకి లేఖ రాశారు.

స్పీకర్ ప్రచారంపై బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్‌పై భారతీయ జనతా పార్టీ ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో స్పీకర్ పాల్గొని.. ఆయనకు ఓటు వేయాలని కోరడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కార్యదర్శి మాధవి, లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ జాయింట్ కన్వీనర్ పవన్ మైత్రేయి ఎన్నికల ప్రధానాధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైనదని, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా పూర్తి నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత స్పీకర్‌కు ఉంటుందని పేర్కొన్నారు.





కళ తప్పిన పాకాల

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధాన నీటి వనరైన పాకాల సరస్సు అడుగంటింది. నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం పాకాల సరస్సు మూడు జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తుంది. గత ఏడాది జూలైలో కురిసిన వర్షాలకు 30 అడుగులకు చేరుకుని నిండుకుండలా మారి పదిరోజుల పాటు మత్తడి (అలుగు) పోస్తూ పరవళ్లు తొక్కింది. అదే సరస్సు ప్రస్తుతం అడుగంటిపోయింది. దీనికిందనున్న పంటలు ఎండిపోతూ.. తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 31 అడుగుల సామర్థ్యం ఉన్న పాకాల సరస్సులో నీరు ప్రస్తుతం 18 అడుగులకు చేరుకుంది. - నర్సంపేట

నేడు ఇంటర్ ఫలితాలు

'సాక్షి'లో వేగంగా ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలు బుధవారం ఉదయం 11 గంటలకు వెలువడనున్నాయి. ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేస్తారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా కార్యక్రమంలో పాల్గొంటారు. ఫలితాలు https://tsbie.cgg.gov.in లేదా https://results.cgg.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఇంటర్ బోర్డు తెలిపింది. ఇంటర్ ఫలితాలను అందరికన్నా త్వరగా అందించేందుకు 'సాక్షి' ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఒకే క్లిక్‌తో తేలికగా ఫలితాలు అందించే సాఫ్ట్‌వేర్‌ను అందిపుచ్చుకుంది. www.sakshieducation.com వెబ్‌సైట్‌కు లాగిన్ అయి వేగంగా ఫలితాలు పొందవచ్చని తెలిపింది.

..బీఆర్ఎస్ రద్దు చేస్తావా?

▶ మొదటి పేజీ తరువాయి

చేసి తీరుతానని, రేవంత్‌రెడ్డి మాట ఇస్తే ఎలా ఉంటుందో నీ మామ కేసీఆర్‌ను అడుగు..ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే నాటికి రాష్ట్రంలో రూ.3,900 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉందని, పదవి తీసుకున్న నాలుగు నెలల్లో నీ మామ చేసిన లక్షల కోట్ల అప్పులకు రూ. 26 వేల కోట్ల కిస్తీలు చెల్లిస్తూ.. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు అందిస్తున్నాం. కావాలంటే లెక్కలతో సహా నీకు, నీ మామకు చూపడానికి మేము సిద్ధంగా ఉన్నాం'అంటూ తనదైన శైలిలో మాజీ మంత్రి హరీశ్‌రావుపై మండిపడ్డారు. రుణమాఫీతోపాటు వచ్చే పంటకే వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారు.

దొంగలకు సద్ది మోస్తున్నరు..

పాలమూరు నుంచి ఎంపీగా గెలిచిన కేసీఆర్ తెలంగాణ ఏర్పడి అధికారంలోకి వచ్చి పదేళ్లలో ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. కుర్చీ వేసుకొని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి ఫామ్‌హౌస్‌లో పడుకున్నాడని చెప్పారు. పగోడి చేతులో చురకత్తులుగా మారి, ఇక్కడి నాయకులు దొంగలకు సద్ది మోస్తున్నారని మండిపడ్డారు. తమను రేవంత్‌రెడ్డి తిడుతున్నారని అరుణమ్మ, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అంటున్నారని..వారితో తనకేం తగాదా, పంచాయితీ లేదన్నారు. గతంలో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సుముఖంగా ఉన్నప్పటికీ మంత్రిగా ఉన్న డీకే.అరుణ నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు సాగునీరు రాకుండా ప్రాజెక్టులను అడ్డుకున్నది వాస్తవం కాదా.. మరోమారు నరేంద్రమోదీ చేతిలో చురకత్తిగా మారి పాలమూరు కడుపులో ఎందుకు పొడుస్తున్నావంటూ ప్రశ్నించారు. 70 ఏళ్ల తర్వాత పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం వచ్చిందని, ఈ ఐదేళ్లు రాజకీయాలకతీతంగా జెండాలు, ఎజెండాలు పక్కనబెట్టి ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో దేశంతో పోటీపడేందుకు తనకు సహకరించాలని కోరారు. అభివృద్ధి ఆలోచన చేయకుండా కాళ్లలో కట్టెలు



బిజినేపల్లి సభలో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కోరుతున్న సీఎం రేవంత్

పెట్టడం ధర్మమా? అని ప్రశ్నించారు.

కేసీఆర్‌కు ఓటేస్తే.. మోదీకి అమ్ముకుంటడు..

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటే నాకు గౌరవం ఉంది. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కేసీఆర్ ఇబ్బందులు పెడితే మేం అండగా ఉన్నాం. ప్రజాజీవితంలోకి వచ్చి దొరలకు వ్యతిరేకంగా ప్రవీణ్‌కుమార్ పోరాటం చేశాడు. ఆరు నెలల్లో ఏం మారింది.. ఎందుకు కేసీఆర్‌ను నమ్ముతుండో సమాధానం చెప్పాలి. 4 కోట్ల మంది తిరస్కరించి కేసీఆర్‌కు గొయ్యి తవ్వితే, ఆ సమాధికి పూలదండలు వేసి భుజాలపై మోస్తున్నవు. ఎస్సీ వర్గీకరణ పేరుతో కేసీఆర్ పదేళ్లు మోసం చేశాడు. ఆయనతో చేరిన నువ్వు వర్గీకరణకు వ్యతిరేకమా? ఏనుగు తిరిగి దోమ దగ్గరకు ఎందుకు పోయిందో చెప్పాలి. దోమకు ఎంతపెద్ద తొండం ఉన్నా ఏనుగు అవుతుందా'అని రేవంత్ ప్రశ్నించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు టీఎస్పీఎస్సీ చైర్మన్ ఇస్తామని నిర్ణయం తీసుకున్నామని, కానీ ఎందుకు తిరస్కరించారో తెలియదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవీణ్‌కుమార్ డీజీపీ అయ్యేవారని, సీఎం స్థాయి పదవితో గౌరవించుకునే వారమని చెప్పారు. సన్‌స్ట్రోక్ దెబ్బతో ఎంపీ రాములును ఆయన కొడుకు పదవి కోసం ఇంట్లో పెట్టి తాళం వేస్తే.. బీజేపీకి పోయి టికెట్ తెచ్చుకున్నాడని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటేస్తే తిరిగి మోదీకే అమ్ముకుంటాడని, గత పదేళ్లలో ప్రతీసారి ఈ కేడీ మద్దతు పలికింది మోదీకే కదా అని వ్యాఖ్యానించారు.

పాలమూరు అభివృద్ధి నా జీవితాశయం..

పాలమూరులో తనకు ఎవరూ శత్రువులు లేరని, తనకెవరూ పోటీ కాదని చెప్పారు. పాలమూరు జిల్లా అభివృద్ధి తన జీవిత ఆశయమన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్ని కోట్లు ఖర్చయినా నాలుగున్నరేళ్లలోనే పూర్తిచేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. తమ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపిస్తే వర్గీకరణకు కృషి చేస్తామన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే పని కోసం తనకు సహకారం అందించాలని చెప్పారు.

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించి రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన పాలమూరు ప్రజలు తనను కూడా ఎంపీగా ఆశీర్వదిస్తే.. సీఎంకు సోదరుడిగా రేవంత్‌రెడ్డి గొంతుకనై ఢిల్లీలో పాలమూరు ప్రజల కోసం పోరాడుతానన్నారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థి మల్లురవి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. ఆయా సమావేశాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, మనోహర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్‌బోర్డు చైర్మన్ గురున్నాథ్‌రెడ్డి, మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్ పాల్గొన్నారు.

బావాజీని దర్శించుకున్న సీఎం రేవంత్

మద్దూరు/కోస్గి: నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలోని శ్రీ గురులోకామాసంద్ ప్రభు(బావాజీ)ను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. మొదటగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రేవంత్‌కు గిరిజన సంప్రదాయంలో స్వాగతం పలికి సన్మానించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, కొడంగల్ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూలిన వంతెన

▶ మొదటి పేజీ తరువాయి

మూడు గడ్డర్లు విరిగి నేలమట్టమయ్యాయి. సిమెంట్ దిమ్మెలకు బదులు కర్రలు పెట్టి గడ్డర్లు బిగించడంతో వర్షానికి తడిసి నానిపోయి మానేరులో నిర్మించిన తాత్కాలిక రోడ్డుపై అవి కూలిపోయాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ రోడ్డుపై పగలు వందలాదిమంది ప్రయాణాలు సాగిస్తుంటారనీ, వంతెన గడ్డర్లు పగలు కూలి ఉంటే ఊహించని ప్రాణనష్టం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రమాదకర పరిస్థితుల్లో మరో ఐదు గడ్డర్లు..

నంబర్ 2, 3 పియర్ల మధ్య ఓ వైపు ఉన్న మూడు గడ్డర్లు కూలిపోగా, మరో పక్క రెండు ఒంగడంతో కూలే పరిస్థితులు ఉన్నాయి. అలాగే 23, 24 పియర్లపైనున్న మరో మూడు గడ్డర్లు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి.



మహాముత్తారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే: ఎస్ఈ

ఆర్ అండ్ బీ జగిత్యాల ఎస్ఈ చందర్‌సింగ్, ఈఈ రాములు, గోదావరిఖని ఏసీపీ రమేశ్ మంగళవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఈ చందర్‌సింగ్ మాట్లాడుతూ, బలమైన గాలుల ధాటికి వంతెనలు కూలవని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇది కూలిందన్నారు.

విచారణ చేపడతాం: మంత్రి శ్రీధర్‌బాబు

గత ప్రభుత్వంలో చేపట్టిన బ్రిడ్జీల నిర్మాణాల నాణ్యత ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, మొన్న కాళేశ్వరం నేడు ఓడేడ్ వంతెన కూలిపోవడమే నిదర్శనమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహాముత్తారం ప్రచారానికి వచ్చిన ఆయన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి మీడియాతో మాట్లాడారు. బ్రిడ్జి కడుతుండగానే గాలికి కూలిపోవడం దారుణమన్నారు. ఇలాంటి నిర్మాణాలు నిర్మించిన ఘనత గత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

రానున్న రెండ్రోజులు వడగాడ్పులు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువే

- దేశంలోని నాలుగు రాష్ట్రాలకు హీట్‌వేవ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ
- తెలంగాణ, ఏపీల్లో తేలికపాటి వర్షాలకూ అవకాశమని ప్రకటన

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు సూచించింది. ఉక్కపోత మరింత పెరుగుతుందని వివరించింది. మంగళవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా టీక్యాతండాలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఖమ్మంలో 42.5 గరిష్ట ఉష్ణోగ్రత డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కాగా, నల్లగొండ, భద్రాచలం, హైదరాబాద్‌లో 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైంది. మిగతా ప్రాంతాల్లో కూడా గరిష్ట ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదయ్యాయి.

ఆ నాలుగు రాష్ట్రాల్లో హీట్‌వేవ్

దేశంలోని పలు రాష్ట్రాల్లో రానున్న ఐదు రోజులు తీవ్రమైన వేడిగాలులు వీస్తాయని, ఉష్ణోగ్రతలు పెరుగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు హీట్‌వేవ్ అలర్ట్ జారీ చేసింది. ఈ 4 రాష్ట్రాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఎండల తీవ్రత దృష్ట్యా ఒడిశా ప్రభుత్వం గురువారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. అయితే. దేశ వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరిగినా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా.. 21 రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



మంగళవారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	42.5	27.0
భద్రాచలం	42.4	27.5
నల్లగొండ	42.0	24.0
మహబూబ్‌నగర్	41.4	27.5
విజయవాడ	41.0	27.0
రామగుండం	40.5	26.2
నిజామాబాద్	40.5	25.5
విశాఖపట్నం	40.4	27.4
మెదక్	40.4	22.0
హైదరాబాద్	40.2	26.5
హనుమకొండ	40.0	25.0
ఆదిలాబాద్	38.8	23.2

వడదెబ్బతో ముగ్గురి మృతి

మంథని/ఆత్మకూర్.ఎస్ (సూర్యాపేట)/వేములవాడ రూరల్: వివిధ ప్రాంతాల్లో వడదెబ్బకు గురై ముగ్గురు మరణించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం శివారు ఊరచెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న అక్కపాక లక్ష్మి (55) మంగళవారం వడదెబ్బకు గురై మృతి చెందింది. చెరువులో పూడిక తీస్తుండగా లక్ష్మి ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే తోటి కూలీలు ఓఆర్ఎస్ తాగించి 108 వాహనానికి సమాచారం అందించారు. కానీ అంబులెన్స్ వద్దకు తీసుకెళ్తుండగానే ఆమె మరణించింది. మృతురాలికి భర్త లింగయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు.



నాగుల బాలయ్య (ఫైల్)

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం కోటినాయక్‌తండాకు చెందిన ధరావత్ గోలియా (70) వడదెబ్బకు గురై వారం రోజులుగా అస్వస్థతకు గురయ్యాడు. స్థానికంగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లికి చెందిన రైతు నాగుల బాలయ్య(51) వడ్లను ఆరబెట్టేందుకు సోమవారం కల్లం వద్దకు వెళ్లాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో అస్వస్థతకు గురై ఇంటికి తిరిగొచ్చాడు. రాత్రి ఆరోగ్యం మరింత క్షీణించడంతో కుటుంబీకులు వేములవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతునికి భార్య దేవేంద్ర, కొడుకు, కూతురు ఉన్నారు.

రెండంకెల బలం

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తిచేశారు. గత పదేళ్ల పాలనలో కేంద్రంలో తమ ప్రభుత్వం సాధించిన ప్రగతితో పాటు, గతంతో పోల్చితే వివిధ వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. గత పదేళ్లలో తెలంగాణకు వివిధ పథకాల ద్వారా కేంద్రం చేకూర్చిన లబ్ధి, వివిధ రంగాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించిన నిధులు తదితరాలు వెల్లడించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం కల్పించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీపై ప్రజల్లో సానుకూలత పెరిగిందని, కేంద్ర ప్రభుత్వానికి వివిధ వర్గాల నుంచి లభిస్తున్న మద్దతు, వరుసగా మూడోసారి మోదీ ప్రధాని అవుతారనే అభిప్రాయం..తెలంగాణలోనూ గట్టిగా పని చేస్తుందని, పార్టీకి డబుల్ డిజిట్ సీట్లు సాధించి పెడుతుందని బీజేపీ నేతలు విశ్వసిస్తున్నారు.

కార్యాచరణ వేగవంతం: డబుల్ డిజిట్ లక్ష్య సాధనకు ఇప్పటికే ప్రాథమిక కసరత్తును పూర్తిచేసిన బీజేపీ.. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికల అమలును వేగవంతం చేసింది. వివిధ సామాజిక వర్గాలను కలుసుకునేందుకు కార్యక్రమాలను చేపడుతోంది. జిల్లా లు, పార్లమెంట్ నియోజకవర్గాలు, అసెంబ్లీ సెగ్మెంట్ల స్థాయిలో వివిధ కుల సంఘాలతో సమ్మేళనాలు, యువత, మహిళలు, రైతులు, ఎస్సీలు, ఎస్టీలు ఇలా వివిధ వర్గాల వారితో ఎక్కడికక్కడ వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లను కలవడమే లక్ష్యంగా ముందుకు వెళుతోంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వంటి అగ్రనేతల పర్యటనల సందర్భంగా పెద్ద బహిరంగ సభలను నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించారు. మిగతా ఎన్నికల ప్రచారమంతా ఇంటింటికీ వెళ్లడం, ఓటర్లను కలవడం, కార్నర్ మీటింగ్‌లు లాంటి ఔట్ రీచ్ కార్యక్రమాల ద్వారా నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో రెండోవిడత, వచ్చేనెల 9,10,11 తేదీల్లో మూడోవిడత ప్రచారాన్ని పూర్తిచేయనున్నారు.

రేపు రాష్ట్రానికి అమిత్ షా

బీజేపీ అగ్రనేత అమిత్ షా గురువారం రాష్ట్రానికి రానున్నారు. ఉదయం 9 గంటలకు ఢిల్లీలో బయలుదేరి 11.10 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సిద్దిపేట చేరుకుంటారు. డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు సభ ఉంటుంది. అనంతరం 1.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని రెండున్నర గంటలపాటు అక్కడ ఉంటారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులతో సమావేశమై ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి భువనేశ్వర్‌కు వెళ్తారు.

4, 6, 8 తేదీల్లో మోదీ పర్యటన: రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మే 4, 6, 8 తేదీల్లో ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైనట్టు తెలుస్తోంది. అయితే వీటికి ముందుగానీ ఆ తర్వాత కానీ మరో సభకు అవకాశం ఉందని కూడా చెప్తున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తల్లో జోష్ నింపేలా ఆయన పర్యటన ఉంటుందని సమాచారం. విమానాశ్రయానికి సమీపంలోని ఓ ఇండోర్ స్టేడియంలో ఐటీ వృత్తి నిపుణులతో మోదీ సమావేశమై ఓ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఓటర్లలో యాభై శాతం మంది దాకా మహిళలు ఉండడంతో వీరిని ఆకట్టుకునేలా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మోదీతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర పార్టీ నాయకత్వం నిర్ణయించింది. నల్లగొండ, భువనగిరి, వరంగల్, మహబూబాబా ద్, ఖమ్మం ఎంపీ సీట్లలో ఎన్నికల ప్రచారాన్ని కవర్ చేసేలా జనగామలో లేదా అక్కడికి దగ్గరలో మోదీ పాల్గొనేలా ఓ సభ నిర్వహించాలని భావిస్తోంది. హైదరాబాద్‌లో లేదా నగర శివార్లలో జరిపే భారీ బహిరంగ సభతో తెలంగాణలో మోదీ ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నట్టు సమాచారం.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఈడీ కేసులో 14 రోజులు పొడిగించిన ప్రత్యేక కోర్టు

- కవితను అరెస్టు చేయబోమని చెప్పలేదన్న ఈడీ
- పలువురి వాంగ్మూలాల ఆధారంగానే కవిత పాత్రపై స్పష్టత వచ్చింది
- బెయిల్ పిటిషన్‌పై నేడు కొనసాగనున్న వాదనలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు పొడిగించింది. మరో 14 రోజులపాటు పొడిగిస్తూ మంగళవారం న్యాయమూర్తి కావేరి బవేజా ఆదేశాలు జారీ చేశా రు. మరోవైపు, బెయిల్ కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఈడీ వాదనలు వినిపించింది. కుంభకోణంలో కవిత పాత్రను ధర్మాసనానికి వివ రించింది. కవితను అధికారులు వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. కస్టడీ పొడిగించాలన్న ఈడీ విజ్ఞప్తితో న్యాయమూర్తి ఏకీభవించారు. మే 7న ఉదయం ఆమెను కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఈడీ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. అనంతరం న్యాయమూర్తి విచారణ బుధవారానికి వాయిదా వేశారు.

సమన్లు ఇవ్వబోమని మాత్రమే చెప్పాం..

ఈడీ తరఫున న్యాయవాది జొహెబ్ హొస్సేన్ వాదనలు వినిపిస్తూ కీలకపాత్ర పోషించిన కవితకు బెయిలు నిరాకరించాలని కోరారు. కవిత అరెస్టు విషయంలో చట్టవిరుద్ధంగా, కోర్టు ధిక్కరణకు పాల్పడలేదని స్పష్టంచేశారు. కవితను అరెస్టు చేయబోమని ఎక్కడా అండర్‌టేకింగ్ ఇవ్వలేదని, సమన్లు ఇవ్వబోమని మాత్రమే చెప్పామన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. ఈడీ పరిధి దేశమంతా ఉంటుందని, అందుకే కవిత అరెస్టు విషయంలో ట్రాన్సిట్ ఆర్డర్ అవసరం రాలేదన్నారు. అరెస్టు ప్రక్రియ చట్టబద్ధంగానే జరిగిందని, సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ ఉపసంహరణ దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ కేసులో పలువురి వాంగ్మూలాల ఆధారంగానే కవిత పాత్రపై స్పష్టత వచ్చిందని ఆ తర్వాతే అరెస్టు చేశామన్నారు.

అరుణ్ పిళ్లై ద్వారా వాటా కలిగి ఉన్నారు..

ఇండో స్పిరిట్స్‌లో 33.5 శాతం వాటాను తన ప్రాక్సీ అరుణ్ పిళ్లై ద్వారా కవిత కలిగి ఉన్నారని జొహెబ్ హొస్సేన్ చెప్పారు. హోల్‌సేలర్లకు కమీషన్లు పెంచుతూ మద్యం విధానంలో మార్పులు చేసి సౌత్ గ్రూప్‌నకు అనుకూలంగా మారేలా ఒప్పందం జరిగిందని, కుంభకోణంలో రూ.100 కోట్లు లావాదేవాలు జరిగాయన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి తన కుమారుడు మాగుంట రాఘవ ద్వారా కవితకు ఆమె ఆదేశాల మేరకే రూ.25 కోట్లు ఇచ్చారని, ఈ మేరకు వారిద్దరూ వాంగ్మూలం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి ఆప్ నేత కేజ్రీవాల్, కవిత మధ్య కుదరిన ఒప్పందం మేరకే రూ.100 కోట్లు ఆమ్ ఆద్మీ పార్టీకి ఇచ్చారని మరో నిందితుడు దినేష్ ఆరోరా తన వాంగ్మూలంలో చెప్పారన్నారు. నగదు లావాదేవీలకు సంబంధించి కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు ఫోన్ చాట్‌లోనూ సమాచారం లభ్యమైందని పేర్కొన్నారు. ఆర్థిక నేరాల్లో నగదుకు సంబంధించి ఆధారాలు దొరకడం చాలా కష్టమన్నారు. నిందితుల వాంగ్మూలాలు, సాక్ష్యాల ఆధారంగా కోర్టులు తీర్పులిచ్చిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ఈ కేసులో సూత్రధారి, పాత్రధారి అయిన కవితకు సంబంధించి పలు సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని కోర్టుకు తెలిపారు.

క్లుప్తంగా...



సుదర్శన చక్రానికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రగిరిలో ముగిసిన ఉత్సవాలు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 9 నుంచి జరుగుతున్న వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి సుదర్శన చక్రానికి పవిత్ర గోదావరి నదిలో చక్రస్నానం జరిపించారు. అంతకుముందు నది ఒడ్డునున్న పునర్వసు మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా నిలిపివేసిన స్వామివారి నిత్యకల్యాణ వేడుకలను తిరిగి బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫాంల పంపిణీ



నీలం మధు ముదిరాజ్‌కు బీఫాం అందిస్తున్న మహేశ్‌గౌడ్, జగ్గారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బీఫాంలు తీసుకున్నారు. వారికి మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు బి.మహేశ్ కుమార్‌గౌడ్, టి.జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్, కుమార్‌రావులు బీఫారాలను అందజేశారు. సికింద్రాబాద్, భువనగిరి, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు దానం నాగేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నీలం మధు స్వయంగా బీఫాంలు గాంధీభవన్ నుంచి తీసుకెళ్లగా మిగిలిన స్థానాలకు చెందిన అభ్యర్థుల ప్రతినిధులకు బీఫాంలు అందజేసినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

గడీ ఎక్కడుందో చూపండి! రిజిస్ట్రేషన్ చేసిస్తా..

- సీఎం రేవంత్‌కు రఘునందన్‌రావు సవాల్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు, ఉద్దెర మాటలు మాట్లాడుతున్నారని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మండిపడ్డారు. తాను గడీ నుంచి వచ్చానని సీఎం వ్యాఖ్యానించారని, తన తల్లితండ్రుల పేరిట గడీ ఎక్కడుందో చూపించాలని, సవాల్ విసిరారు. అలా చూపిస్తే.. ఆ గడీని రేవంత్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని చెప్పారు. 48 గంటల్లోగా ఆయన వస్తారో, ఆయన ప్రతినిధి వస్తారో తేల్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా రఘునందన్ దుబ్బాకకు ఏమి చేశారో రెండు బస్సులు పట్టుకుని వస్తానన్న రేవంత్.. రెండు రోజులైనా ఇంకా బస్సులు రాలేదని ఎద్దేవా చేశారు. దుబ్బాక నియోజకవర్గానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో చేపట్టిన కార్యక్రమాల వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని రఘునందన్‌రావు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఈ పుస్తకాన్ని సీఎంకు పోస్టులో పంపనున్నట్లు చెప్పారు.



కనుల పండువగా వీర హనుమాన్ విజయ యాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్ దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వీర హనుమాన్ విజయ యాత్ర కనుల పండువగా సాగింది. వేలాది మంది భక్తులు పోటెత్తారు. రామ్‌లక్ష్మణ్ జానకి జై భోలో హనుమాన్‌కీ నినాదాలతో రోడ్లు మార్మోగాయి. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు వీధులన్నీ కాషాయమయమయ్యాయి. గౌలిగూడ రాంమందిర్ వద్ద కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాజాసింగ్, హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత యాత్రను ప్రారంభించారు. – సుల్తాన్ బజార్



యాదాద్రిలో వైభవంగా తెప్పోత్సవం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని కొండపైన విష్ణు పుష్కరిణిలో తెప్పోత్సవ వేడుకను ఆగమశాస్త్రానుసారం జరిపించారు. శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణికి తీసుకొచ్చారు. అనంతరం పుష్కరిణిలోని మండపం వద్ద స్వామి, అమ్మవార్లకు ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరిణిలో తెప్పోత్సవంగా ఊరేగించారు. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రగతి రథం యాత్ర

బస్సుకు తెలంగాణ భవన్‌లో ప్రత్యేక పూజలు

- బుధవారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న యాత్ర
- అధినేతకు హారతులు పట్టనున్న మహిళలు
- యాత్రలో 100 వాహనాలు.. 200 మంది వలంటీర్లు
- ఎక్కడికక్కడ శ్రేణులు స్వాగతం పలికేలా ఏర్పాట్లు
- తొలిరోజు మిర్యాలగూడ, సూర్యాపేటలో రోడ్ షోలు



మంగళవారం తెలంగాణ భవన్‌లో ప్రగతి రథానికి హారతి ఇస్తున్న పూజారి

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, నల్లగొండ: భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు బస్సు యాత్ర బుధవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మే 10 వరకు 17 రోజుల పాటు జరిగే బస్సు యాత్రలో భాగంగా 40కి పైగా పట్టణాల్లో జరిగే రోడ్ షోలలో కేసీఆర్ పాల్గొని లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కేసీఆర్ ప్రయాణించే బస్సుకు 'తెలంగాణ ప్రగతి రథం' అని నామకరణం చేశారు. ఈ ప్రగతి రథానికి బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కాగా బుధవారం మధ్యాహ్నం కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకుని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు హారతులు పట్టేందుకు వందలాది మంది మహిళలు పార్టీ కార్యాలయానికి తరలిరానున్నారు.

మధ్యాహ్న భోజనం తర్వాత...

భోజనానంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ముఖ్య నేతలు ఆయన వెంట ఉంటారు. సుమారు వందకు పైగా వాహనాలు ప్రగతి రథాన్ని అనుసరించే అవకాశముంది. సుమారు రెండు వందల మందితో కూడిన వలంటీర్ల బృందం కూడా యాత్రలో పాల్గొంటుంది. పార్టీ యువజన, విద్యార్థి విభాగం నేతలతో పాటు సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలు వలంటీర్లుగా వ్యవహరించనున్నారు.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఘన స్వాగతం

తొలిరోజు బస్సు యాత్ర బేగంపేట, ఉప్పల్, ఎల్‌బీ నగర్ మీదుగా విజయవాడ రహదారిపైకి చేరుతుంది. వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్ దాటిన తర్వాత చౌటుప్పల్ పంతంగి టోల్‌ప్లాజా వద్ద అధినేతకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. దీనితో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దారి పొడవునా కేసీఆర్‌కు ప్రజలు, కార్యకర్తలు పెద్దయెత్తున స్వాగతం పలికేలా మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతలకు దిశా నిర్దేశం చేశారు. నకిరేకల్ క్రాస్ రోడ్, నల్లగొండ, మాడుగులపల్లి మీదుగా సాయంత్రం 5 గంటలకు మిర్యాలగూడ ఫ్లైఓవర్ వద్దకు యాత్ర చేరుకుంటుంది. సాయంత్రం 5:30కి రాజీవ్ చౌక్‌వద్ద రోడ్ షోలో కేసీఆర్ ప్రసంగిస్తారు. అనంతరం వేములపల్లి, మాడుగులపల్లి తిప్పర్తి మీదుగా రాత్రి 7 గంటలకు సూర్యాపేటకు చేరుకుని రోడ్ షోలో ప్రసంగిస్తారు. సూర్యాపేటలోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ రాత్రి బస చేస్తారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రచారం తీరుతెన్నులను సమీక్షించి దిశా నిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. సాయంత్రం 4 గంటలకు సూర్యాపేట నుంచి బయలుదేరి చిట్యాల, రామన్నపేట మీదుగా భువనగిరి చేరుకుని అక్కడ జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. అనంతరం రాత్రి బస కోసం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు చేరుకుంటారు. శుక్రవారం నుంచి మరో 15 రోజులు పాటు కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగుతుంది.

కిలోమీటర్ మేర రోడ్ షో

ప్రతిచోటా కిలోమీటర్ మేర రోడ్ షో కొనసాగుతుంది. అనంతరం కేసీఆర్ ప్రసంగిస్తారు. రోజూ రోడ్ షో ముగిసిన తర్వాత లేదా మరుసటి రోజు ఉదయం కేసీఆర్ విలేకరులతో మాట్లాడతారు. దీంతో పాటు ఉదయం వేళల్లో వివిధ సామాజికవర్గాలతో భేటీలు, క్షేత్ర స్థాయి సందర్శనలు ఉంటాయని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాగా కేసీఆర్ బస్సు యాత్ర వెంట వెళ్లే వలంటీర్లకు ఎక్కడికక్కడ బస ఏర్పాట్లు చేశారు. పార్టీ జిల్లా కార్యాలయాల్లో భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

.. కేసీఆర్‌ను తిట్టుడు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కేవలం మేడిగడ్డ బ్యారేజీ మూడు పిల్లర్లలో ఏర్పడిన సమస్యను పరిష్కరించకుండా తనను అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇది కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకోవడం తెలియని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. తన కళ్ల ముందే తెలంగాణను నాశనం చేస్తానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మోదీ పాప కృత్యానికి పాల్పడ్డారు

ఢిల్లీ లిక్కర్ కేసు ప్రధాని మోదీ పొలిటికల్ స్కామ్‌లో భాగమని కేసీఆర్ పేర్కొన్నారు. తన కూతురు కవిత అరెస్టు ద్వారా మోదీ పాప కృత్యానికి పాల్పడ్డారని విమర్శించారు. లిక్కర్ కేసు నుంచి కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నుంచి పిడికెడు మంది నేతలు మాత్రమే బయటకు వెళ్లారని, కడియం శ్రీహరి రాజకీయంగా తనను తానే భూస్థాపితం చేసుకున్నాడని వ్యాఖ్యానించారు. రేవంత్ ఏక్‌నాథ్ షిండే అవుతాడని బీజేపీ నేతలు అంటున్నా ఆయన ఖండించడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారతాయని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీని తిరిగి టీఆర్‌ఎస్‌గా మార్చే అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌పై చిల్లర ఆరోపణలు

ఫోన్ ట్యాపింగ్ సీఎంకు సంబంధించిన వ్యవహారం కాదని, తనపై చిల్లర ఆరోపణలు చేస్తున్నారంటూ కేసీఆర్ కొట్టి పారేశారు. కేసీఆర్ ఇమేజీని డ్యామేజ్ చేయాలనే ప్రయత్నం నెరవేరదని, ప్రజలు అన్నీ గమనించి బుద్ధి చెప్తారని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు తమ పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నారని, సందర్భాన్ని బట్టి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటును కొట్టి పారేయలేమని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

నేనే సీఎం అవుతా..

కేసీఆర్ ప్రజ్వలంగా, ఉజ్వలంగా రాష్ట్ర రాజకీయాల్లోకి తిరిగి వస్తాడని, మళ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 98 స్థానాల్లో గెలుస్తుందని, తానే సీఎంను అవుతానని మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. సమయం సందర్భాన్ని బట్టే నాయకులు తయారవుతారని, కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎవరినీ తాను ఉద్దేశపూర్వకంగా ప్రోత్సహించలేదని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 8 నుంచి 12 స్థానాల్లో విజయం సాధిస్తుందని, బీజేపీకి ఒక సీటుకు మించి వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఆంధ్రాలో ఎవరు గెలిచినా తమకు సంబంధం లేదని, ఎవరు అధికారంలోకి వచ్చినా తమకు బాధలేదని పేర్కొన్నారు. అయితే వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనే సమాచారం తమకు ఉందని కేసీఆర్ తెలిపారు.

ఎక్సైజ్ శాఖకు 'బదిలీ' మినహాయింపు ఎందుకు?

- రేపట్లోగా చెప్పాలి.. ఈసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులను బదిలీ మార్గదర్శకాల పరిధి నుంచి ఎందుకు మినహాయించారో వివరిస్తూ 24 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఎక్సైజ్ అధికారులకు ఎన్నికల బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బొందిలి నాగాధర్ సింగ్ పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

విదేశీ వ్యవహారాల్లో భారత్ విశ్వబంధు

మోదీ పాలనలో అత్యంత సురక్షిత దేశం

- విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడి
- 'ఫోరమ్ ఫర్ నేషనలిస్ట్ థింకర్స్' సదస్సులో ప్రసంగం
- పాల్గొన్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, జేపీ



సదస్సులో కేంద్ర మంత్రులు జైశంకర్, కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విదేశీ వ్యవహారాల్లో భారత్‌ను విశ్వబంధుగా తీర్చిదిద్దామని.. ప్రపంచమంతా ఇప్పుడు మన దేశం వైపు చూస్తోందని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. మనతో కలసి పని చేసేందుకు ఎన్నో దేశాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. మంగళవారమిక్కడ ఓ హోటల్లో ఫోరమ్ ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో విదేశాంగ విధానంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో జైశంకర్ 'భారత విదేశాంగ విధానం- సందేహం నుంచి విశ్వాసం వైపు పయనం' అనే అంశంపై మాట్లాడారు. 'ఒకప్పుడు సరిహద్దు సమస్యలు అంటే ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేవి. వాటికి పరిష్కారం చూపి రక్షణ పరంగా బలమైన దేశంగా నిలిచాం. మోదీ పదేళ్ల పాలనలో భారతే అత్యంత సురక్షిత దేశంగా అంతా భావిస్తున్నారు. చైనా విషయంలో జాగ్రత్తగా ఉండాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ చెప్పినా.. అది మిత్రదేశమేనంటూ నెహ్రూ వినలేదు. నాటి నెహ్రూ తప్పిదంతో కశ్మీర్ సమస్య తలెత్తింది. కొంత భూ భాగం పాక్ అధీనంలోకి వెళ్లింది. కశ్మీర్ విషయంలో నాటి నెహ్రూ తప్పిదాలను పదేళ్లలో ప్రధాని మోదీ సరిచేశారు' అని వెల్లడించారు.

ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

'ఈ పదేళ్లలో ప్రపంచంలోనే మన దేశం ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. మోదీ గ్యారంటీ దేశంలోనే కాదు.. విదేశీ పాలసీతో ప్రపంచ వ్యాప్తంగా మోదీ గ్యారంటీగా మారింది. మన విదేశాంగ విధానంతో ప్రపంచ దేశాలతో అత్యంత సఖ్యత ఏర్పడింది. 125 దేశాల్లో ఎంబసీలు నెలకొల్పాం' అని జైశంకర్ వివరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మే 12న ఆదివారం సెలవు తీసుకుని, 13న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత, భవిష్యత్, అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు. 500 ఏళ్ల తర్వాత రాముని జన్మభూమిలో సీతారామ కల్యాణం జరిగిందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలైనా, భారత్‌ను జైశంకర్ కాపాడారని లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ కితాబిచ్చారు.



మేం 10 సీట్లు గెలిస్తే పాలిటిక్స్‌లో మార్పులు

▶ మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ ఎన్నికల కోసం సీఎం రేవంత్‌రెడ్డి సీక్వెల్ మోసంతో రెడీగా ఉన్నారు. రేవంత్‌రెడ్డి మోసం పార్టు-1లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచాక డిసెంబర్ 9న ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. మీలో ఎవరైనా రుణాలు తీసుకోని వారు ఉంటే పరుగు పరుగున పోయి లోన్లు తీసుకోండి.. అని చెప్పిన ఆయ న మే 9 వస్తున్నా రుణమాఫీ చేయలేదు. మోసం పార్ట్-2లో పార్లమెంట్ ఎన్నికల కోసం ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని చెబుతున్నారు' అని కేటీ ఆర్ అన్నారు. అంతకు ముందు కేటీఆర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు.

అవన్నీ ఇచ్చి మాట్లాడు..

'మొగోడివైతే ఒక్క సీటు గెలవమని మన పార్టీ గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి భాషలోనే అడుగుతున్నా... నీవు మొగోనివైతే రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపెట్టు. మొగోడివైతే కోటీ 67 లక్షల ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇవ్వు. కేసీఆర్ ఒకరికే ఇస్తున్నాడు నేను ముసలవ్వకి ముసలాయనికి ఇద్దరికీ రూ.4వేలు ఇస్తానని చెప్పావు కదా.. మొగోడివైతే 46 లక్షల మందికి ఆసరా పింఛన్ ఇచ్చి మాట్లాడు' అని కేటీఆర్ అన్నారు. మొన్న మహబూబ్‌నగర్‌కు వచ్చి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నానని ఒక సీఎం మాట్లాడని మాటలు రేవంత్ మాట్లాడారని కేటీఆర్ దుయ్యబట్టారు. 'సూర్యాపేటలో రష్ ఉన్న బస్సులో ఓ వ్యక్తి దొంగతనానికి ప్రయత్నిస్తుండగా.. ప్రయాణికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు జేబులు వెతికితే కత్తెర దొరికిందని అడిగితే.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాడు ఆయను పట్టుకోండి సార్ అని చెప్పారు' అని చమత్కరించారు.

బీజేపీ వాళ్లకు చెప్పుకోవడానికేమీ లేదు..

బీజేపీ వాళ్లు అక్కడక్కడ ఎగురుతున్నారని, పదేళ్లలో రాష్ట్రానికి మోదీ చేసిందేమి లేదని కేటీఆర్ అన్నారు. బీజేపీ వాళ్లు చెప్పుకోవడానికి ఏమీలేదని, అందుకే జైశ్రీరాం అంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. శ్రీరాముడు బీజేపీకి ఒక్కడే దేవుడు కాదని.. ఆయన అందరి వాడన్నారు. దేవుళ్ల పేరు చెప్పుకొని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మి మోసపోవద్దు: కేటీఆర్

రాజేంద్రనగర్ (హైదరాబాద్): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో చేవెళ్ల పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకొని ముందుకొస్తోందని... కాంగ్రెస్ దొంగ హామీలతో ప్రజలను మోసం చేసేందుకు మరోసారి వచ్చిందన్నారు. రెండు పార్టీలను చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించాలని గట్టిగా నమ్మే వ్యక్తి కేసీఆర్ అని చెప్పారు. అందుకే చేవెళ్ల పార్లమెంటులో మొదటిసారిగా బడుగు, బలహీన వర్గానికి చెందిన వ్యక్తికి కేసీఆర్ టికెట్ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.



అనిత్య భావన బుద్ధుని కాలం కంటే ముందే వున్నా, దాన్ని బుద్ధుడు బోధించినంత లోతుగా, గంభీరంగా ఎవరూ చెప్పలేదు.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 24 ఏప్రిల్ 2024

ఛాంపియన్ దేశం

భారత చదరంగ క్రీడావనికి ఇది మరో శుభవార్త. మన దేశం నుంచి మరో చిచ్చరపిడుగు వచ్చాడు. తెలుగు కుటుంబానికి చెందిన దొమ్మరాజు గుకేశ్ పట్టుమని 17 ఏళ్ళ వయసులో ప్రపంచస్థాయిలో సత్తా చాటాడు. అరంగేట్రంలోనే ప్రపంచ చదరంగ క్రీడా పర్యవేక్షక సంస్థ (ఫిడే) వారి 'క్యాండిడేట్స్ 2024'లో గెలిచాడు. అదీ... చదరంగపుటెత్తుల్లో చలాకీతనం చూపుతూ, చులాగ్గా గెలిచాడు. కొద్ది నెలల్లో జరిగే ప్రపంచ ఛాంపియన్ పోటీలకు ఎన్నికయ్యాడు. 138 సంవత్సరాల ప్రపంచ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే చిన్న వయసువాడిగా వరల్డ్ టైటిల్ కోసం పోటీపడనున్నాడు. ఒకవేళ ఆ విశ్వవేదిక పైనా గెలిస్తే, అతి పిన్నవయస్కుడైన వరల్డ్ ఛాంపియన్‌గా కొత్త చరిత్ర సృష్టించనున్నాడు.

ఒక్క గుకేశ్ విజయమే కాక భవిష్యత్ ఆశాకిరణాలూ అనేకం ఉండడం గమనార్హం. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్ళు పాల్గొనే 'క్యాండిడేట్స్'లో ఉన్నదే 16 మంది. అందులో ముగ్గురు మగవాళ్ళు (గుకేశ్, విదిత్, ఆర్. ప్రజ్ఞానంద), ఇద్దరు ఆడవారు (కోనేరు హంపీ, ఆర్. వైశాలి)తో మొత్తం అయిదుగురి అతి పెద్ద బృందం భారత్‌దే. ఇంతమంది ఆటగాళ్ళు ఈ క్లిష్టమైన అలాగే, 2024 ఏప్రిల్ నాటి 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో టాప్ 25లో అయిదుగురు భారతీయ పురుషులే. ఇక, మహిళల ర్యాంకింగ్స్‌లో టాప్ 15లో ముగ్గురు మనవాళ్ళే. జూనియర్ ర్యాంకింగ్స్‌కు వస్తే టాప్ 20లో ఏడుగురు భారతీయులే. అదే టాప్ 30 జూనియర్స్‌ని గనక లెక్క తీస్తే మూడింట ఒక వంతు మన దేశీయులే. ప్రపంచ చదరంగ వేదికపై అంతకంతకూ విస్తరిస్తున్న భారతదేశ స్థాయికీ, స్థానానికీ ఇదే సాక్ష్యం.

'చదరంగంలో భారత్ విశేష కృషి చేస్తోంది. అనతికాలంలో ప్రపంచంలో అగ్రశ్రేణి చదరంగ దేశమవుతుంది' అని ప్రపంచ మాజీ ఛాంపియన్ మ్యాగ్నస్ కార్ల్‌సెన్ గత ఏడాది వ్యాఖ్యానించారు. ఇప్పుడదే నిజమవుతోంది. నిజానికి, మన దేశంలో చదరంగ క్రీడ ఇంత శరవేగంతో విస్తరించడానికీ, విస్ఫోటనం చెందడానికీ అనేక కారణాలున్నాయి. ఇంటర్నెట్ డేటా ప్యాక్‌లు చౌక కావడం, మొబైల్ ఫోన్లలో సైతం సులభంగా అందుబాటులో ఉన్న చెస్ యాప్‌లు వగైరా వల్ల జనసామాన్యంలో ఈ క్రీడ వేగంగా, బలమైన పునాది వేసుకుంటోందని నిపుణుల విశ్లేషణ. ఇంటర్నెట్ వ్యాప్తి వల్ల ఇప్పుడు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని పిల్లలు సైతం మెట్రో నగరాల్లోని అత్యుత్తమ కోచ్‌ల నుంచి ఆన్‌లైన్ చెస్ పాఠాలు నేర్చే వీలొచ్చింది. కరోనా అనంతరం ఆన్‌లైన్ టోర్నమెంట్‌లు పెరగడం కూడా భారతీయ యువకిశోరాలకు కలిసొచ్చింది. సూపర్ గ్రాండ్ మాస్టర్ల తోనూ, చివరకు ప్రపంచ మాజీ ఛాంపియన్లతోనూ తలపడి అనుభవం, ఆశ్చర్యకరమైన ఫలితాలు సాధించే అవకాశం దక్కింది.

అగ్రశ్రేణి క్రీడాకారులు ఆట మానేశాక, కోచ్‌లుగా మారడమూ కొత్త తరానికి వరమైంది. గ్రాండ్ మాస్టర్లు ఆర్బీ రమేశ్ (ప్రజ్ఞానంద, వైశాలికి కోచ్), విష్ణుప్రసన్న (గుకేశ్‌కు కోచ్), శ్రీనాథ్ నారాయణన్ (అర్జున్, నిహాల్ సరీన్‌ల ట్రైనర్), సూర్యశేఖర్ గంగూలీ (విదిత్‌కు కోచ్) లాంటి వారు, వారి శిక్షణలో ఆరితేరిన ఆటగాళ్ళే అందుకు నిదర్శనం. గ్రాండ్ మాస్టర్లు కాకపోయినప్పటికీ, మంచి చదరంగం ఆటగాళ్ళు దాదాపు 50 వేల మందికి పైగా భారత్‌లో ఉన్నారని సాక్షాత్తూ ప్రపంచ చదరంగ క్రీడా పర్యవేక్షక సంస్థ (ఫిడే) డైరెక్టర్ జనరల్ ఎమిల్ సుతోవ్‌స్కీ అనడం విశేషం. ఇవన్నీ కలసి దేశంలో చదరంగ క్రీడకు సంబంధించిన సువ్యవస్థిత వాతావరణ కల్పనకు దోహదం చేశాయి. 'ఫిడే' సహకారంతో టెక్ మహీంద్రా ధనసాయంతో నడుస్తున్న గ్లోబల్ చెస్ లీగ్ లాంటి టోర్నమెంట్లు సైతం ఆటకూ, ఆటగాళ్ళకూ కొత్త ఉత్సాహం, ఉత్తేజం తెచ్చాయి. వీటన్నిటి ఫలితంగా ఇవాళ 64 చదరపు గడుల ఆటలో భారత్ అపూర్వంగా ముందుకు దూసుకుపోతోంది.

'ఈ ప్రపంచంలో ఈ క్షణంలో అత్యంత అస్థిరమైనది ఏమిటంటే, చదరంగంలో భారత నంబర్ 1 స్థానం' అని అజర్‌బైజాన్‌కు చెందిన ఓ గ్రాండ్ మాస్టర్ ఈ ఏడాది జనవరిలో ట్వీట్ చేశారు. ఛలోక్తిగా చెప్పినా, చెస్‌లో నిత్యం కొత్త ప్రతిభావంతులు రంగంలోకి దూసుకువస్తున్న మన దేశంలో ఇప్పుడది అక్షరసత్యం. ఈ ఏడాదిలో ఈ నాలుగు నెలల్లోనే ఆ నంబర్1 కిరీటం మన ఆటగాళ్ళు అయిదుగురి (విశ్వనాథన్ ఆనంద్, గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్, విదిత్) మధ్య ఎప్పటికప్పుడు మారుతూ వచ్చిందంటే మనవాళ్ళలో పెల్లుబుకుతున్న ప్రతిభను అర్థం చేసుకోవచ్చు. యువజన – క్రీడాశాఖ సమకూరుస్తున్న నిధులు, ఆటగాళ్ళ శిక్షణకు అఖిల భారత చదరంగ సమాఖ్య అందిస్తున్న సహకారం, ప్రైవేట్ సంస్థల సహాయం ప్రతిభను పెంచి పోషించడంలో ప్రధానపాత్ర వహించాయి. ఇవాళ దేశంలో 84 మంది గ్రాండ్ మాస్టర్లు, 124 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు, 23 మంది మహిళా గ్రాండ్ మాస్టర్లు, 42 మంది మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్లు ఉన్నారంటే కారణం అదే!

దేశవ్యాప్తంగా 30 వేల మందికి పైగా రేటింగ్ పొందిన రెగ్యులర్ టోర్నమెంట్ చెస్ ఆటగాళ్ళున్నారని ఒక లెక్క. ప్రపంచమంతటిలో ఇందరు ప్రతిభావంతులున్నది మన దేశంలోనే! ప్రపంచ మాజీ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ లాంటివారు చిరకాలంగా ఆదర్శంగా నిలవడంతో, ఎంతో మంది చెస్ వైపు ఆకర్షితులయ్యారన్నది నిజం. సమాజంలోని ఆ ధోరణుల్ని గమనించి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో తగినంత సహాయ సహకారాలు అందించి, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే ఏ క్రీడలోనైనా ఎంతటి అద్భుతాలు చేయవచ్చో భారతీయ చదరంగావని చాటిచెబుతోంది. కఠోర పరిశ్రమతో, కాలగతిలో ఆ ఆటలో ఛాంపియన్ దేశంగా ఆవిర్భవించిన మనం ఈ పాఠాలను ఇతర క్రీడలకూ అనువర్తింపజేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వమూ, ఇతర క్రీడా సంస్థలూ ఆ దిశగా అడుగులు వేస్తే మన క్రీడాలోకం మరిన్ని శుభవార్తలు అందించడానికి సదా సిద్ధంగా ఉంటుంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి పూర్తి (24 గంటలు)
తదుపరి విదియ, **నక్షత్రం:** స్వాతి రా.11.55 వరకు,
తదుపరి విశాఖ, **వర్జ్యం:** లేదు,
దుర్ముహూర్తం: ఉ.11.33 నుండి 12.21 వరకు,
అమృత ఘడియలు: ప.2.15 నుండి 4.01 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సరిహద్దులో చైనాతో కొత్త బెడద

విశ్లేషణ



మేజర్ జనరల్ జిజి ద్వివేది (రిటైర్డ్)

'షావోకాంగ్' పథకం ద్వారా వందల ఆధునిక గ్రామాలను సరిహద్దుల్లో చైనా నిర్మించింది. సరిహద్దు ప్రాంత అభివృద్ధి పేరిట సాగుతున్న ఇది పూర్తిగా నిర్బంధ విస్తరణపై కేంద్రీకృతమైంది. లద్దాఖ్, బారాహోతి, అరుణాచల్ ప్రదేశ్‌లను తన భూభాగాలుగా చూపిస్తూ చైనా 'భౌగోళిక పటాల దాడి'ని కూడా ప్రారంభించింది. ఈ ప్రాంతాల్లోని స్థలాలకు మాండరిన్ పేర్లను ఇవ్వడం అనేది చైనా 'త్రిముఖ యుద్ధవ్యూహం'లో భాగం. టిబెట్, షిన్‌జాంగ్ లలో భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి తర్వాత మాత్రమే, సరిహద్దు ప్రాంతాలలో రోడ్లు, ఉపరితల కమ్యూనికేషన్‌లను అప్‌గ్రేడ్ చేయడం భారత్ మొదలుపెట్టింది. 'ఎత్తుకు పై ఎత్తు' వేయడం కాకుండా, చైనా విస్తరణవాద నమూనాలను సమర్థంగా ఎదుర్కోవడానికి, నవ్య విధానం అవసరం.

సరిహద్దులలో చైనా ఆధునిక గ్రామాలను నిర్మించడం, వాటిని నివాస ప్రాంతాలుగా చేసుకోవడం గురించి తరచుగా వార్తలు వస్తున్నాయి. మార్చ్ 28న, టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న ఘటన 65వ వార్షికోత్సవం సందర్భంగా, భారత్, భూటాన్ సరిహద్దులకు సమీపంలో ఉన్న కొత్త గ్రామాలలో చైనా ప్రభుత్వం అనేక వేడుకలను నిర్వహించింది. తాజా వార్తల ప్రకారం, ఇప్పటికే ఉన్న 628 'సవోకాంగ్' (సంపన్న గ్రామాలు)తో పాటు, మరో 175 సరిహద్దు గ్రామాలను చైనా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉంది.

సరిహద్దు ప్రాంత అభివృద్ధి పేరిట, షావోకాంగ్ చొరవ అనేది నిర్బంధ విస్తరణపై కేంద్రీకృతమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన ద్వారా చైనా సమాజపు సమాన అభివృద్ధిని నిర్ధారించడానికి 1979లో డెంగ్ జియావోపింగ్ ఈ నమూనాను ప్రతిపాదించారు. ప్రస్తుత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ దీనిని, ప్రధాన భూభాగంతో సరిహద్దు ప్రాంతాల ఏకీకరణ వ్యూహంగా మార్చారు. తద్వారా అరుణాచల్‌ప్రదేశ్‌కు ఎదురుగా ఉన్న టిబెట్‌లో దాని భూసరిహద్దుల భద్రతను మెరుగుపరిచారు.

షావోకాంగ్ పథకంలో భాగంగా, 427 మోడల్ గ్రామాలను ఫ్రంట్ లైన్‌లో నిర్మించగా, 201 గ్రామాలు రెండవ శ్రేణిలో ఉన్నాయి. ఈ సంపన్న గ్రామాలు షిగత్సే, లోహ్కా, న్యింగ్చి, ఎన్గారి వంటి ముఖ్యమైన పట్టణాలతో సహా 21 సరిహద్దు కౌంటీలలో విస్తరించి ఉన్నాయి. భూటాన్, అరుణాచల్‌ప్రదేశ్‌లతో సరిహద్దును పంచుకునే లోహ్కా ప్రాంతంలోనే, చైనా 354 'సంపన్న' సరిహద్దు స్థావరాలను అభివృద్ధి చేసింది. ఈ గ్రామాలలో దాదాపు మూడింట ఒక వంతు వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్‌ఏసీ) సమీపంలో నిర్మించారు. మౌలిక సదుపాయాలు సహా, ఈ ఆవాసాల నిర్మాణం కోసం సుమారుగా 4.6 బిలియన్ డాలర్లు కేటాయించారు.

2017 అక్టోబర్‌లో జరిగిన 19వ పార్టీ కాంగ్రెస్‌లో, ప్రతిభావంతులైన చైనీస్ పౌరులు మారుమూల జాతిపరమైన మైనారిటీ ప్రాంతాలలో పని చేయాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. దీంట్లో నిగూఢంగా దాగి ఉన్నది, ప్రధానంగా అక్కడి జనావాసాల స్థితిగతులను మార్చడమే. గత దశాబ్దంలోనే, టిబెట్‌లో హాన్ జనాభా సుమారు 12 శాతం పెరిగింది. కమ్యూనిస్ట్ పాలన అంతిమ లక్ష్యం, టిబెట్ స్వయం ప్రతిపత్తి ప్రాంతంలో పూర్తిగా చైనీకరణను సాధించడం. భారత్, నేపాల్, భూటాన్ సరిహద్దు ప్రాంతాలలో అన్ని సరిహద్దు గ్రామాలకు రోడ్లు, విద్యుదీకరణ, ఆఖరికి ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి నాణ్యమైన సౌకర్యాలు అందించారు. అదనంగా, దాదాపు 206 పారిశ్రామిక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి.

సరిహద్దు నిర్వహణను బలోపేతం చేయడానికి చైనా ఇటీవలి సంవత్సరాలలో రెండు జాతీయ చట్టాలను ప్రవేశపెట్టింది. 2021లో



సరిహద్దులో చైనా నిర్మిస్తున్న ఒక గ్రామం

ఆమోదించిన నేషనల్ డిఫెన్స్ లా, జాతీయ ప్రయోజనాల కోసం పౌర సంస్థలతో కలిసి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పనిచేయడానికి అధిక పాత్రను అందిస్తుంది. ఒక సంవత్సరం తర్వాత, ఆక్రమిత ప్రాంతాలపై చైనా పట్టును ఏకీకృతం చేసేందుకు భూ సరిహద్దు చట్టాన్ని ఆమోదించారు. ఈ చట్టంలోని ఆర్టికల్స్ 10, 43... సరిహద్దు మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి యథాతథ స్థితిని సవాలు చేస్తున్నాయి. ఇది భారతదేశ సరిహద్దు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. లద్దాఖ్, బారాహోతి, అరుణాచల్ ప్రదేశ్‌లను తన భూభాగాలుగా చూపిస్తూ చైనా 'మ్యాప్‌ల దాడి'ని ప్రారంభించింది. ఈ ప్రాంతాల్లోని స్థలాలకు మాండరిన్ పేర్లను ఇవ్వడం అనేది చైనా 'త్రిముఖ యుద్ధవ్యూహం'లో భాగం. ఇది ప్రచారపరమైన, మానసికపరమైన, చట్టపరమైన కోణాలను కలిగి ఉంటుంది.

జూలై 2021లో, జిన్‌పింగ్ లాసాను సందర్శించారు. గత మూడు దశాబ్దాలలో చైనా దేశాధినేత చేసిన మొదటి సందర్శన. ఆయన టిబెట్‌ను 'ఇనుప కవచం'గా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. దీని ప్రకారం, డోక్లామ్, లాంగ్ జు వంటి వివాదాస్పద ప్రాంతాలలోని సరిహద్దు గ్రామాలు ఫార్వర్డ్ పోస్ట్‌లుగా వ్యవహరించడానికి చైనా సైన్యపు రక్షణ ప్రణాళికలలో విలీనం చేయబడ్డాయి. హాన్ జాతికి చెందిన మాజీ సైనిక సిబ్బంది సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. చైనా చర్యలు దాని 'గ్రే జోన్ వార్‌ఫేర్'కు అనుగుణంగా ఉన్నాయి. ఇందులో పౌరులు, పౌరసైనికులు 'నాన్-కాంటాక్ట్' యుద్ధంలో భాగమవుతారు. దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్ కార్యాచరణ దీనికి ఒక ఉదాహరణ.

ఒక స్పష్టమైన విధానం లేనందున, ముఖ్యంగా చైనాకు ఎదురుగా ఉన్న భారత సరిహద్దు ప్రాంతాలు అభివృద్ధి చెందలేదు. టిబెట్, షిన్‌జాంగ్‌లలో భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి తర్వాత మాత్రమే, సరిహద్దు ప్రాంతాలలో రోడ్లు, ఉపరితల కమ్యూనికేషన్‌లను అప్‌గ్రేడ్ చేయడం భారత్ మొదలుపెట్టింది. సరిహద్దు గ్రామాల్లో నివసించే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (వీవీపీ)ని గతేడాది ప్రారంభించారు. దీని ప్రకారం, చైనా సరిహద్దులో కనెక్టివిటీ లోపించిన 168 గ్రామాలను ఈ ఏడాది చివరి నాటికి అనుసంధానం చేయనున్నారు. 19 జిల్లాల్లోని 663 సరిహద్దు గ్రామాల్లో తగిన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.4,800 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు.

చైనా నియంత్రణలో పూర్తిగా ఉండే సవోకాంగ్ పథకానికి విరుద్ధంగా, భారత్ కార్యక్రమం 'హబ్ అండ్ స్పోక్'(ఒక దగ్గరి నుంచి అందరికి) నమూనాను అనుసరిస్తోంది. ఇది జిల్లా పరిపాలన, గ్రామ పంచాయతీల ద్వారా అమలవుతుంది. కేంద్ర ప్రభుత్వ పాత్ర నిధులు ఇవ్వడానికే పరిమితమైంది. వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ ప్రధాన దృష్టి సామాజిక-ఆర్థిక కార్యక్రమాల ప్రచారంపై ఉంది. అయితే, భద్రతా అంశాలను కూడా చేర్చడం ద్వారా ద్వంద్వ-వినియోగ విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉంది.

రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలు, దిబాంగ్ జల విద్యుత్ ప్రాజెక్టు, జలమార్గాలతో సహా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా సరిహద్దుల్లో భారత్ చేపడుతోంది. ఈశాన్య ప్రాంత సమగ్ర అభివృద్ధికి రూ. 12,882.2 కోట్ల నిధులను 'స్థూల బడ్జెట్ సహాయం' కింద సమకూర్చారు.

వివాదాస్పద సరిహద్దు, లద్దాఖ్‌లలో కొనసాగుతున్న ప్రతిష్టంభన దృష్ట్యా, చైనా ప్రణాళిక తీవ్రమైన వ్యూహాత్మక పరిణామాలను కలిగి ఉంది. వాస్తవ నియంత్రణ రేఖ స్థితిని ఏకపక్షంగా మార్చాలనే బీజింగ్ ఉద్దేశం, సవోకాంగ్ పథకంతో మరింత తోడ్పాటును పొందుతుంది. 2005 (ఆర్టికల్ 7)లో పొందుపర్చిన 'సరిహద్దు సమస్య పరిష్కారానికి రాజకీయ పరామితులు, మార్గదర్శక సూత్రాలు' ఒప్పందాన్ని కూడా చైనా విస్మరించింది. ఈ ఒప్పందం ప్రకారం సరిహద్దుల వెంబడి జనాభా ప్రస్తుత అమరికకు ఎవరూ భంగం కలిగించకూడదు.

చైనా విస్తరణవాద నమూనాలను సమర్థంగా ఎదుర్కోవడానికి, నవ్య విధానం అవసరం. 'ఎత్తుకు పై ఎత్తు'పై ఆధారపడిన మన ప్రస్తుత ప్రతిస్పందనా విధానానికి కాలం చెల్లిపోయింది. సరిహద్దు నిర్వహణ మొత్తంగా సమగ్ర సమీక్షకు గురికావాలి. ఇది జాతీయ భద్రతా వ్యూహంలో కీలకమైన అంశంగా ఉండాలి. దురదృష్టవశాత్తూ ఇది ఇప్పటికీ రూపు దాల్చుతూనే ఉంది!

వ్యాసకర్త చైనాకు భారత మాజీ డిఫెన్స్ అటాచె
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎప్పుడేం జరిగేనో?



గాజా కన్నా, ఇరాన్-ఇజ్రాయెల్ దాదాపుగా యుద్ధానికి దగ్గరగా వచ్చాయన్న అంశం కన్నా ఇప్పుడు యూఎస్ విశ్వవిద్యాలయ క్యాంపసుల్లోని టెన్షన్లు మరింత గట్టి వార్తలు అవుతున్నాయి. చిత్రమైన ప్రపంచం!

– కబీర్ తనేజా, ఫెలో

మనుషుల సంగతి?



'ద గాడ్‌ఫాదర్' (1972) వచ్చిన తర్వాత, నేను విన్నదంతా 'జంతువుల పట్ల క్రూరత్వం' గురించే! సినిమాలో 30 మందిని కాల్చి చంపుతారు. కానీ జనం మాత్రం మాట్లాడింది కేవలం 'జంతువుల పట్ల క్రూరత్వం' గురించే!

– ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోలా, దర్శకుడు

ప్రతీకార అవమానం



రింగ్ గర్ల్ వేసుకున్న దుస్తులు సరిగ్గా లేవని ఒక ఇరానియన్ ఎంఎంఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) ఫైటర్ ఆమె మీద దాడిచేశాడు. 30 సెకన్లలోనే అతడిని ఫైట్ నుంచి బయటికి పంపడం అటుండనీ, ప్రేక్షకులు మూకుమ్మడిగా అతడిని చితకబాదారు. మహిళల్ని కొడితే రష్యన్లు అస్సలు సహించరు.

– ఇయాన్ మైల్స్ చియోంగ్, జర్నలిస్ట్

వీటికే ఇలా అంటే...



వైరి రాజకీయ పక్షాల మద్దతుదారుల చర్చలు సోషల్ మీడియాలో మరీ ఘోరంగా, బుద్ధి హీనంగా, నీచంగా, విషపూరితంగా ఉన్నాయని మీకు అనిపిస్తే– క్రికెట్ స్టార్లు, సినిమా తారల అభిమానుల యుద్ధాలను గమనించండి. అవి ఇంకా మురికి కూపాలు!

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

భారత హోరు



అభినందనలు! టోరంటో (కెనడా)లో భారత భూకంపం సంభవించడానికి కారణం, చదరంగ ప్రపంచంలో టెక్టానిక్ ప్లేట్ల మార్పు పరిసమాప్తి కావడమే. ఇక 17 ఏళ్ల డి.గుకేశ్ అత్యున్నత టైటిల్ కోసం చైనీస్ ఛాంపియన్ డింగ్ లీరెన్(31)తో తలపడతాడు. విశ్వనాథన్ ఆనంద్ 'పిల్లలు' రంకెలు వేస్తున్నారు.

– గ్యారీ కాస్పరోవ్, చదరంగ దిగ్గజం

అప్పుడే అన్నేళ్లయ్యిందా?



సరిగ్గా 9 ఏళ్ల క్రితం, ఐపీఎల్ 2015 జరుగుతున్నప్పుడు, శాంతా క్రూజ్ (ముంబయి)లోని సూర్య మదర్ అండ్ చైల్డ్‌కేర్ హాస్పిటల్ వాటర్‌బర్త్ పూల్‌లో 'ఇండియా జీన్స్ రోడ్స్' జన్మించిందని నమ్మలేకపోతున్నా! (తన కూతురుకు ఇండియా అని పేరు పెట్టాడు.)

– జాంటీ రోడ్స్, దక్షిణాఫ్రికా క్రికెటర్

ఎలా అనగలరు?



గతంలో ఏ విధమైన సంబంధాలు లేని ఒక పేద ఆఫ్రికా దేశానికి (రువాండా) తన శరణార్థులను పంపడానికి బ్రిటన్ ప్రయత్నిస్తోంది. అదే తన పొరుగు దేశాల్లో పీడనను ఎదుర్కొంటూ, చారిత్రకంగా, మతపరంగా సంబంధాలు ఉన్నవాళ్లను ఇండియా అంగీకరిస్తే మాత్రం అది వివక్ష అవుతుంది. పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు!

– కన్వల్ సిబాల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

ఇన్ బాక్స్

నాటకంగా... 'మట్టిమనిషి'

నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా 14 భారతీయ భాషల్లోకి అనువాదమై, నన్నయ నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో, పద మూడో రచనగా 'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' ప్రశంసలు పొందిన అత్యుత్తమ నవల వాసిరెడ్డి సీతాదేవి రచన 'మట్టిమనిషి'.

ఈ నవలను ప్రసిద్ధ నాటక రచయిత, నాటక ప్రక్రియ పరిశోధకుడు, 'అరసం' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ నాటకంగా రూపొందించారు. 'డా॥ వాసిరెడ్డి సీతాదేవి మెమోరియల్ ఫౌండేషన్' సహకారంతో నిభా థియేటర్ ఎన్సెంబుల్ ఈ నాటకాన్ని రసరంజని తోడ్పాటుతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏప్రిల్ 24 (నేడు) సాయంత్రం 6.30 గంటలకు ప్రదర్శిస్తోంది. ఈ నాటకానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా గ్రాడ్యుయేట్ నస్రీన్ ఇషాక్ దర్శకత్వం వహిస్తున్నారు.

నవల ఇతివృత్తంలోకి వెళితే... వెంకయ్య కూలీ నుంచి చిన్న రైతుగా మారితే కఠోరశ్రమతో అతని కొడుకు సాంబయ్య భూస్వామిగా రూపొందుతాడు. తన తండ్రి ఏ ఇంట్లో పాలేరుగా పని చేశాడో ఆర్థికంగా చితికిన ఆ ఇంటి యజమాని కూతురు వరూధినిని కోడలిగా తెచ్చుకుంటాడు పట్టుబట్టి. వరూధిని నగర జీవన వ్యామోహంతో భర్తతో సహా నగరానికి కాపురం మారుస్తుంది. అక్కడ రామనాథబాబు అనే వివాహితుడికి చేరువై ఆస్తి మొత్తం పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. భార్యనీ, ఆస్తినీ కోల్పోయిన వెంకటపతి బికారి అవుతాడు. చదువుకుంటున్న తన కొడుకు రవిని గ్రామంలో ఉన్న తండ్రి సాంబయ్య వద్దకు పంపుతాడు. తాతా మనవళ్లిద్దరూ కలిసీ తమ గ్రామంలోని బంజరు భూమిని తిరిగి సాగులోకి తెస్తారు. చివరికి అదీ వారి చేయిజారిపోతుంది.

ఈ నవలను గురించి ఆరుద్ర ఇలా అన్నారు. ''సమాజంలోని ఉత్పత్తి పద్ధతులనూ, వర్గ సంబంధాలనూ, వివిధ మానసిక ప్రవృత్తులనూ, వాటికి గల ఆర్థిక కారణాలనూ విశ్లేషణ చేస్తూ మూడు తరాల జీవితాలతో వివిధ పరిణామాలను నవలలో రచయిత్రి చాలా సామర్థ్యంతో చిత్రించారు.''

– పెనుగొండ లక్ష్మీనారాయణ

(నేడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన)

చట్టసభల్లో మాదిగ ఆకాంక్షలకు ప్రతినిధులేరీ?

అభిప్రాయం



కృపాకర్ మాదిగ

మాదిగల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఆకాంక్షలే మాదిగ వాదం. పార్లమెంట్‌లో మాదిగ వాదానికి ప్రాతినిధ్యం వహించడం, పార్లమెంట్‌లో మాదిగ కులంవారు ఉండటం – రెండూ ఒకటి కాదు! రెండూ వేరువేరు అంశాలు. మాదిగ సమస్యల పరిష్కారానికి పూనుకోనివారు, మాదిగ వాదానికి ప్రతినిధులు కాని వారు, మాదిగ కులం నుంచి పార్లమెంటు, అసెంబ్లీలలో ప్రజాప్రతినిధులుగా ప్రస్తుతం ఎంపిక అవుతున్నారు. రెడ్డి, కమ్మ, వెలమ, బ్రాహ్మణ, కోమటి, కాపు, మాల వారికి ఆధిపత్య సవర్ణ హిందూ రాజకీయ పార్టీలన్నీ సింహభాగం అన్ని రకాల అవకాశాలనూ, ప్రాతినిధ్యాన్నీ కల్పిస్తున్నాయి. కాని, మాదిగలతో సహా ఎంబీసీలు, బీసీలు, సంచార, అర్ధసంచార, అల్పసంఖ్యాక ఎస్సీ కులాల వారికీ, మతపరమైన మైనారిటీలకూ ఏ ఒక్క సవర్ణ హిందూ ఆధిపత్య పార్టీ సరైన ప్రాతినిధ్యం కల్పించడం లేదు. అణగారిన సమూహాల ప్రజలను కేవలం ఓట్ల బ్యాంకుగానే ఈ రాజకీయ పార్టీలు వాడేసుకుంటున్నాయనేది అందరికీ తెలిసిన సత్యం. అందుకే పార్లమెంట్, అసెంబ్లీలలో మాదిగ చర్మకార కులాల ఆకాంక్షలకు గొంతుకనిచ్చే స్వతంత్ర మాదిగ ప్రజా ప్రతినిధులు ఉండటం చాలా అవసరం.

ఆదిమ కాలం నుంచీ చమార్లు, జాతవ్‌లు, మాదిగలు, డక్కలి, చిందు, బైండ్ల, మాష్టి, మోచి, మాంగ్, మాతంగ, మాంగ్ రోడి, అరుంధతీయ, ఆది జాంబవ, చెక్కిలియార్, సమగార్, గొడగలి, గొడారి, పంచమ, ఆది ఆంధ్ర వంటి ఎన్నో పేర్లతో పిలవబడుతున్న సమూహాలు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నాయి. ఉత్తరాది చర్మకార సమూహాలకు బహుజన్ సమాజ్ పార్టీ రాజకీయ ప్రాతినిధ్యం వహిస్తున్నది. భీమ్ ఆర్మీ చంద్రశేఖర్ ఆజాద్ లాంటి యువ నాయకత్వం పెరుగుతా వుంది. కాని, దక్షిణ భారతదేశంలో సుమారు 3 కోట్లమందిగా వున్న చర్మకార మాదిగ కులాలకు, వీరి హక్కుల కోసం ప్రాతినిధ్యం వహించే ప్రభావ పూరితమైన



స్వతంత్ర రాజకీయ పార్టీ కానీ, స్వతంత్ర రాజకీయ నాయకత్వం కానీ, ఇంతవరకు లేకపోవడం చాలా బాధాకరమైన అంశం. మాదిగ చర్మకార కులాలకు దక్షిణ భారతదేశంలో, స్థానికంగా ఒక బలమైన రాజకీయ పార్టీని నిర్మించుకోవలసిన అవసర ఎంతైనా ఉంది. అంబేడ్కర్ ఆలోచన విధానం, మాన్యశ్రీ కాన్షీరామ్ పని విధానాలతో నడవాలి. సంస్కర్త హృదయం కలిగి, అమ్ముడుపోకుండా కృషి చేయగలిగే వారి నాయకత్వంలో ఈ పార్టీ ఉండాలి.

పేదరికం, నిరుద్యోగం, అంటరానితనం, క్వాలిటీ చదువులు లేకపోవడం, చర్మకార కులాల్లో తీవ్రంగా ఉంది. మిగిలిన సమాజం చేయడానికి ఇష్టపడని 'హీన'వృత్తులు అవలంబించడం, అధికమైన పనిగంటలు, శ్రమకి తగిన వేతనాలు లేని ఆధునిక వెట్టి చాకిరీ, మూఢ నమ్మకాలు మాదిగల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ప్రాయోజిత కార్యక్రమాలనే ఉద్యమాలని నమ్మించే పొలిటికల్ ఈవెంట్ మేనేజర్లు తప్ప, ఇప్పుడు చర్మకార కులాల్లో పేరొందిన వర్తమాన ఉద్యమకారులు ఎవరూ లేకపోవడం మరింత కుంగదీసే అంశం.

సవర్ణ హిందూ ఆధిపత్య పార్టీలు ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ డిమాండ్‌ను అపరిష్కృతంగా ఉంచుతున్నాయి. తగిన రాజకీయ ప్రాధాన్యత, ప్రాతినిధ్యాలను ఇవ్వకుండా చర్మ కార మాదిగ కులాల స్వయం గౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయి. చర్మకార కులాల ప్రజలను మోసం చేస్తున్న మనువాద పార్టీలకు ఓట్లు వేయాలని, కొన్ని మాదిగ సంఘాలు, కొందరు మాదిగ 'నాయకులు' ఎన్నికల రాజకీయ ప్రచారం చేస్తున్నారు. వీరి మాటలను చర్మకార కులాల ప్రజలు ఇకపై అసలు నమ్మవద్దు.

2024 మే నెలలో జరగనున్న పార్లమెంటు, కొన్ని అసెంబ్లీలకు జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో తమ ఆత్మగౌరవాన్ని గౌరవించే, తమ రాజకీయ ప్రాతినిధ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చే, చేతల్లో తమ హక్కుల కోసం కృషి చేసే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవడానికి దక్షిణాది రాష్ట్రాల చర్మకార మాదిగ కులాల ప్రజలు ప్రయత్నించాలి.

వ్యాసకర్త ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి | 99483 11667

స్వార్థం నుంచి నిస్వార్థం వైపు...

మానవుడు ప్రధానంగా స్వప్రయోజన దృష్టి గల జీవి. అది అతణ్ణి జీవితాంతం వెన్నంటే ఉంటుంది. దీనికి తోడు ఇతర ప్రాణులకు లేని బుద్ధి బలం కూడా మనిషికి ఉంది.

మనిషి సహజ లక్షణమైన స్వార్థ గుణాన్ని గురించి ఉపనిషత్తులు కూడా వివరించాయి. యాజ్ఞవల్క్య మహర్షి తన భార్య మైత్రేయితో... భార్య భర్తను ప్రేమిస్తున్నదంటే అది తన ఆనందం కోసమే అనీ, భర్త భార్యను ప్రేమిస్తున్నాడన్నా అతని ఆనందం కోసమేననీ అంటాడు. పుత్రుల మీదా, దేశం మీదా మనిషి చూపించే ప్రేమ కూడా తన ఆనందం కోసమే అని చెబుతాడు.



జ్యోతిర్మయం

తనకు ఉపయోగపడేంత వరకే మానవుడు సమాజంతో సంబంధం పెట్టుకుంటాడు. మనిషిలో సహజంగా ఉండే ఈ స్వార్థాన్ని నియంత్రణ లేకుండా వదిలిపెడితే భూమిపై సుఖ శాంతులు పూర్తిగా కరవైపోతాయి. తన స్వార్థ ప్రయోజనాలకు బలహీనులను పట్టి పీడిస్తాడు. పెద్ద చేప చిన్న చేపను మింగినట్లు ప్రవర్తిస్తాడు. కొన్నాళ్ళకు తనూ తన కంటే బలవంతుని చేతిలో బలవుతాడు.

లోక నాశనానికి దారి తీసే ఈ స్వార్థ గుణాన్ని అణచివేసి, మనిషి మనసులో గొప్ప మార్పును భగవత్ చింతన తీసుకొస్తుంది. మానవులకు శాంతిమయ జీవితాన్ని ఇవ్వటానికి భగవంతుడు వివిధ రూపాలలో అవతరిస్తుంటాడు.

ఇహలోకంలో ప్రశాంత జీవితం గడపటానికీ, పరంలో శాశ్వతానందాన్ని పొందటానికీ తగిన ఉపదేశాన్ని మానవాళికి అంద జేసిన అత్యుత్తమ గ్రంథ రాజం భగవద్గీత. రోజుకొక శ్లోకం చదివినా, నేర్చుకున్నా ఆలోచనలు భగవంతునిపై నిలుస్తాయంటారు పెద్దలు. భక్తుడు ఏ దేవతా రూపాన్ని శ్రద్ధగా పూజిస్తాడో అతనికి ఆ రూపంపై శ్రద్ధ నిలిచే టట్లు చేస్తాను అంటాడు భగవంతుడు.

అలా పూజించినందుకు తగిన ఫలాన్ని అందజేస్తాడు. భగవంతుని చింతనలో మనసు పునీతమై, మనిషి నిస్వార్థ జీవిగా మారి, విశాల దృక్పథాన్ని అలవరచుకుంటాడు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి



సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

మీ డ్రీమ్సే నా స్కీమ్స్

ప్రజలందరి కలలు మన సంక్షేమ పథకాలతో సాకారం

విజయనగరం జిల్లా చెల్లూరు మేమంతా సిద్ధం సభలో ఏపీ సీఎం జగన్

- మీ బిడ్డ తెచ్చిన పథకాలు ఏకంగా దాదాపు 40
- చంద్రబాబు పాలనలో స్కీముల్లేవు.. అన్నీ స్కాములే
- మళ్లీ ప్రజల రక్తం తాగడానికి చంద్రముఖిలా మారాడు
- విజయవాడలో కాల్‌మనీ, సెక్స్ రాకెట్లు నడపటం మినహా బాబు చేసిందేమిటి?
- పొలాల్లో దిష్టిబొమ్మనైనా నమ్మొచ్చుగానీ ఆయన్ను మాత్రం నమ్మలేం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ''డ్రీమ్స్ మీవి.. స్కీమ్స్ మీ బిడ్డ జగన్‌వి! ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం కలలను నెరవేరుస్తూ విప్లవాత్మక పథకాలు, వ్యవస్థలు తీసుకొచ్చాం. 58 నెలల పాలనలో మీ అందరి కలలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కాలి''అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం విజయనగరం జిల్లా చెల్లూరు వద్ద నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు.

'చెల్లూరు సభ జనసముద్రాన్ని తలపిస్తోంది. ఒక్కసారిగా లక్షల మంది తాండ్ర పాపారాయుళ్లు శత్రుసైన్యాన్ని చిత్తుగా ఓడించేందుకు సిద్ధమైతే, ఆ యుద్ధం ఎలా ఉంటుందో పేదల వ్యతిరేకులకు రుచి చూపించడానికి నా ఉత్తరాంధ్ర, నా విజయనగరం సిద్ధం సిద్ధం అని అడుగులు వేస్తోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. ఇంటింటి భవిష్యత్తును, తమకు అందుతున్న పథకాలను, ఇంటికే వచ్చే పౌర సేవలను, తమ పిల్లల భవిష్యత్తును రాబోయే ఐదేళ్లు కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రజలంతా గుర్తించారు. వారికి అడ్డుతగులుతున్న ఆ పెత్తందార్లకు, ఆ కౌరవ సైన్యానికి, ఆ నారా సైన్యానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం సిద్ధం అని అడుగులు వేస్తున్న ప్రజాసైన్యం ఈ రోజు నా కళ్ల ఎదుట కనిపిస్తోంది. చంద్రబాబుకు కాంగ్రెస్, బీజేపీ పరోక్షంగా, ప్రత్యక్షంగా మద్దతిస్తున్నాయి. ఇదే చంద్రబాబుకు తోడుగా దత్తపుత్రుడున్నా, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఉన్నాయి. వాళ్లు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అబద్ధాలు కళ్ల ఎదుటే కనిపిస్తున్నాయి. ఒక్క జగన్ మీదకు ఇంతమంది ఏకమవుతున్నారు. జగన్ కనుక ఇంటింటికీ మంచి చేయకపోయి ఉంటే, జగన్‌ను ప్రతీ ఇంట్లోనూ తమ బిడ్డగా, తమ అన్నగా, తమ్ముడిగా భావించకపోతే ఇన్ని తోడేళ్లు ఏకం కావాల్సిన అవసరం ఏముంది? జగన్ ఒకే ఒక్కడు కాదు. నాకున్న ధైర్యం మీరే అని సగర్వంగా చెబుతున్నా. 58 నెలల పాలనలో ఇంటింటికీ చేసిన మంచి నా నమ్మకం. ప్రతీ వర్గాన్ని మోసం చేసిన వారితో ఈరోజు ఎన్నికల కురుక్షేత్రంలో తలపడుతున్నాం. జగన్‌ను ఓడించాలని వారు, పేదల్ని గెలిపించి ఇంటింటి అభివృద్ధిని కొనసాగించాలని మనం చేయబోతున్న ఈ యుద్ధంలో మరో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకునేదానికి మీరంతా సిద్ధమేనా? ప్రజల కలల్ని తన మోసాలతో వంచించడమే పనిగా పెట్టుకున్న చంద్రబాబుకు, ఆ బాబు కూటమికి బుద్ధి చెప్పేందుకు మీరంతా సిద్ధమేనా?

420.. చంద్రముఖి బృందం

వస్తువులు ఎత్తుకుపోయేవారిని దొంగల ముఠా అంటాం. బెదిరించి దోచుకునే వారిని దోపిడీ ముఠా అంటాం. మరి ఎన్నికలప్పుడు నమ్మించి ఆ ప్రజలు ఇచ్చిన అధికారంతో ఐదేళ్లూ మోసం చేసిన చరిత్ర ఉన్న మూడు పార్టీల కూటమిని ఏమనాలి? తియ్యటి మాటలు మేనిఫెస్టోలో చెప్పి ఎన్నికలు అయిపోయిన తరువాత ప్రజల్ని మోసం చేసేవారిని ఏమంటాం? 420 అనే కదా అంటారు. పేదల కలల్ని, బతుకుల్ని బలిపెట్టి దోచుకునేందుకు వచ్చిన ఈ ముఠాను, రాజకీయ కూటమిని చంద్రముఖి బృందం అని కూడా అంటాం.

గ్రామం డ్రీమ్.. జగనన్న స్కీమ్

ఊరికి కూడా కలలుంటాయి. గ్రామంలో అందే సేవలు బాగుంటేనే తమ ఊరు బాగుంటుందని.. ఆ గ్రామాన్ని విడిచిపెట్టి ఎక్కడికెక్కడికో వెళ్లిపోరని.. గ్రామానికి కూడా కల ఉంటుంది. ఆ గ్రామం డ్రీమ్ కోసం మీ జగన్ ఎన్ని స్కీమ్‌లు తెచ్చాడో తెలుసా? ఏకంగా ఏడు స్కీమ్‌లు తెచ్చాడు. ఆ గ్రామంలోనే కనిపిస్తాయి సచివాలయాలు, 60–70 ఇళ్లకో వలంటీర్ వ్యవస్థ, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, నాడు-నేడుతో మారిన ఇంగ్లీషు మీడియం స్కూళ్లు, మహిళా పోలీసు వ్యవస్థ కనిపిస్తాయి. వీటితో పాటు నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు కూడా కనిపిస్తాయి. గ్రామానికే వచ్చిన ఫైబర్ గ్రిడ్.. ఇవన్నీ మీ గ్రామాల్లోనే కనిపించే జగన్ మార్కు విప్లవాత్మక మార్పులు. గ్రామాలే కాకుండా రాష్ట్రం కలలను కూడా సాకారం చేస్తూ విప్లవాత్మక చర్యలు చేపట్టాం

ఏకంగా 40 పథకాలు..

ఏ మనిషికైనా, ఏ కుటుంబానికైనా కొన్ని కలలు, లక్ష్యాలు ఉంటాయి. వాటిని నిజం చేసే మార్గాలు ఉంటే ఆ కుటుంబం ఒక్కో మెట్టు ఎదుగుతూ పోతుంది. అలాంటి పేదల కలల్ని అర్థం చేసుకుని నెరవేర్చేందుకు మీ బిడ్డ పెట్టిన స్కీమ్స్ ఎన్నో తెలుసా? దాదాపుగా 40. ఈ 58 నెలల కాలంలో వాటిని నెరవేర్చేందుకు మీ బిడ్డ ఏకంగా 130 సార్లు బటన్లు నొక్కాడు. ఏకంగా రూ. 2.70 లక్షల కోట్లు నేరుగా అందజేశాడు. నేరుగా నా అక్క చెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లాయి. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. దీనికి తోడు నాన్ డీబీటీ అంటే ఇళ్లస్థలాలు, విద్యాకానుక, టాబ్స్... ఇవన్నీ కలిపి మరో రూ.లక్ష కోట్లకుపైగా ప్రయోజనాన్ని చేకూర్చాం. ఇలా వాళ్ల డ్రీమ్స్.. మీ బిడ్డ స్కీమ్స్ ద్వారా ఏకంగా రూ. 3.75 లక్షల కోట్లు పైచిలుకు లబ్ధి చేకూర్చాడని చెప్పడానికి గర్వపడుతున్నా.

చంద్రబాబు అంటే చంద్రముఖి...

తల్లుల కలలు, బాధల గురించి 14 ఏళ్ల పాలించానని చెప్పుకునే చంద్రబాబు ఏరోజైనా ఆలోచన చేశాడా? ఆయనకు ఆ ఆలోచన ఎందుకు రాలేదంటే కారణం.. చంద్రబాబు అంటే చంద్రముఖి కాబట్టి. పేదలకు మంచి చేయడం కోసం కాకుండా పేదల రక్తం తాగేందుకు లకలకా అని తపిస్తాడు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి..

విజయనగరం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు పరిచయం చేశారు. ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం అసెంబ్లీ అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి, బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థిగా శంబంగి చిన అప్పలనాయుడు,. నెల్లిమర్ల అసెంబ్లీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, రాజాం నుంచి పోటీచేస్తున్న డాక్టరు తలే రాజేష్, గజపతినగరం నుంచి పోటీచేస్తున్న బొత్స అప్పలనరసయ్య, ఎచ్చెర్ల నుంచి పోటీచేస్తున్న గొర్లె కిరణ్‌ను గొప్ప మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు.

భావోద్వేగానికి గురైన మంత్రి బొత్స...

చీపురుపల్లి అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణను సీఎం జగన్ పరిచయం చేసిన సందర్భంలో ఉద్వేగ వాతావరణం నెలకొంది. బొత్స తనకు తండ్రి లాంటివారని, ఆయన్ను ఆప్యాయంగా అన్నా అని పిలుస్తానని సీఎం జగన్ చెప్పడంతో బొత్స ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

అక్కచెల్లెమ్మల సొంతింటి కల...

తమకు సొంత ఇల్లు ఉండాలని ప్రతి అక్కచెల్లెమ్మ కల కంటుంది. కొన్ని కుటుంబాలకు ఇది జీవితకాల కల లాంటిది. వారి డ్రీమ్‌ను నెరవేరుస్తూ 31 లక్షల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి మీ బిడ్డ జగన్ ఇచ్చాడు. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం శరవేగంగా చేపట్టాం.

సీకేవైసీతో సైబర్ నేరాలకు చెక్

- మ్యూల్ ఎకౌంట్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలి
- కేవైసీలో క్రైమ్ హిస్టరీని సైతం జత చేయాలి
- ఆర్బీఐకి టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ సూచనలు
- సైబర్ నేరాలపై తొలిసారిగా అన్ని రాష్ట్రాల పోలీసులతో ఆర్బీఐ సదస్సు
- టీఎస్‌సీఎస్‌బీ సూచనల అమలుకు ఆర్బీఐ సుముఖత



సాక్షి, హైదరాబాద్: సెంట్రల్ కేవైసీ (సీకేవైసీ) పకడ్బందీ వినియోగంతో సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టవచ్చని ఇటీవల ఆర్బీఐ నిర్వహించిన సదస్సులో తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని బ్యాంకులూ స్టేట్‌మెంట్‌లను ఒకే తరహాలో పొందుపరిస్తే, సమాచార విశ్లేషణలో దర్యాప్తు అధికారులకు సులువు అవుతుందని అభిప్రాయపడ్డారు. మ్యూల్ ఎకౌంట్లు (ఒక ఖాతాదారుడు మరొకరి ప్రయోజనం కోసం వాడే బ్యాంకు ఖాతా) తెరవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధారణంగా ఆర్థిక నేరాలపైనే సమావేశాలు నిర్వహించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఇటీవల ముంబైలో తొలిసారిగా ఆర్బీఐ అధికారులు- బ్యాంకర్లు-పోలీస్ అధికారులతో సంయుక్తంగా సమావేశం నిర్వహించింది. తెలంగాణతో సహా ఢిల్లీ, హర్యానా, జార్ఖండ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్, ఎస్పీ దేవేందర్‌సింగ్ పాల్గొన్నారు. దేశంలో అనూహ్యంగా పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడిలో దర్యాప్తు సంస్థలు, బ్యాంకులు సంయుక్తంగా అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖంగా చర్చించారు. సమావేశంలో భాగంగా శిఖాగోయల్ పలు కీలక సూచనలు చేశారు. వీటన్నింటికీ ఆర్బీఐ అధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు 'సాక్షి'కి తెలిపారు. అన్ని సూచనలు అమలు చేసేందుకు ఆర్బీఐ అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్టు ఆమె తెలిపారు.

ఆర్బీఐకి శిఖాగోయల్ ఇచ్చిన ప్రధాన సూచనలేవంటే:

- సైబర్ నేరగాళ్లు డబ్బు కొట్టేసినట్టు బాధితుల నుంచి 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)లో ఫిర్యాదు అందిన తర్వాత దర్యాప్తు సంస్థలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలి.
- 48 గంటల్లోపే బ్యాంకులు స్పందిస్తే బాధితుల సొమ్ము సైబర్‌నేరగాళ్లకు చేరకుండా కాపాడొచ్చు. ఇందుకు 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా అన్ని బ్యాంకుల నుంచి నోడల్ అధికారుల వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
- సైబర్‌నేరాల కేసుల్లో దర్యాప్తు సంస్థలకు అవసరమైన సమాచారం వీలైనంత త్వరగా అందించేలా అన్నిబ్యాంకులకు కలిపి సెంట్రలైజ్డ్ ప్లాట్‌ఫాం ఉండాలి
- అన్ని బ్యాంకులు బ్యాంకు స్టేట్‌మెంట్లలో ఖాతాదారుల పేర్లు, ఐపీ అడ్రస్, ఏటీఎం వివరాలు, బ్యాంకు పేరు వంటి కీలక సమాచారం ఉండేలా స్టాండర్డ్ ఫార్మెట్‌ను కొనసాగిస్తే దర్యాప్తు సంస్థలకు విశ్లేషణ సులువవుతుంది.
- అనుమానాస్పద లావాదేవీలను జరిపే బ్యాంకు ఖాతాలపై నిఘాపెంచాలి. అలాంటి బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ వివరాలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి.
- ఒక బ్యాంకులో బ్లాక్ చేయబడిన మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, పాన్, ఆధార్ కార్డు వంటి వివరాలతో మరో బ్యాంకులో బ్యాంకు ఖాతా తెరవకుండా నిరోధించడంలో సెంట్రల్ కేవైసీ విధానం పక్కాగా అమలు చేయాలి. దీనివల్ల అన్ని బ్యాంకులకు సమాచారం చూసుకునే వీలుంటుంది. అదేవిధంగా ఇలాంటి సమాచారం రిపీట్ అయితే రెడ్ ఫ్లాగ్ (అనుమానాస్పద ఖాతా అని తెలిసే గుర్తు) వచ్చేలా ఏర్పాటు చేయాలి.
- ఒకే సారి ఒక బ్యాంకు ఖాతాలో లెక్కకు మించి నగదు లావాదేవీలు జరిగినా, లేదా అనూహ్యంగా పెద్ద మొత్తంలో లావాదేవీలున్నా వెంటనే గుర్తించేలా ట్రాన్సాక్షన్ ప్యాట్రన్ మానిటరింగ్ ఉండాలి. ఆ వివరాలు ఎప్పటికప్పుడు దర్యాప్తు సంస్థలకు అందిచేలా ఏర్పాటు చేయాలి.
- కేవైసీలో నగదు లావాదేవీల వివరాలనే కాకుండా సదరు ఖాతాకు సంబంధించిన క్రైం హిస్టరీని సైతం జత చేయాలి.
- అనుమానాస్పద క్రిప్టో, ఓవర్‌సీస్ ట్రాన్సాక్షన్లపై నిఘా పెంచాలి.

దూషించి.. ఇంట్లోంచి గెంటేసి

కన్నతల్లిపై కొడుకు కర్కశత్వం



వేలేరు: కన్నతల్లి.. ఆ కొడుకులకు బరువైంది. చిన్నకొడుకు తల్లిని దూషించి.. ఇంట్లోంచి గెంటేసి తాళం వేసుకుని హైదరాబాద్‌కు వెళ్లిపోతే.. పెద్ద కొడుకు పట్టనట్టు వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడా తల్లి తినడానికి తిండిలేక సోమవారం రాత్రి నుంచి పస్తులతో ఉంటోంది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలివి. పీచర గ్రామానికి చెందిన గొనెల గట్టమ్మకు ఇద్దరు కుమారులు గొనెల రాజయ్య, సుధాకర్, నలుగురు కుమార్తెలు ఉన్నారు. భర్త 20 ఏళ్ల క్రితమే చనిపోవడంతో పిల్లలను పెంచి పెద్ద చేసింది. అందరి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమారుడు సుధాకర్ హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. గట్టమ్మ గ్రామంలోని చిన్న కొడుకు సుధాకర్ ఇంట్లోనే ఉంటోంది. కొంతకాలంగా కుమారులిద్దరికీ వ్యవసాయ భూముల పంపకాల్లో వివాదం తలెత్తి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. సోమవారం హైదరాబాద్ నుంచి వచ్చిన సుధాకర్ తల్లితో భూమి విషయంలో గొడవ పడ్డాడు. తల్లీకొడుకుల మధ్య మాటమాట పెరగడంతో ఆగ్రహించిన సుధాకర్.. తల్లిని ఇంట్లోంచి గెంటివేసి ఆమె దుస్తులు, సామాన్లు, ఇతర వస్తువులు బయటపడవేసి తాళం వేసుకుని హైదరాబాద్ వెళ్లిపోయాడు. గ్రామంలోనే ఉంటున్న పెద్ద కుమారుడు రాజయ్య కూడా పట్టించుకోలేదు. దీంతో గట్టమ్మ కుమారుడి ఇంటి ఎదుటే పస్తులతో కాలం వెళ్లదీస్తోంది.

ఓటు హక్కుతోనే కేంద్రానికి గుణపాఠం చెప్పాలి: ఆకునూరి మురళి



కేయూ క్యాంపస్: 'దేశం నాశనం అయిపోతోంది.. నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది. ఐదునెలల క్రితం రాష్ట్రాన్ని బాగుచేయండని తిరిగాము. మళ్లీ ఇప్పుడు దేశాన్ని బాగుచేయండని తిరుగుతున్నాం. ఓటు హక్కుతోనే కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించి గుణపాఠం చెప్పాలి' అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కోరారు. మంగళవారం వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'నూతన జాతీయ విద్యావిధానం- విద్యార్థులపై ప్రభావం, పర్యవసానాలు'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చేవిధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో కొంతమందికి మాత్రమే ఆదాయాలు పెరిగాయని, దేశంలో ఒక్కశాతం ప్రజల దగ్గర 43 శాతం ఆదాయం ఉంటే, 50 శాతం మంది దగ్గర ఉన్నది 2.8 శాతం మాత్రమేనన్నారు. అందుకు కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలే అని చెప్పారు. మతంపేరుతో రెచ్చగొట్టే యత్నాలను ప్రజలకు వివరించి ఈ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేలా కృషిచేయాలని విద్యార్థులను కోరారు. సదస్సులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా, కేయూ రిటైర్డ్ ఆచార్యులు వినాయకరెడ్డి, కె.వెంకటనారాయణ మాట్లాడారు.

మీ ఫోనే.. మీ ఆయుధం

సోషల్ మీడియా కార్యకర్తలు, ఇన్‌ఫ్లూయెన్సర్లతో వైఎస్ జగన్ ముఖాముఖి

మీకు తోడుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం ఉంది

మరో 18 రోజుల్లో ఎన్నికల యుద్ధం

ఎంత మంది ఎన్ని కుట్రలు చేసినా జగన్ భయపడడు

మన విశాఖ సిటీ ఆఫ్ డెస్టినీ.. త్వరలో ఏపీ డెస్టినీ

దేవుడు ఇంకా పెద్ద స్క్రిప్ట్ ఏదో మనతో రాయించే కార్యక్రమంలో ఉన్నట్లే!

ఎన్నికల వేళ.. పవన్ సంపద సృష్టి

- దాదాపు రూ.25 కోట్లతో హైదరాబాద్, మంగళగిరిలో ఇల్లు, ఇంటి స్థలం కొనుగోలు
- మొన్న మార్చి 4నే రూ.16.14 కోట్లతో హైదరాబాద్‌లో ఇల్లు..
- ఫిబ్రవరిలో మంగళగిరిలో రూ.7.11 కోట్లతో ఇంటి స్థలం
- 10% పైగా ఆస్తులు ఎన్నికలకు 2 నెలల ముందు కొన్నవే
- ఎన్నికల అఫిడవిట్‌లో పవన్‌కళ్యాణ్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చంద్రబాబు, లోకేశ్ ప్రకటించిన ఆస్తులు రూ.1,474 కోట్లు

వారి కుటుంబానికి హైదరాబాద్, తమిళనాడులో ఎక్కువ ఆస్తులు

- హైదరాబాద్‌లో సొంతిల్లు, ఫామ్‌హౌస్
- సొంత రాష్ట్రం ఏపీలో మాత్రం సొంతిల్లు కూడా లేదు
- ఆస్తుల విలువను తక్కువగా చూపిన తండ్రీకొడుకులు
- మదీనాగూడలోని ఫామ్ హౌస్ విలువే రూ.500 కోట్లు.. దాని విలువ కేవలం రూ.100 కోట్లుగా చూపిన వైనం
- రెండేళ్ల వయసులోనే ఆస్తి కొన్న దేవాన్ష్
- విడివిడిగా ఆస్తులు చూపించి తక్కువగా చెప్పుకుంటున్న బాబు కుటుంబం



సాక్షి, అమరావతి: చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ వారి ఆస్తుల గురించి ఎన్నికల అఫిడవిట్‌లలో వెల్లడించిన వివరాలు చర్చనీయాంశమయ్యాయి. అపారమైన ఆస్తులు ఉన్నా చాలా తక్కువ ఆస్తుల్ని మాత్రమే వారు బయటపెట్టినట్లు తెలుస్తోంది. కుప్పం అసెంబ్లీ అభ్యర్థిగా చంద్రబాబు, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా లోకేశ్ విడివిడిగా ఆస్తులు చూపించారు. కానీ వారు కలిసే ఉంటున్నారు. ఆస్తుల్ని మాత్రం పక్కాగా పంచుకున్నారు. అందరూ కలిసి ఒకే కుటుంబంగా ఉంటున్నప్పటికీ, విడివిడిగా ఆస్తుల్ని చూపించడం ద్వారా తక్కువ ఆస్తిపరులని ప్రజలను మభ్య పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అఫిడవిట్లలో అధికారికంగా వారు ప్రకటించిన ఆస్తుల విలువ రూ.1,474 కోట్లు. చంద్రబాబు, భువనేశ్వరి ఆస్తుల విలువ రూ.931.83 కోట్లు కాగా, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఆస్తుల విలువ రూ.542.17 కోట్లుగా చూపారు. వారి ఆస్తుల్లో ఎక్కువ హెరిటేజ్ షేర్ల రూపంలో ఉన్నాయి. స్థిరాస్తులు హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కువగా ఉండగా, కొన్ని తమిళనాడులోనూ ఉన్నాయి. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో మాత్రం నామమాత్రంగా రెండు స్థలాలున్నాయి. వారు తమదిగా చెప్పుకునే అమరావతి, విజయవాడ ప్రాంతాల్లో మాత్రం ఈ కుటుంబంలోని ఐదుగురిలో ఎవరికీ ఒక్క ఆస్తి కూడా లేదు. వారి సొంతిల్లు హైదరాబాద్‌లోనే ఉన్న విషయం తెలిసిందే.

లోకేశ్, భువనేశ్వరి హెరిటేజ్ షేర్ల విలువే రూ.1102 కోట్లు

చంద్రబాబు ఆస్తుల్లో ఆయన భార్య భువనేశ్వరి, కొడుకు లోకేశ్‌కి ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ షేర్ల విలువే రూ.1102.11 కోట్లు. భువనేశ్వరికి రూ.763 కోట్ల విలువైన షేర్లు ఉండగా, లోకేశ్‌కి రూ.339.11 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి. మొత్తంగా చంద్రబాబు, భువనేశ్వరి పేరు మీద రూ.121.41 కోట్ల స్థిరాస్తులు, రూ.815.17 కోట్ల చరాస్తులుగా చూపించారు. అలాగే భువనేశ్వరికి రూ.1.84 కోట్ల విలువైన బంగారం, రూ.1.09 కోట్ల విలువైన ముత్యాలు, వజ్రాభరణాలు, రూ.30 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. అప్పులు రూ.10.31 కోట్లుగా చూపారు. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌కు కలిపి రూ.394 కోట్ల చరాస్తులు ఉండగా, స్థిరాస్తులు రూ.148.07 కోట్ల విలువైనవి ఉన్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణికి 2500.338 గ్రాముల బంగారం, 97.441 కిలోల వెండి, రూ.1.48 కోట్లు విలువైన వజ్రాభరణాలు ఉండగా, దేవాన్ష్ వద్ద 7.5 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి.

ఆస్తుల విలువ తగ్గించి చూపారు

చంద్రబాబు కుటుంబం అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తుల విలువను తక్కువ చేసి చూపించింది. హైదరాబాద్ మదీనగూడలో లోకేశ్, భువనేశ్వరి పేరు మీద ఉన్న 10 ఎకరాల వ్యవసాయ భూమి విలువను రూ.100 కోట్లుగా చూపించారు. నిజానికి అక్కడ ఎకరం రూ.50 కోట్లకు పైనే ఉంటుంది. ఆ లెక్కన ఆ భూమి విలువ రూ.500 కోట్లకు పైమాటే. అలాగే ఈ భూమి వ్యవహారాన్ని చంద్రబాబు గతంలో రహస్యంగా ఉంచారు. 10 ఎకరాల్లో 5 ఎకరాలు లోకేశ్‌కి ఉన్నట్లు బయటపడినప్పుడు అది ఎలా వచ్చిందనే దానిపై మల్లగుల్లాలు పడ్డారు. నానమ్మ అమ్మణ్ణమ్మ నుంచి లోకేశ్‌కి గిఫ్ట్‌గా రాసినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ విషయంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. కుప్పంలో ఉండే అమ్మణ్ణమ్మకు ఖరీదైన ప్రాంతంలో అంత భూమి ఎలా వచ్చిందనే ప్రశ్నకు చంద్రబాబు సమాధానం చెప్పలేదు. మదీనగూడలోనే మరో 5 ఎకరాలను భువనేశ్వరి కొన్నట్లు చూపారు.

రెండేళ్ల వయసులోనే రూ.20 కోట్ల ఆస్తి కొన్న దేవాన్ష్

చంద్రబాబు మనుమడు దేవాన్ష్ రెండేళ్ల వయసులోనే రూ.20 కోట్ల విలువైన ఆస్తిని కొన్నట్లు చూపడం విశేషం. జూబ్లీహిల్స్‌లో తల్లి బ్రాహ్మణితో కలిపి ఉన్న వాణిజ్య భవనాన్ని దేవాన్ష్ 2017లో కొన్నట్లు పేర్కొన్నారు. అతను పుట్టింది 2015లో. పిల్లలకు వారసత్వంగా ఆస్తి ఇవ్వడం మామూలుగా జరుగుతుంటుంది. కానీ ఆ వయసులో కొన్నట్లు చూపడమే కొసమెరుపు.

బాబు పేరుతో ఉన్న స్థిరాస్థులు

1. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కొడుకు లోకేశ్‌తో కలిపి 1,285 గజాల వాణిజ్య భవనం. విలువ రూ.70.20 కోట్లుగా చూపారు.
2. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి వద్ద 96.23 సెంట్ల భూమి. విలువ రూ.77.33 లక్షలుగా చూపించారు.
3. నారావారిపల్లె శేషాపురంలో ఇల్లు. విలువ రూ.43.66 లక్షలుగా పేర్కొన్నారు.

భువనేశ్వరి పేరుతో స్థిరాస్థులు

1. హైదరాబాద్ మదీనగూడలో 5 ఎకరాల వ్యవసాయ భూమి (ఫామ్ హౌస్). దాని విలువ రూ.55 కోట్లుగా చూపారు.
2. తమిళనాడు కాంచీపురం జిల్లా సెన్నేర్ కుప్పం గ్రామంలో 2.33 ఎకరాల వాణిజ్య భూమి. విలువ రూ.30.10 కోట్లుగా చూపారు.

లోకేశ్ స్థిరాస్థులు

1. హైదరాబాద్ మదీనగూడలో నానమ్మ గిఫ్ట్‌గా ఇచ్చిన 5 ఎకరాల వ్యవసాయ భూమి. దాని విలువ రూ.57.21 కోట్లుగా చూపారు.
2. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో తండ్రి చంద్రబాబుతో కలిపి (50 శాతం వాటా) 1285 గజాల్లో నివాస భవనం. విలువ రూ.35.10 కోట్లుగా పేర్కొన్నారు.

బ్రాహ్మణి స్థిరాస్థులు

1. హైదరాబాద్ మాదాపూర్‌లో 924 గజాల స్థలం. విలువ రూ.4.15 కోట్లుగా పేర్కొన్నారు.
2. రంగారెడ్డి జిల్లా మల్లాపూర్‌లో 4వేల గజాల స్థలం. విలువ రూ.90.39 లక్షలుగా చూపించారు.
3. హైదరాబాద్ మణికొండలో 2,440 గజాల స్థలం. విలువ రూ.3.66 కోట్లుగా చూపారు.
4. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కొడుకు దేవాన్ష్‌తో కలిపి (50 శాతం వాటా) 1,024 గజాల్లో వాణిజ్య భవనం. విలువ రూ.20.17 కోట్లుగా చూపారు.
5. చెన్నైలో 383 గజాల స్థలం. విలువ రూ.6.69 కోట్లుగా పేర్కొన్నారు.

దేవాన్ష్ స్థిరాస్థులు

1. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో తల్లి బ్రాహ్మణితో కలిపి (50 శాతం వాటా) 1,024 గజాల వాణిజ్య భవనం. విలువ రూ.20.17 కోట్లుగా పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో

హనుమాన్ చాలీసా విన్నా నేరమే

ప్రజలు సొంత మత విశ్వాసాలు పాటించడం కష్టం

- రాజస్తాన్‌లో కాంగ్రెస్ హయాంలో శ్రీరామనవమి వేడుకలపై ఆంక్షలు
- మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం
- దేశవ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లను తీసుకొచ్చే కుట్రలు ఫలించలేదు
- బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలు కాంగ్రెస్ సిద్ధాంతం
- రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ ఏనాడూ గౌరవించలేదు
- నేను రాజ్యాంగానికి విధేయుడిని.. అంబేడ్కర్‌ను ఆరాధిస్తున్నా..
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారం



టోంక్‌లో జరిగిన ర్యాలీలో అభిమానులందజేసిన గదతో మోదీ

జైపూర్/రాయ్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్ష కాంగ్రెస్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రజలు వారి మత విశ్వాసాలు పాటించడం చాలా కష్టమని, కనీసం హనుమాన్ చాలీసా వినడం కూడా పెద్ద నేరం అవుతుందని అన్నారు. మంగళవారం రాజస్తాన్‌లోని టోంక్, ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి, ధామ్‌తారీ జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఇటీవల హనుమాన్ చాలీసా వింటున్న ఓ దుకాణదారుడిని దారుణంగా కొట్టారని గుర్తుచేశారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శ్రీరామనవమి ఊరేగింపుపై రాళ్లు విసిరారని చెప్పారు. రాళ్లు విసిరినవారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి రక్షణ కల్పించారని, రాష్ట్రంలో శ్రీరామనవమి వేడుకలపై ఆంక్షలు విధించారని మండిపడ్డారు. రాజస్తాన్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజల మత విశ్వాసాలను ప్రశ్నించే ధైర్యం ఎవరూ చేయలేకపోతున్నారని చెప్పారు. ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా హనుమాన్ చాలీసా పఠించవచ్చని, శ్రీరామనవమి వేడుకలు జరుపుకోవచ్చని, ఇది బీజేపీ గ్యారంటీ అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

రిజర్వేషన్లపై ఇదే నా గ్యారంటీ

''మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం. 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో కోత విధించి, ముస్లింలకు కట్టబెట్టే పనికి శ్రీకారం చుట్టింది. 2004 నుంచి 2010 దాకా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం రిజర్వేషన్లను అమలు చేసేందుకు నాలుగుసార్లు గట్టిగా ప్రయత్నించింది. కానీ, చట్టపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో కాంగ్రెస్ ఉద్దేశం నెరవేరలేదు. 2011లో దేశవ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లను అమల్లోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ సాగించిన కుట్రలు ఫలించలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను కొల్లగొట్టి, మరో వర్గానికి ప్రయోజనం కల్పించాలని చూశారు. భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ ఏనాడూ గౌరవించలేదు. దళితులు, వెనుకబడిన గిరిజనులకు కల్పించిన రిజర్వేషన్లను విభజించి, ముస్లింలకు ఇచ్చేస్తామని బహిరంగంగా ప్రకటించే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా? కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల నుంచి దొంగిలించి, ముస్లింలకు ఇచ్చిన కోటాను బీజేపీ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్ల గడువు 2020లో ముగిసిపోగా, మేము మరో పదేళ్లు పొడిగించాం. దళితులకు, వెనుకబడిన గిరిజనులకు రిజర్వేషన్లు ఎప్పటికీ అంతం కాబోవని నేను గ్యారంటీ ఇస్తున్నా. మతం పేరిట ఎవరైనా రిజర్వేషన్లను విభజించాలని చూస్తే సహించే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నా. రాజ్యాంగానికి విధేయుడిగా నడుచుకుంటున్నా. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ఆరాధిస్తున్నా''

నక్సలిజం, మావోయిజాన్ని అంతం చేస్తాం

''ఛత్తీస్‌గఢ్‌లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి హింసను ప్రోత్సహించింది. కాంగ్రెస్‌కు, అభివృద్ధికి పొత్తు పొసగదు. అవి రెండూ కలిసి ముందుకు సాగలేవు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి, హింస పెరిగిపోతాయి. ఈశాన్య రాష్ట్రాల్లో, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు నక్సలైట్ల హింసాకాండ విపరీతంగా పెరిగింది. హింసాకాండలో ఒకవైపు జనం మరణిస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ నాయకులు జేబులు నింపుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి, మావోయిస్టు హింసాకాండ తగ్గుముఖం పట్టింది. రాష్ట్రంలో నక్సలిజాన్ని, మావోయిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని ప్రజలకు గ్యారంటీ ఇస్తున్నా'' అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు''

కాంగ్రెస్ వస్తే ప్రజల సొమ్ముపై ఎక్స్‌–రే

''దేశంలో వనరులపై మొదటి హక్కు మైనార్టీలకే ఉందని కాంగ్రెస్ పాలనలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అన్నారు. ఇది యాదృచ్ఛికం కాదు. బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ సిద్ధాంతం. ప్రజల ఆస్తులను, కష్టపడి సంపాదించిన సొమ్మును దోచుకొని, కొందరు ఎంపిక చేసిన వ్యక్తులకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ కుట్రలు పన్నుతోంది. కాంగ్రెస్‌తోపాటు విపక్ష ఇండియా కూటమిలోని పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాలను బయటపెడుతున్నందుకే ఆ పార్టీ నాయకులు నన్ను దూషిస్తున్నారు. నిజం మాట్లాడితే వారు భయపడుతున్నారు. వారి రహస్య ఎజెండాలను బహిర్గతం చేస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలను నమ్ముకుంది. అందుకే రాజ్యాంగాన్ని కూడా లెక్క చేయకుండా వ్యవహరిస్తోంది. కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రజల ఆస్తులను, సొమ్ములను ఎక్స్‌–రే తీస్తామని కాంగ్రెస్ యువరాజు చెబుతున్నారు. అంటే ప్రజలు తమ దగ్గరున్న డబ్బులు, బంగారాన్ని పెట్టెలో దాచి, గోడల్లో రహస్యంగా భద్రపరిచినా కాంగ్రెస్ నాయకులు ఎక్స్‌–రే ద్వారా కనిపెట్టి, స్వాధీనం చేసుకుంటారు. తర్వాత ఎంపిక చేసిన వ్యక్తులకు ఆ సొమ్ము పంపిణీ చేస్తారు. కాంగ్రెస్ చెబుతున్న సంపద పునఃపంపిణీ వెనుక ఉన్న అసలైన అర్థం ఇదే''

దేశాన్ని విభజించే కుతంత్రమే

''కాంగ్రెస్ పార్టీ మన దేశాన్ని మతం పేరిట ముక్కలు చేసింది. స్వాతంత్య్రం వచ్చాక మొదటిరోజు నుంచే బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల ప్రజలు అధికారంలో భాగస్వాములు కావడాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. మరో నాటకానికి తెరతీసింది. దేశాన్ని విభజించే కుట్రలకు పాల్పడుతోంది. దక్షిణ భారతదేశాన్ని ప్రత్యేక దేశంగా మార్చాలని ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ ఎంపీ డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి ఒకరు గోవాలో భారత రాజ్యాంగాన్ని అమలు చేయొద్దని అంటున్నారు. ఇది ముమ్మాటికీ దేశాన్ని విభజించే కుతంత్రమే. రాజ్యాంగాన్ని అమలు చేయొద్దనడం రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను అవమానించినట్లు కాదా? తమపై రాజ్యాంగాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్నారంటూ గతంలో జమ్మూకశ్మీర్‌లో కొందరు వ్యక్తులు గగ్గోలు పెడుతుండేవారు. మీరు(ప్రజలు) బీజేపీని ఆదరించాక ఆ వ్యక్తుల నోళ్లు మూతపడ్డాయి. జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. భారతదేశం కాంగ్రెస్‌ను తిరస్కరించింది. అందుకే దేశాన్ని చిన్న చిన్న దేశాలుగా, దీవులుగా విడగొట్టాలని ఆ పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ నేడు గోవాలో రాజ్యాంగం అమలును అంగీకరించడం లేదు. రేపు దేశమంతటా అమలు చేయొద్దని చెప్పడం ఖాయం. దేశ అభివృద్ధి పట్ల కాంగ్రెస్‌కు ఒక విజన్ లేదు. పేదల సంక్షేమం గురించి ఆ పార్టీకి ఏబీసీడీ కూడా తెలియదు. ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోంది. బీజేపీ సంగతి పక్కన పెట్టండి. సాక్షాత్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దిగొచ్చినా సరే రాజ్యాంగాన్ని రద్దు చేయలేరు''



ఎన్నికల విచిత్రం

పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ బ్యాగుల దుకాణం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి అధిర్ రంజన్ చౌదరి

ఎలక్షన్ బీట్

దేశం కోసం నా తల్లి మంగళసూత్రాలు త్యాగం చేశారు

- నానమ్మ ఇందిరా గాంధీ బంగారం ఇచ్చేశారు
- ప్రధాని మోదీ వ్యాఖ్యలను తిప్పికొట్టిన కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ



సాక్షి, బళ్లారి/బెంగళూరు: తన తల్లి సోనియా గాంధీ ఈ దేశం కోసం తన మంగళసూత్రాలు త్యాగం చేశారని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళసూత్రాలను లాక్కుంటారని మోదీ చేసిన వ్యాఖ్యలను ఆమె తిప్పికొట్టారు. దేశానికి 75 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లు అధికారంలో ఉందని, ఏనాడైనా మంగళసూత్రాలను, బంగారాన్ని లాక్కుందా? అని ప్రశ్నించారు. మంగళవారం కర్ణాటకలో ప్రచార సభల్లో ప్రియాంక ప్రసంగించారు. యుద్ధ సమయంలో తన నానమ్మ, అప్పటి ప్రధాని ఇందిర తన బంగారాన్ని దేశం కోసం ఇచ్చేశారని గుర్తుచేశారు. మంగళసూత్రాల ప్రాధాన్యత ఏమిటో తెలిస్తే ప్రధాని ఇలా మాట్లాడరని చెప్పారు. నరేంద్ర మోదీ నైతికత వదిలేశారని, సత్యమార్గంలో పయనించడం లేదని, ప్రజల ముందు కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు.

మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం: ఈసీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ చొరబాటుదారులు అంటూ ముస్లింలను నిందించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని ఎన్నికల సంఘం వర్గాలు తెలియజేసినట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. కాంగ్రెస్ నేతలు సోమవారం ఎన్నికల సంఘం అధికారులను కలిసి ప్రధాని మోదీతోపాటు బీజేపీ నేతలపై మొత్తం 16 ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడిన మోదీపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను, వారి కష్టార్జితాన్ని దోచుకుంటారని, ఆ సొమ్మును చొరబాటుదారులకు, అధిక సంతానం ఉన్నవారికి అప్పగిస్తారని రాజస్తాన్ సభలో ప్రధాని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. దేశంలో వనరులపై తొలి హక్కు మైనార్టీలకే ఉందని కాంగ్రెస్‌కు చెందిన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అన్నారని మోదీ తప్పు పట్టారు. మోదీ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర వివాదానికి దారితీశాయి.

సనాతన వ్యతిరేకి, జాతి వ్యతిరేకి..

కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌పై స్మృతి ఇరానీ ఆరోపణలు

అమేథీ: సనాతన ధర్మాన్ని, హిందువులను బలహీనులుగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నారని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మండిపడ్డారు. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీని ఆమె సనాతన వ్యతిరేకి, జాతి వ్యతిరేకిగా అభివర్ణించారు. అమేథీలో మంగళవారం ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. 'హిందుత్వను మాత్రమే కాదు, శ్రీరాముడిని సైతం కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించారు. శ్రీరాముడి భక్తుడు కాని వ్యక్తితో ఎలాంటి ప్రయోజనమూ లేదు. రాహుల్ కావొచ్చు, ప్రియాంకా గాంధీ కావొచ్చు వాళ్లు సనాతన ధర్మ విరోధులు మాత్రమే కాదు, జాతి వ్యతిరేకులు కూడా. దేశాన్ని ముక్కలుగా చేస్తానంటూ మాట్లాడిన వ్యక్తిని వీరు తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు'అని స్మృతి ఆరోపించారు.

మూడో విడత బరిలో 1,351 మంది

సాక్షి, న్యూఢిల్లీ: మే 7వ తేదీన మూడో విడత పోలింగ్ జరగనున్న లోక్‌సభ స్థానాల్లో మొత్తం 1,351 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ దఫాలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 95 ఎంపీ స్థానాలకు 2,963 నామినేషన్లు దాఖలైనట్లు మంగళవారం తెలిపింది. అత్యధికంగా గుజరాత్‌లోని 26 స్థానాలకు 658 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు పేర్కొంది. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ లోక్‌సభ సీటు కోసం 77 మంది నామినేషన్లు వేసినట్లు తెలిపింది.

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి జాడ గల్లంతు!

సూరత్: సూరత్ ఎంపీ స్థానంలో పార్టీ తరఫున నిలబడి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో పోటీ నుంచి తప్పుకున్న నీలేశ్ కుంభనీ జాడ తెలీడం లేదని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. ఇంటికి తాళం వేసి కుటుంబం అంతా ఎక్కడికో వెళ్లారు. ఆయన బీజేపీలో చేరొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో నీలేశ్ ఇంటి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు.

లద్దాఖ్‌లో నమ్‌గ్యాల్‌కు దక్కని బీజేపీ టికెట్

న్యూఢిల్లీ: 2019లో ఆర్టికల్ 370 రద్దుకు మద్దతుగా లోక్‌సభలో ఆవేశపూరితంగా ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించిన లద్దాఖ్ ఎంపీ, బీజేపీ నేత జమ్యాంగ్ సేరింగ్ నమ్‌గ్యాల్‌కు ఈసారి నిరాశ ఎదురైంది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఆయనకు టికెట్ నిరాకరించింది. లద్దాఖ్ అభ్యర్థిగా తాషీ గ్యాల్సన్‌ను ఖరారు చేసింది. నమ్‌గ్యాల్ పట్ల లేహ్‌లో బౌద్ధులు అసంతృప్తిగా ఉండటంతో ఆయనను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

సీఏఏ జోలికి వచ్చేంత ధైర్యం లేదు

మమత, కాంగ్రెస్‌లపై అమిత్ షా ధ్వజం

మాల్దా: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను బెంగాల్‌లో అమలు చేయబోమంటూ సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. సీఏఏ జోలికి వచ్చేంత ధైర్యం మమత, కాంగ్రెస్ పార్టీలకు లేదన్నారు. అక్రమ వలసలను ప్రోత్సహించేందుకే ఆమె సీఏఏను వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన బెంగాల్, మహారాష్ట్రలలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. బీజేపీ 400 పైగా సీట్లు సాధిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

వేలం వద్దు.. మేమే కేటాయిస్తాం

మీ తీర్పును సవరించండి

2జీ స్పెక్ట్రమ్‌పై సుప్రీం తలుపుతట్టిన మోదీ సర్కార్



న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని 12 ఏళ్ల తర్వాత సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తిచేసింది. వేలం విధానంలో కాకుండా తామే కేటాయింపులు జరుపుతామని కోర్టుకు తెలిపింది. వేలం ద్వారా మాత్రమే కేటాయింపులు జరపాలంటూ ఇచ్చిన గత తీర్పును సవరించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలాల ధర్మాసనం ఎదుట కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అభ్యర్థించారు. ఈ అంశంపై తక్షణం విచారణ చేపట్టాలని కోరారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసిస్(ముందు వచ్చిన వారికే ప్రాధాన్యత) పద్ధతిలో యూపీఏ హయాంలో ఏ.రాజా టెలికం మంత్రిగా ఉన్నపుడు 2జీ స్పెక్ట్రమ్‌కు సంబంధించి కంపెనీలకు ఇచ్చిన 122 లైసెన్సులను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం తెల్సిందే. కొన్ని సందర్భాల్లో వేలంలో కాకుండా ప్రభుత్వమే కేటాయింపులు జరపాలని ఆశిస్తోందని, అందుకే పాత తీర్పును సవరించాలని అటార్నీ జనరల్ సోమవారం కోరారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని, వివరాలను ఈ–మెయిల్‌లో పంపాలని సీజేఐ చంద్రచూడ్ సూచించారు. అయితే తీర్పును సవరించాలంటూ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తప్పుబట్టారు. నాటి తీర్పు సమంజసంగానే ఉందని, సవరణ అనవసరమని ఆయన వాదించారు. ఆనాడు యూపీఏ సర్కార్‌కు వ్యతిరేకంగా 2జీ స్పెక్ట్రమ్‌పై ప్రజా ప్రయోజనా వ్యాజ్యం దాఖలుచేసిన ఎన్‌జీవో సంస్థ తరఫున ఆనాడు ప్రశాంత్‌భూషణే వాదించారు. కేటాయింపుల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని మన్మోహన్ ప్రభుత్వంలో నాటి కమ్యూనికేషన్స్, ఐటీ సహాయ మంత్రి కపిల్‌సిబల్ 2011లో వాదించారు. అయితే ఈ కేసులో ఎ.రాజా, డీఎంకే నాయకురాలు కనిమొళిలను నిర్దోషులుగా ప్రకటిస్తూ 2017 డిసెంబర్ 21న ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరిచింది. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సీబీఐ 2018 మార్చి 20న హైకోర్టును ఆశ్రయించింది. అక్రమ కేటాయింపుల వల్ల కేంద్ర ఖజానాకు రూ.30,984 కోట్ల నష్టం వాటిల్లిందని వాదించింది. వేలం విధానంలో జరగని కేటాయింపుల లైసెన్స్‌లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

నాటి అడ్వర్టైజ్‌మెంట్ల సైజులోనే

క్షమాపణల యాడ్స్ వేశారా?

రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కరోనా విలయకాలంలో అల్లోపతి వంటి ఆధునిక వైద్యవిధానాలను తప్పుబడుతూ పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ ఇచ్చిన తప్పుడు అడ్వర్టైజ్‌మెంట్లు, ప్రకటనల కేసులో బాబా రాందేవ్, పతంజలి మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ బహిరంగ క్షమాపణలు చెప్పినా సర్వోన్నత న్యాయస్థానం వారిని వదిలిపెట్టలేదు. ఈ కేసు విచారణ సందర్భంగా మంగళవారం రాందేవ్, బాలకృష్ణ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు హాజరయ్యారు. రూ.10 లక్షలు ఖర్చుపెట్టి సోమవారం 67 వార్తాపత్రికల్లో క్షమాపణల యాడ్ ఇచ్చామని కోర్టుకు తెలిపారు. '' ఆనాడు అల్లోపతిని కించపరుస్తూ, పతంజలి ఉత్పత్తులు అద్భుతమంటూ ఇచ్చిన ఫుల్‌పేజీ యాడ్‌ల స్థాయిలోనే ఈ యాడ్‌లను ప్రముఖంగా ప్రచురించారా?. అదే ఫాంట్ సైజులో అంతే పరిమాణంలో ప్రకటన ఇచ్చారా?' అని జస్టిస్ హిమా కోహ్లీ ప్రశ్నించారు. ' మా క్లయింట్లు యాడ్స్ కోసం లక్షలు వెచ్చించారు' అని రోహత్గీ చెప్పారు. ' ఖర్చు ఎంతయింది అనేది మాకు అనవసరం' అని జడ్జి అసహనం వ్యక్తంచేశారు. 'గతంలో క్షమాపణల యాడ్స్ ఇవ్వాలని ఆదేశిస్తే ఈరోజు కోర్టు విచారణ ఉందనగా నిన్న ఎందుకు యాడ్ ఇచ్చారు?. ఈ కేసులో పతంజలికి ప్రతివాదిగా ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌పై రూ.100 కోట్ల పరువునష్టం దావా ఒకటి దాఖలైంది. ఆ దావాతో మీకేమైనా సంబంధం ఉందా?' అని జడ్జి అనుమానం వ్యక్తంచేశారు. '' తన క్లయింట్లకు దీనితో ఎలాంటి సంబంధం లేదు. ఈసారి పెద్ద సైజులో క్షమాపణ ప్రకటనలు ఇస్తాం'' అని రోహత్గీ చెప్పారు. దీంతో సోమవారం నాటి ప్రకటనల వివరాలను రెండ్రోజుల్లోపు సమర్పించాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాహ్‌ల ధర్మాసనం ఆదేశించింది. ఇలాగే తప్పుడు ప్రకటనలు ఇస్తున్న ఫాస్ట్‌మూవింగ్ కన్జూమర్ గూడ్స్(ఎఫ్‌ఎంసీజీ) కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని సంబంధింత మూడు కేంద్రప్రభుత్వ మంత్రిత్వ శాఖలను కోర్టు ఆదేశించింది. '' ఈ కంపెనీల తప్పుడు ప్రకటనలు వల్లే ఆయా సంస్థల ఉత్పత్తులను చిన్నారులు, పాఠశాల స్థాయి విద్యార్థులు, వృద్ధులు విరివిగా వినియోగిస్తున్నారు' అని కోర్టు ఆవేదన వ్యక్తంచేసింది.

మా మతం ఎవరినీ

తక్కువగా చూడదు

మోదీ వ్యాఖ్యలపై ఫరూక్ అబ్దుల్లా సీరియస్



శ్రీనగర్: ముస్లింలు చొరబాటుదారులు, తల్లులు, అక్కాచెల్లెళ్ల బంగారం, మంగళసూత్రాలను కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి నేలబారు మాటలు మాట్లాడటం శోచనీయమన్నారు. '' ఇతర మతాలను కించపరచాలని మా మతం అస్సలు బోధించదు. హిందూ మహిళల మంగళసూత్రాలను ఏ ఒక్క ముస్లిం కూడా దోచుకోడు. అందరినీ సమానంగా చూడాలని ఇస్లాం ప్రబోధిస్తోంది. మేం నమ్మే మా మతం అన్ని మతాలకూ గౌరవం ఇవ్వాలనే చెబుతోంది. హిందూ తల్లి, సోదరి మంగళసూత్రాలను ముస్లిం దోచాడని నేను ఎక్కడా వినలేదు. అలా ఒకవేళ ఎక్కడైనా జరిగి ఉంటే అతను ముస్లిమే కాదు. అతను ఇస్లాంను సరిగా అర్థం చేసుకోలేదని అర్థం'' అని అన్నారు. మంగళవారం రాజసౌథ్‌న్‌లోని బాంసవాడా పట్టణంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఫరూక్ మాట్లాడారు. '' ఒకరిని చంపితే మానవత్వాన్ని చంపేసినట్లేనని ఇస్లాం బోధనల్లో ఉంది. నేనూ ముస్లింనే. హిందువులను ద్వేషించాలని ఖురాన్‌లో ఎక్కడా లేదు. సిక్కులు, ముస్లింలను ఎంతగా ప్రేమిస్తానో హిందువుల పట్ల అంతే ప్రేమతో వ్యవహరిస్తా. ఇతర మతాల వాళ్లు అభివృద్ధిలోకి వస్తే వారితోపాటే మనమూ వృద్ధిలోకి వస్తాం. అప్పుడే దేశమే అభివృద్ధిపథంలో ముందుకెళ్తుంది'' అని అన్నారు. బీజేపీ 2047 విజన్‌పై ఫరూక్ ఆరోపణలు గుప్పించారు. '' విజన్ 2047పై బీజేపీ ఎప్పుడూ వల్లెవేస్తోంది. 2047ను ఎందుకు పట్టుకుని వేలాడుతున్నారు?. అప్పటికల్లా దేశంలో పారదర్శకమైన ఎన్నికలు అనేవే లేకుండా చేయడం బీజేపీ ఉద్దేశం. అధికారాన్ని హస్తగతం చేసుకుని నచ్చినట్లు దేశాన్ని ఏలాలని భావిస్తోంది. రష్యాలో పుతిన్‌లాగా మోదీని బతికున్నంతకాలం ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలని బీజేపీ ఆశపడుతోంది' అని ఫరూక్ వ్యాఖ్యానించారు. '' ముస్లింల పట్ల బీజేపీ వైఖరిని తెల్సుకోండి. ఆ తర్వాత ఆ పార్టీకి మద్దతు అవసరమా లేదా అని ఆలోచించండి' అని కశ్మీర్ ప్రాంత పార్టీల నేతలను హెచ్చరించారు.

రాహుల్‌కు డీఎన్‌ఏ టెస్ట్ చేయాలి

- నెహ్రూల కుటుంబంలో ఇలా మాట్లాడేవాళ్లు ఉంటారా?
- ఎల్డీఎఫ్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్య

పాలక్కడ్: అవినీతి ఆరోపణలున్న కేరళ ముఖ్యమంత్రి, లెఫ్ట్ నాయకుడు పినరయి విజయన్‌ను ఎందుకు దర్యాప్తు సంస్థలు ఇంతకాలం అరెస్ట్‌చేయకుండా ఉన్నాయన్న రాహుల్ గాంధీపై ఎల్డీఎఫ్ శాసనసభ్యుడు పీవీ అన్వర్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేరళలోని ఎడథనట్టుకారలో ఎల్డీఎఫ్ స్థానిక కమిటీ మీటింగ్‌లో అన్వర్ మాట్లాడారు. '' నెహ్రూ కుటుంబంలో ఇలా మాట్లాడేవాళ్లు ఉన్నారా? నెహ్రూ కుటుంబంలో పుట్టి కూడా ఇలా మాట్లాడతారా? ఈ విషయంలో నాకు పెద్ద సందేహాలు వస్తున్నాయి. రాహుల్ గాంధీ డీఎన్‌ఏను టెస్ట్‌చేయాలి. నెహ్రూ వారసుడిగా ఉండే అర్హత రాహుల్‌కు లేదు. ప్రధాని మోదీకి రాహుల్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడేమో అనే అనుమానం మనకు రావాలి'' అని అన్వర్ అన్నారు. దీంతో కాంగ్రెస్ మండిపడింది. వెంటనే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని కేరళ కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షుడు ఎంఎం హసన్ చెప్పారు. ' గాడ్సేకు కొత్త అవతారం అన్వర్. గాంధీజీ ప్రాణాలు తీసిన నాథూరాం గాడ్సే బుల్లెట్ కన్నా దారుణంగా మాటల తూటాలు పేల్చారు. ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ ఇలా హేయమైన వ్యాఖ్యలు చేయరు. సీఎం పినరయి విజయన్ ఆత్మాహుతి దళంలో అన్వర్ సభ్యుడను కుంటా ' అని హసన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నెహ్రూ కుటుంబాన్ని తిట్టేందుకు అన్వర్‌కు సీపీఐ(ఎం) పార్టీ డబ్బులు ఇచ్చి ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. అన్వర్ వ్యాఖ్యలను సీఎం విజయన్ సమర్థించారు. '' రాహుల్‌కు అన్వర్ సరైన సమాధానమే ఇచ్చారు. రాహుల్ విమర్శలకు అతీతుడైన వ్యక్తి కాదుకదా'' అని సీఎం అన్నారు.

సైనిక హెలికాప్టర్లు ఢీకొని

10 మంది మృతి

మలేసియాలో దుర్ఘటన

కౌలాలంపూర్: మలేసియా ఆర్మీకి చెందిన రెండు హెలికాప్టర్లు ప్రమాదవశాత్తు ఢీకొని 10 మంది చనిపోయారు. ఉత్తర పెరాక్ రాష్ట్రంలోని నేవీ కేంద్రం సమీపంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వచ్చే నెలలో జరిగే నేవీ వార్షికోత్సవాల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా పదుల సంఖ్యలో హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ప్రయాణం చేస్తున్నాయి. ఆ సమయంలో ఒక హెలికాప్టర్ పక్కకు జరగడంతో దాని రెక్క పక్కనే వస్తున్న మరో హెలికాప్టర్ రోటార్‌ను తాకింది. దీంతో, రెండు హెలికాప్టర్లు ఢీకొని కుప్పకూలాయి. వాటిలో ఉన్న ఏడుగురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం పది మంది వైమానిక దళ సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు.

ఎట్టకేలకు కేజ్రీవాల్‌కు ఇన్సులిన్

న్యూఢిల్లీ: మధుమేహం స్థాయిలు పెరిగాయంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పెట్టుకున్న మొరను తిహార్ జైలు యంత్రాంగం ఎట్టకేలకు ఆలకించింది. మద్యం విధానంలో అవకతవకల కేసులో అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌కు తిహార్ జైలులో ఇన్సులిన్ ఇవ్వడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులతో వీడియోకాల్‌లోనూ ఇన్సులిన్ గురించి ప్రస్తావించానని కేజ్రీవాల్ చెప్పడం, అలాంటి ప్రస్తావనే రాలేదని జైలు యంత్రాంగం ఒక ప్రకటన విడుదలచేయడం తెల్సిందే. దీంతో ఆయనకు ఇన్సులిన్ అవసరమో లేదో తేల్చేందుకు మెడికల్ బోర్డ్‌ను ఏర్పాటుచేయాలని ఎయిమ్స్ డైరెక్టర్‌ను ఢిల్లీ కోర్టు ఆదేశించడం వంటి పరిణామాల నేపథ్యంలో కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఏడింటికి షుగర్ లెవల్ 217 గా ఉంది. దీంతో సోమవారం సాయంత్రం ఆయనకు ఎయిమ్స్ వైద్యుల సూచన మేరకు రెండు డోస్‌ల ఇన్సులిన్ ఇచ్చారు. ''హనుమాన్ జయంతి రోజు హనుమంతుని ఆశీస్సులు కేజ్రీవాల్‌కు అందాయి. హనుమాన్‌జీ ఆయన భక్తునికి ఇన్సులిన్ అందేలా చేశారు' ఆప్ వ్యాఖ్యానించింది. '' నిజంగా ఇన్సులిన్ అవసరం లేకపోతే ఇప్పుడు ఎందుకు ఇచ్చారు?'' అని బీజేపీని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నిలదీశారు.

మే 7 వరకు కస్టడీ పొడిగింపు

మద్యం కుంభకోణం మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మే 7వ తేదీ వరకు పొడిగించింది. ఈ కేసులో మార్చి 21వ తేదీన కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసి, తిహార్ జైలులో ఉంచిన విషయం తెలిసిందే. మంగళవారంతో ఆయనకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగిసింది. దీంతో అధికారులు ఆయన్ను సీబీఐ, ఈడీ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా ఎదుట వర్చువల్‌గా హాజరు పరిచారు.

సాక్షి హైదరాబాద్ 7

బుధవారం। 24। ఏప్రిల్। 2024




కొత్త రికార్డులు కొట్టేలా..

ఐపీఎల్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో రికార్డులు కొల్లగొడుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ సొంతగడ్డపై చెలరేగిపోయేందుకు సిద్ధమైంది. ఉప్పల్ స్టేడియంలో గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో హైదరాబాద్ తలపడనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రైజర్స్, బెంగళూరు జట్లు సాధన చేశాయి.




జై హనుమాన్

జై శ్రీరామ్.. జై బోలో హనుమాన్‌కీ.. అనే నినాదాలతో భాగ్యనగర వీధులు దద్దరిల్లాయి. వీర హనుమాన్ నామస్మరణలు మార్మోగాయి. రహదారులన్నీ కాషాయమయంగా మారాయి. మంగళవారం హనుమజ్జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో తలపెట్టిన వీర హనుమాన్ విజయ యాత్ర కనుల పండువగా సాగింది. గౌలిగూడ నుంచి కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా, సుల్తాన్‌బజార్, నారాయణగూడ, చిక్కడపల్లి, గాంధీనగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, కవాడిగూడ, బైబిల్ హౌస్, ప్యారడైజ్‌ల మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయానికి చేరుకుంది.

– సాక్షి, సిటీబ్యూరో

శం'షేర్'

శంషాబాద్ విమానాశ్రయంలో పెరిగిన రద్దీ

1.76 లక్షల విమానాల రాకపోకలు

మెట్రో నగరాల్లో నాలుగో స్థానం

దక్షిణాదిలో బెంగళూరు తర్వాత హైదరాబాదే


ఒక్క రోజులో 544 విమానాల రాకపోకలతో రికార్డు

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజా నివేదికలో వెల్లడి

ఏడాదిలో 2.5 కోట్ల మంది ప్రయాణం


మెట్రో నగరాల్లోని విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ: (కోట్లలో)

(జాతీయ, అంతర్జాతీయ విమానాలు కలిపి)



విమానాల రాకపోకల సంఖ్య: (లక్షల్లో)

(జాతీయ, అంతర్జాతీయ విమానాలు కలిపి)



సాక్షి స్పెషల్ స్టోరీ

2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 2.5 కోట్ల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. 2022–23లో 2 కోట్ల మంది ప్రయాణికులతో పోలిస్తే ఇది 19 శాతం ఎక్కువ. కరోనా కంటే ముందు 2018–19లో 2.1 కోట్ల మంది ప్రయాణించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 2023–24లో 1.76 లక్షల విమాన సర్వీసులు రాకపోకలు సాగించాయి. 2022–23లో 1.6 లక్షలు, కరోనా కంటే ముందు 2018–19లో 1.79 లక్షలుగా ఉన్నాయి. కార్గో కార్యకలాపాలను చూస్తే.. 2023–24లో 1.54 లక్షల మెట్రిక్ టన్నులు కార్గో సేవలను నిర్వహించింది. క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8 శాతం ఎక్కువ.

విమాన యానం ఊపందుకుంటోంది. ద్వితీయ శ్రేణి నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభం కావడం.. కొన్ని నగరాలకు సర్వీసుల సంఖ్య పెరగడంతో ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. విద్య, వైద్యం, ఉద్యోగం, తీర్థ, పర్యాటక యాత్రలకు వెళ్లే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరగడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోని మెట్రో నగరాల్లో ప్రయాణికుల రద్దీలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలవగా.. దక్షిణాదిలో బెంగళూరు తర్వాత శంషాబాద్ బిజీ విమానాశ్రయంగా నిలిచిందని జాతీయ విమానయాన ప్రాధికార సంస్థ (ఏఏఐ) తాజాగా గణాంకాలు వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

పెరిగిన అంతర్జాతీయ ప్రయాణికులు, విమానాలు..

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అంతర్జాతీయ ప్రయాణీకులు, విమాన సర్వీసుల సంఖ్య ఏటా క్రమేణా పెరుగుతోంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో 5.73 లక్షల మంది అంతర్జాతీయ ప్రయాణీకులు ప్రయాణించగా.. 2021–22లో 14.15 లక్షల మంది, 2022–23లో 34.20 లక్షల మంది, 2023–24లో 42,14 లక్షల మంది రాకపోకలు సాగించారు.

- 2023– 24లో 27,995 అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించగా.. గత ఏడాది వీటి సంఖ్య 22,957గా ఉంది. అంటే ఏడాది కాలంలో అంతర్జాతీయ విమాన సర్వీసులు 21.9 శాతం పెరిగాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో గగన యానానికి భారీ డిమాండ్ ఏర్పడింది.
- ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయ్, థాయిలాండ్, వియత్నాం వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. విదేశాల నుంచి భాగ్యనగరానికి వచ్చే విదేశీయుల సంఖ్యలోనూ వృద్ధి కనిపిస్తోంది. వైద్య చికిత్సలు, తీర్థ, పర్యాటక ప్రాంతాలకు తాకిడి పెరగడంతో విమానాలు పూర్తిస్థాయి ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. గతేడాది డిసెంబర్ 23న ఒక్క రోజే హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 77 వేల మంది గమ్యస్థానాలకు చేరారు. ఈ ఏడాది మార్చి 30న ఒక్క రోజులో 544 విమానాల రాకపోకలు సాగించడం రికార్డు.



ఉడాన్‌తో రయ్ రయ్..

సామాన్యులకు సైతం విమాన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ స్కీమ్ కింద దేశంలోని చిన్న పట్టణాలు, నగరాలలో విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి గమ్యస్థానాల సంఖ్య పెరిగింది. గతంలో బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాలకు మాత్రమే ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఉడాన్ పథకం తర్వాత హైదరాబాద్ నుంచి వారణాసి, అమృత్‌సర్, గోరఖ్‌పూర్, అయోధ్య వంటి చిన్న పట్టణాలకు కూడా విమాన సౌకర్యం కలిగింది. దీంతో విమాన సర్వీసుల రాక కూడా ప్రయాణికుల సంఖ్య పెరగడానికి దోహదపడుతోంది.

కోటి ఓటర్లు



గ్రేటర్‌లో ఐదేళ్లలో పెరిగిన 15 లక్షల మంది ఓటర్లు

- మొత్తం మూడు జిల్లాల్లో ఓటర్లు కోటీ 5 లక్షల 45 వేల మంది
- తెలంగాణ మొత్తం ఓటర్లలో ఇది 30 శాతం
- లోక్‌సభ ఎన్నికల్లో ఎటు వైపు మొగ్గుచూపుతారో...

మొత్తం ఓటర్లు	1,05,45,000
హైదరాబాద్ జిల్లా	45.7 లక్షలు
రంగారెడ్డి జిల్లా	31 లక్షలు
మేడ్చల్ జిల్లా	28.75 లక్షలు
పురుషులు	54.22 లక్షలు
స్త్రీలు	51.23 లక్షలు

అత్యధికంగా శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లో ఓటర్లు: 7.4 లక్షల మంది

అత్యల్పంగా చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్లో ఓటర్లు: 2.28 లక్షల మంది

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ ఓటర్ల సంఖ్య కోటి దాటింది. నగరం వేగంగా విస్తరిస్తున్నట్లుగానే ఓటర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2019 లోక్‌సభ ఎన్నికల నుంచి ప్రస్తుతం జరుగనున్న ఎన్నికల వరకు సుమారు 15 లక్షల మందికి పైగా కొత్త ఓటర్లు నమోదైనట్లు అంచనా. ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం ప్రస్తుతం గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఓటర్ల సంఖ్య 1.05 కోట్లు దాటింది. మొత్తం తెలంగాణ ఓటర్లలో ఇది 30 శాతం ఉంటుందని అంచనా.

ఓటింగ్ మాత్రం పెరగట్లే..

ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేయగలిగేవిధంగా ఓటర్ల సంఖ్య ఉన్నప్పటికీ గ్రేటర్‌లో ఓటింగ్ శాతం మాత్రం సగం దాటి ముందుకు వెళ్లడం లేదు. ఈ క్రమంలో నగరంలోని ఓటర్లలో అవగాహన పెంచేందుకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రధాన కూడళ్లు, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, వీధి నాటకాలు తదితర కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు కాలనీ సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్స్ సంఘాలు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వంటి ప్రధాన సంస్థలు ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఎన్నికల గడువు సమీపిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీల ప్రచారం ఇంకా జోరందుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, అన్ని విభాగాలు నెల రోజుల ముందు నుంచే ప్రచారాన్ని పదునెక్కించాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలపైన రాజకీయ పార్టీల ప్రచారం మాత్రం ఇప్పటి వరకు మందకొడిగానే సాగుతోంది.

ఓటర్ల మొగ్గ ఎటువైపో..

కోటికి పైగా ఉన్న గ్రేటర్ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో ఏ పార్టీ ముందంజలో ఉంటుంది...నగర ఓటర్లు ఎటు వైపు మొగ్గుచూపుతారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ ప్రభంజనం కనిపించినా హైదరాబాద్ ఓటరు మహాశయులు మాత్రం బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో సిటీ ఓటర్ టర్నింగ్ ఎలా ఉండనుందనేది చర్చనీయాంశంగా మారింది.

కొత్తగా 15 లక్షల మంది ఓటర్లు....

ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రేటర్‌లో 90.47 లక్షల మంది ఓటర్లు ఉంటే గతేడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 99 లక్షలకు చేరింది. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 1.05 కోట్ల ఓటర్లు గ్రేటర్‌లో నమోదయ్యారు. అంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో 15 లక్షల మంది కొత్తగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 45.7 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 31 లక్షలు, మేడ్చల్ జిల్లాలో 28.75 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 54.22 లక్షల మంది పురుషులు కాగా, 51.23 లక్షల మంది మహిళలు ఉన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 7.4 లక్షల మంది ఓటర్లు ఉండగా, చార్మినార్ పరిధిలో అతి తక్కువగా కేవలం 2.28 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ఈ ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టనున్నారో మరి కొద్ది రోజుల్లో తేలిపోనుంది.

సొంత ఊళ్లకు వెళ్తే కష్టమే...

గ్రేటర్ ఓటర్ల తీరు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా మారింది. సాధారణంగానే మధ్యతరగతి, ఆపై వర్గాలు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంటున్నారు. వాసి కంటే రాశి ఎక్కువగా ఉన్నట్లు ఓటర్ల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ ఓటింగ్‌లో పాల్గొనేవాళ్లు తక్కువ. మరోవైపు ప్రతిసారి ఎన్నికల సందర్భంగా లక్షలాది మంది నగరవాసులు సొంతూళ్ల వెళ్తున్నారు. ఈసారి కూడా అదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. చాలామందికి హైదరాబాద్‌తోపాటు సొంత ఊళ్లలోనూ ఓట్లు ఉన్నాయి. ఊరిలో ఓటు వేయడం ద్వారా తమ ఉనికిని చాటుకొనేందుకే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. ఈసారి మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సైతం నగరవాసులు ఏపీకి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం తక్కువగా ఉండవచ్చని స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నగరవాసులు విధిగా ఓటింగ్‌లో పాల్గొనడం వల్ల ఉత్తమ అభ్యర్థులను ఎంపిక చేసుకొనే అవకాశం ఉంటుందని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తదితర సంస్థలు సూచిస్తున్నాయి.

మంగళవారం ఉష్ణోగ్రతలు ఇలా...

బంజారాహిల్స్	మెట్టుగూడ	సరూర్‌నగర్	ఆదర్శనగర్	రాజేంద్రనగర్	మూసాపేట	చర్లపల్లి	ఎల్బీనగర్	రెయిన్‌బజార్	గౌలివాడ	మియాపూర్	బోరబండ
43.0	43.0	42.0	42.7	42.6	42.6	42.4	42.4	42.3	42.2	42.1	42.1

టీఎస్ బీపాస్ ద్వారానే అన్ని రకాల అనుమతులు

సాక్షి, సిటీబ్యూరో: అన్ని రకాల భవన నిర్మాణ అనుమతులకు సింగిల్‌విండో వ్యవస్థ టీఎస్‌బీపాస్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ మేరకు 2016 నుంచి అమల్లో ఉన్న డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీపీఎంఎస్)ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. డీపీఎంఎస్ ద్వారా ఇప్పటికే వచ్చిన, వివిధ దశల్లో ఉన్న దరఖాస్తులను మాత్రం పరిశీలించి పరిష్కరిస్తారు. కొత్తగా డీపీఎస్ ద్వారా వచ్చే దరఖాస్తులను మాత్రం అనుమతించబోరు. హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామపంచాయతీల్లో భవన నిర్మాణాలు, లే అవుట్ పర్మిషన్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు తదితర అనుమతుల కోసం ఇప్పటి వరకు డీపీఎస్ ద్వారా దరఖాస్తు చేసుకొనే సదుపాయం ఉండేది. తాజాగా.. హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామాలకు సైతం టీఎస్‌బీపాస్ సేవలను విస్తరించారు. దీంతో హెచ్ఎండీఏలోని జీహెచ్ఎంసీ కార్పొరేషన్‌లు, ఏడు జిల్లాలు, 70 మండలాలు, 30 మున్సిపాలిటీలు, 1032 గ్రామపంచాయతీల పరిధిలో అన్ని రకాల నిర్మాణ అనుమతులను టీఎస్‌బీపాస్ ద్వారా మాత్రమే అందజేయనున్నారు. చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్‌లకు (సీఎల్‌యూ) మాత్రం మినహాయింపు ఉంటుంది. గ్రామపంచాయతీల్లో నిర్మాణ అనుమతుల కోసం టీఎస్‌బీపాస్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

47 నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలకు మంగళవారం 47 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు నామినేషన్లను దాఖలు చేసిన పలువురు అభ్యర్థుల తరఫున తిరిగి అదనపు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. హైదరాబాద్ స్థానానికి 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు. సమీర్‌వలీవుల్లా ఖాన్ (కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం)తో పాటు మరో తొమ్మిది పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. సికింద్రాబాద్ స్థానానికి వివిధ పార్టీల పక్షాన, స్వతంత్ర అభ్యర్థులుగా 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి 13 నామినేషన్లు దాఖలయ్యాయి. గడ్డం రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్), కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్‌ఎస్), వనం సుధాకర్ (ఎంసీపీఐ- యూ)తో పాటు మరో 10 మంది వివిధ రాజకీయ పార్టీల పక్షాన, ఇండిపెండెంట్‌లుగా నామినేషన్లను దాఖలు చేశారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రాగిడి లక్ష్మా రెడ్డి (బీఆర్‌ఎస్)తో పాటు మరో 11 మంది వివిధ రాజకీయ పార్టీల పక్షాన, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

కలల తీరం చేరకుండానే..

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



వర్షిత్ రెడ్డి (ఫైల్)

ఉప్పల్: వీసా ప్రాసెస్‌లో భాగంగా బ్యాంక్ స్టేట్‌మెంట్ కోసం వెళ్తున్న బీటెక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి సత్యనారాయణపురానికి దొంతరి మధుసూదన్‌రెడ్డి, సుష్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు వర్షిత్ రెడ్డి (23) బీటెక్ పూర్తి చేశాడు. విదేశీ విద్య కోసం అమెరికా వెళ్లడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగా వీసా కోసం నగరంలోని హిమాయత్‌నగర్ బ్యాంక్‌లో స్టేట్‌మెంట్ కోసం యాక్టివాపై వెళ్తుండగా.. ఉప్పల్ కట్టమైసమ్మ దేవాలయం వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో వర్షిత్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్దామనుకున్న కుమారుడిని మృత్యువు కబళించడంతో వర్షిత్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బుక్ చేసిన 12 గంటల్లోపే ట్యాంకర్

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: తాగునీటి ట్యాంకర్ డెలివరీ సమయాన్ని 12 గంటలకు తగ్గేలా ప్రణాళిక రూపొందించుకోవాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ట్యాంకర్ బుకింగ్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే సగానికి పైగా ఫిల్లింగ్ స్టేషన్లలో 24 గంటల్లోపు ట్యాంకర్ డెలివరీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రత్యేక దృష్టి పెడితే బుక్ చేసిన 12 గంటల్లోపే ట్యాంకర్ డెలివరీ చేసే వీలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత నెలతో పోలిస్తే కొత్త ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్ల సంఖ్య పెరిగిందని సుదర్శన్‌రెడ్డి వివరించారు. గత నెల 1,68,996 ట్యాంకర్ ట్రిప్పులను డెలివరీ చేయగా, ఈ నెల 22 నాటికి 1,67,134 ట్రిప్పులు సరఫరా చేసినట్లు వెల్లడించారు. ట్యాంకర్ల సంఖ్య కూడా 613 నుంచి 816 వరకు పెంచుకున్నట్లు తెలిపారు. మరిన్ని ట్యాంకర్లు సమకూర్చుకుంటామని వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. నీటి సరఫరాలో ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

శోభాయమానం



హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన హనుమాన్ శోభా యాత్ర కనుల పండువగా సాగింది. వేలాది మంది భక్తులు యాత్రలో పాల్గొన్నారు. జై శ్రీరామ్..జై భోలో హనుమాన్‌కీ నినాదాలతో నగరం మారుమోగింది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు కొనసాగిన యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్,, ఎమ్మెల్యే రాజాసింగ్, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి, సిటీబ్యూరో







హెచ్‌సీయూలో ఎంటెక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎంటెక్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులు అందజేసేందుకు చివరి తేదీ మే 10గా నిర్ణయించారు.

ఎంటెక్ కోర్సులవీ..

బయో ఇన్ఫర్మేటిక్స్, మెటీరియల్స్ ఇంజినీరింగ్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గేట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఎంటెక్ బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సులో 25 సీట్లు ఉండగా, మిగతా అన్ని కోర్సులలో 18 సీట్లు ఉన్నాయి. మే 22న ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తారు. మే 31న అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

సిటీలో ఆర్సీబీ క్రికెటర్ల సందడి



సాక్షి, సిటీబ్యూరో: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు క్రికెట్ జట్టు సభ్యులు మంగళవారం నగరంలో సందడి చేశారు. మంగళవారం రాత్రి బంజారాహిల్స్ లోని హోటల్ తాజ్ కృష్ణాలో విద్యుత్, కేబుల్స్ తయారీకి పేరొందిన సంస్థ నూతన ఉత్పత్తి కాన్ ఫ్లేమ్ గ్రీన్ ప్లస్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నగరవాసులతో క్రికెటర్లు ముచ్చటించారు.. క్రికెటర్ గ్రీన్ మాట్లాడుతూ మ్యాచ్‌లను ఎంజాయ్ చేస్తున్నానని హైదరాబాద్ బిర్యానీని తప్పక రుచి చూస్తానన్నారు. మరో క్రికెటర్ అనూజ్ మాట్లాడుతూ ఫుల్ షాట్ ఆడటం తనకు ఇష్టమన్నారు. మహిపాల్ మాట్లాడుతూ ఆర్సీబీలో దిగ్గజ క్రికెటర్ల సరసన ఆడటం సంతోషంగా ఉందన్నారు సంస్థ డైరెక్టర్ అక్షిత్ దివ్యజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు .

హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా సమీర్ వలీ ఉల్లా ఖాన్?


సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీ ఉల్లా ఖాన్ పేరు ఖరారైనట్లు తెలిసింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి అధికారికంగా ప్రకటన వెలువడనప్పటికీ మంగళవారం ఆయన హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వ్యవహారాల సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబైదుల్లా కొత్వాల్, అలీ మస్కతి తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీఉల్లా ఖాన్

ఐపీఎల్ ఫీవర్... హోటల్ రెంట్లు డబుల్!

- హాట్ ఫేవరేట్స్‌గా మారిన ఎస్ఆర్‌హెచ్–ఆర్సీబీ జట్లు
- 15న జరిగిన మ్యాచ్‌లో రికార్డు స్థాయి స్కోర్లు
- గురువారం ఉప్పల్‌లో మరోసారి తలపడనున్న జట్లు
- చూసేందుకు దేశవిదేశాల నుంచి తరలి వస్తున్న అభిమానులు
- పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటమూ ఓ కారణమే
- హఠాత్తుగా పెరిగిపోయిన స్టార్ హోటళ్ల రూమ్ అద్దెలు





సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫీవర్‌తో హైదరాబాద్‌లోని స్టార్ హోటళ్ల గదుల అద్దెలకు రెక్కలు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు అన్ని స్టార్ హోటళ్లు బుక్ అయిపోయాయి. దీనికితోడు రేట్లు కూడా సాధారణం కంటే రెట్టింపు అంతకంటే ఎక్కువయ్యాయి. హోటల్ గదులు బుక్ చేసుకోవడానికి ఉపకరించే ప్రముఖ వెబ్‌సైట్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఉప్పల్ స్టేడియంలో గురువారం సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)–రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్ల మధ్య ఫేవరేట్ మ్యాచ్ జరుగనుండటంతో పాటు పెళ్లి ముహూర్తాలు కూడా ఉండటం ఇందుకు కారణంగా తెలుస్తోంది.

అత్యధిక స్కోర్లతో హాట్ ఫేవరేట్లుగా...

ప్రస్తుతం ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్–ఆర్సీబీ జట్లు హాట్ ఫేవరెట్స్‌గా మారిపోయాయి. ఈ రెండింటి మధ్య ఈ నెల 15న బెంగళూరు చిన్నస్వామి స్టేడియం కేంద్రంగా ఓ మ్యాచ్ జరిగింది. అందులో ఎస్ఆర్‌హెచ్ 287, ఆర్సీబీ 262 పరుగులు చేసి రికార్డు సృష్టించాయి. ఐపీఎల్ చరిత్రలోనే ఇవి అత్యధిక స్కోర్లు కావడంతో ఈ రెండు జట్ల పైనా ఐపీఎల్ ప్రియులకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. గురువారం ఉప్పల్ స్టేడియంలోనూ ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే ఆయా జట్లు హైదరాబాద్ చేరుకున్నాయి. వీరి కోసం రెండు స్టార్ హోటళ్లలో చాలా భాగం నిర్వాహకులు బుక్ చేశారు. దీంతో పాటు ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు దేశవిదేశాల నుంచి అనేక మంది క్రికెట్ అభిమానులు వస్తున్నారు. వీళ్లు సైతం ఆన్‌లైన్‌లో, ప్రముఖ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా స్టార్ హోటళ్లలో గదులు బుక్ చేసుకుంటున్నారు. ఈ కారణంగానే హైదరాబాద్‌లోని అనేక స్టార్ హోటళ్లలో శుక్రవారం వరకు గదులు ఖాళీ లేవని ఆయా వెబ్‌సైట్లు చూపిస్తున్నాయి.



సరాసరిని మించిన బుకింగ్...

హోటళ్లల్లో గదులు బుక్ కావడం, అందులో అతిథులు బస చేయడాన్ని ఆక్యుపెన్సీగా పిలుస్తారు. స్టాటిస్టా సంస్థ అధ్యయనం ప్రకారం హైదరాబాద్‌లోని స్టార్ హోటళ్లల్లో ఆక్యుపెన్సీ రేటు సరాసరి గరిష్టంగా 50 నుంచి 60 శాతం మాత్రమే ఉంటోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఇది 51 శాతంగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 73 శాతంగా నమోదైంది. అయితే ఐపీఎల్ మ్యాచ్‌తో పాటు పెళ్లి ముహూర్తాలు కూడా ఉండటంతో ప్రస్తుతం అనేక స్టార్ హోటళ్లు 'నో రూమ్'గా మారిపోయాయి. ఉన్న వాటిలోనూ అద్దెలు సాధారణ సమయం కంటే రెట్టింపు, అంతకంటే ఎక్కువగా ఉన్నట్లు ప్రముఖ వెబ్‌సైట్లు, యాప్స్ సూచిస్తున్నాయి. గురువారం రాత్రి క్రికెట్ మ్యాచ్ ఉండటంతో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఇవే రేట్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా మామూలు రోజుల్లో కంటే వీకెండ్స్‌లో హోటల్ రూముల అద్దెలు ఎక్కువగా ఉంటాయి. ఈ లెక్కన చూసినా శని–ఆదివారాల్లో ఆయా హోటళ్ల అద్దెల కంటే మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఎక్కువగా ఉన్నాయి.

- సైబరాబాద్ పరిధిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న షెరిటన్ హోటల్‌లో ప్రెసిడెన్షియల్ స్వీట్ అద్దె మంగళ–బుధవారాల్లో రూ.1.28 లక్షలుగా ఉండగా... శుక్రవారం నుంచి ఇది రూ.64 వేల నుంచి రూ.67 వేల వరకు మాత్రమే ఉన్నట్లు ఆయా వెబ్‌సైట్లు చూపిస్తున్నాయి. ఇదే హోటల్‌లో సాధారణ గది అద్దె మంగళ–బుధవారాల్లో రూ.21,500గా, శని–ఆదివారాల్లో రూ.11,250గా ఉంది.
- హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో మంగళ–బుధవారాలకు అద్దె రూ.32 వేలుగా చూపిస్తోంది. శని–ఆదివారాలకు ఈ మొత్తం రూ.9,800గా ఉంది. వెస్టిన్ హోటల్‌లో మంగళ–బుధవారాలకు రూ.22,500గా, శని–ఆదివారాలకు రూ.10 వేలుగా కనిపిస్తోంది.
- సోమాజీగూడలోని ది పార్క్ హోటల్‌లో గది అద్దె మంగళ–బుధవారాలకు రూ.11,587గా, శని–ఆదివారాలకు రూ.5,071గా ఉంది. గురు–శుక్రవారాల్లో ఆయా హోటళ్లలో నో రూమ్ అని కనిపిస్తోంది.

(అద్దె మొదటి రోజు చెక్ ఇన్ సమయం నుంచి రెండో రోజు చెక్ ఔట్ సమయం వరకు... పన్నులు దీనికి అదనం)

చేసేది గ్లాస్ కట్టర్ పని.. చెప్పేది గూగుల్‌లో టీమ్ లీడర్!

- పెళ్లి పేరుతో వితంతువుకు టోకరా
- రూ.1.80 కోట్లు వసూలు
- కస్టమ్స్ ఆఫీసర్లుగా నకిలీ గుర్తింపు కార్డులు
- తక్కువ ధరకు బంగారం అందిస్తానని మోసాలు
- కాజేసిన సొమ్ముతో విదేశాల్లో జల్సాలు

సాక్షి, సిటీబ్యూరో: పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వితంతువులను మోసం చేసి అందినకాడికి దోచుకుంటున్న వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా, వలపాలవారిపల్లికి చెందిన కొమ్మినేని వంశీ చౌదరి అలియాస్ కృష్ణ వంశీ చౌదరి డిగ్రీ చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. అనంతరం బెంగళూరు వెళ్లిన ప్లైవుడ్ షాపులో గ్లాస్ కట్టర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో ప్లైవుడ్ షాప్ పక్కనే ఉన్న జాబ్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో అతడికి పరిచయం ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడటంతో అతడిపై కోరమంగళ ఠాణాలో కేసు నమోదైంది. 2015 నుంచి క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన వంశీ.. న్యూయార్క్‌లో గూగుల్ టీమ్ లీడర్‌గా పని చేస్తున్నట్లు పేర్కొంటూ షాదీ.కామ్‌లో నకిలీ ప్రొఫైల్ సృష్టించాడు.

- ఇదిలా ఉండగా కొండాపూర్‌కు చెందిన వితంతువు మళ్లీ పెళ్లి చేసుకునేందుకు షాదీ.కామ్‌లో వివరాలను నమోదు చేసింది. ఈ క్రమంలో ఆమెకు వంశీ చౌదరితో పరిచయం ఏర్పడింది. అమెరికాలో గూగుల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పుకున్న అతను ప్లే స్టోర్ నుంచి టెక్స్ట్‌మీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, దీని ద్వారా అమెరికా నంబర్లను కొనుగోలు చేశాడు. వీటితో బాధితురాలితో పాటు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ నమ్మకాన్ని సంపాదించుకున్నాడు.

అకౌంట్లు బ్లాక్ చేశారని..

తన కుటుంబ సభ్యులను పెళ్లికి ఒప్పించేందుకు ఇండియాకు వస్తున్నానని, అయితే ఆమెకు ఇద్దరు పిల్లలు ఉండటంతో తన కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించడం లేదని బాధితురాలికి చెప్పాడు. అయినా ఆమెతో పెళ్లి కోసం కుటుంబ సభ్యులను సైతం దూరం చేసుకుంటానని నమ్మించాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఫోన్ చేసి నీతో పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పటి నుంచి తన కుటుంబ సభ్యులు తన బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేశారని, దీంతో చేతులు చిల్లిగవ్వ కూడా లేదని, అకౌంట్లు అన్‌ఫ్రీజ్ చేయడానికి కొంత డబ్బు అవసరం ఉందని చెప్పాడు. పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోదామని నమ్మించడంతో బాధితురాలు పలు బ్యాంక్ ఖాతాల వివరాలు, డెబిట్ కార్డులను సైతం వంశీకి ఇచ్చింది. బంగారం, వెండి ఆభరణాలను సైతం సమర్పించుకుంది. పలు దఫాలుగా ఆమె నుంచి రూ.1.80 కోట్లు వసూలు చేసిన వంశీ ఆ తర్వాత స్పందించడం మానేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు గత నెల 28న సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం నిందితుడు వంశీని అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, నకిలీ రబ్బరు స్టాంప్‌లు, గూగుల్ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

కొట్టేసిన సొమ్ముతో విదేశాల్లో జల్సాలు..

కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తక్కువ ధరకు అందిస్తానని పలువురిని మోసం చేసినట్లు గుర్తించారు. ఇందుకు గాను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్, కస్టమ్స్ సూపరింటెండెంట్, బాండ్స్ ఆఫీసర్ పేర్లతో నకిలీ స్టాంపులు రూపొందించినట్లు తెలిపారు. బాధితుల నుంచి కొట్టేసిన సొమ్ముతో టూరిస్ట్ వీసాలపై దుబాయ్, మలేషియా, సింగపూర్, బ్యాంకాక్ వెళ్లి జల్సాలు చేసేవాడన్నారు.

నేడు దానం నాగేందర్ నామినేషన్

పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు.ఈ మేరకు మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్ చౌదరి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్,సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా బీ ఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమ్యే ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొననున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ అధిష్టానం సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిందని నాగేందర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తన టికెట్ కోసం తీవ్రంగా కృషి చేశారని, ఆయనకు రుణపడి ఉంటానన్నారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

27 లోగా హజ్‌యాత్ర మూడో విడత డబ్బులు జమచేయాలి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం నుంచి 2024 హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులు ప్రయాణ ఖర్చుల నిమిత్తం మూడో విడత డబ్బులను ఏప్రిల్ 27లోగా చెల్లించాలని రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ లియాకత్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 10వ తేదీ వరకు చివరి గడువును యాత్రికుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 27 వరకు పొడిగించినట్లు తెలిపారు. హజ్ యాత్రకు ఎంపికైన వారు ఇప్పటికే మొదటి విడతగా రూ. 82,800, రెండో విడతగా రూ. 1.70 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మూడో విడతగా రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల మంది హజ్ యాత్రకు ఎంపికయ్యారని, డబ్బులు చెల్లించని వారి స్థానంలో ఇతరులకు అవకాశం కల్పిస్తామన్నారు. యాత్రికులు యాత్రకు అవసరమైన ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు పాస్ పోర్టును రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో జమ చేయాలని తెలిపారు. దీంతో పాటు సీరియల్ నెంబర్ వెయ్యి వరకు వెయిటింగ్‌లో ఉన్న వారు కూడా పాస్‌పోర్టు జమచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు www.hajcommite.gov.in సందర్శించాలన్నారు.

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా మెట్రో అదనపు సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 25న జరుగనున్న ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా మెట్రో అదనపు సర్వీసులు నడపనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలోని మూడు కారిడార్‌లలో ఆఖరి మెట్రో సర్వీసులు గురువారం రాత్రి 12.15 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 1.10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఉప్పల్, స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్‌లలో మాత్రం ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు తెరిచి ఉంచుతారు. మిగతా స్టేషన్లలో కేవలం నిష్క్రమణ ద్వారాలు మాత్రమే తెరిచి ఉంటాయి.

60 అదనపు బస్సులు....

ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే క్రికెట్ అభిమానుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గురువారం ఉప్పల్ స్టేడియం వరకు 60 బస్సులను అదనంగా నడుపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.అర్ధరాత్రి వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను ఏర్పాటు చేయనున్నారు.

విధుల్లో అలసత్వం.. ఎస్సై సస్పెన్షన్



సూరారం ఎస్సై నారాయణసింగ్

సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటనలో ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఆత్మహత్యగా పేర్కొంటూ కేసు నమోదు చేసిన ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జనవరి 14న సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివాలయం నగర్‌లో కుళ్లిపోయిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలానికి వెళ్లిన సెక్టర్ ఎస్సై నారాయణసింగ్ ఎలాంటి దర్యాప్తు చేపట్టకుండా ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు మంగళవారం అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యానిమేషన్ స్టోరీ రైటర్ ఆత్మహత్య



సాయి ప్రశాంత్(ఫైల్)

గచ్చిబౌలి: అప్పుల బాధతో ఓ సినీ యానిమేషన్ స్టోరీ రైటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండ, పంచవటి కాలనీలో విక్రమ్ హైట్స్‌లో సినీ యానిమేషన్ రైటర్ దాసరి లలిత సాయి ప్రశాంత్(45) ఒంటరిగా ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం బంధువులు అతడికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి చెప్పారు. అతను సాయి ప్రశాంత్ ఫ్లాట్‌కు వెళ్లి చూడగా అతను ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వాచ్‌మెన్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కొన్నాళ్లుగా అతను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని, ఈ క్రమంలో అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని తెలిపారు, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మాధవీలత నామినేషన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కొంపెల్ల మాధవీలత బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

14 నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

రాజేంద్రనగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి మంగళవారం 14 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన ఎంసీపీఐ(యూ) పార్టీ, బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో వనం సుధాకర్ రెండో సెట్, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ 3వ, 4వ సెట్ నామినేషన్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. వీరితో పాటు కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం రంజిత్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా గోనె శ్రీనివాస్ రెడ్డి, సోషల్ జస్టిస్ పార్టీ (ఎస్‌జేపీ) అభ్యర్థిగా ఫణి ప్రసాద్ కటకం, స్వతంత్ర అభ్యర్థిగా సప్తగిరి విశ్వకర్మ, స్వతంత్ర అభ్యర్థిగా ఉమేశ్ బోయా, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ పాషా, బ్లూ ఇండియా పార్టీ అభ్యర్థిగా చింతలగారి వెంకటస్వామి, అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (ఆదార్ పార్టీ) అభ్యర్థిగా శ్రీదేవి, స్వతంత్ర అభ్యర్థిగా గోవింద్ లాల్, స్వతంత్ర్య అభ్యర్థిగా మర్క సతీష్ సాగర్, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా బింగి రాములు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి ఇప్పటి వరకు మొత్తం 37 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి వివరించారు.



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

నీటి సమస్యను పరిష్కరించండి


జలమండలి సెక్షన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ జేహెచ్‌ఎస్‌నగర్‌లో జలమండలి సరఫరా చేసే నీటి ప్రెషర్ తక్కువగా ఉండడంతో ఇబ్బందికి గురవుతున్నామంటూ మాల వెలుగు సంఘం ప్రతినిధులు వాటర్‌వర్క్స్ మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు మేనేజర్‌ను కలిసి సమస్య తీవ్రతను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. తమ వీధిలో నీటి ప్రెషర్ తక్కువగా ఉండడంతో 20 కుటుంబాల వారు నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో నటి, బిగ్‌బాస్ ఫేం రితిక సందడి చేశారు. రెండు రోజుల పాటు (మంగళ, బుధ వారాల్లో) జరిగే సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారులు, డిజైనర్లను ఒకచోట చేర్చే వేదికగా సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నిలుస్తుందన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సారి ఫ్యాషన్ ప్రియులను అలరించేవిధంగా వస్త్ర, కళా ఉత్పత్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ 65 డిజైనర్లకు పైగా రూపొందించిన దుస్తులు, బెస్పోక్ ఆభరణాలు, చేతితో తయారుచేసిన బూట్లు, డిజైనర్ క్లచ్‌లు, జుట్టు ఉపకరణాలు, గృహాలంకరణ వస్తువులను ప్రదర్శించనున్నామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని వివరించారు.

కాబోయే భార్య కనిపించడం లేదంటూ వైద్యుడు ఫిర్యాదు

వెంగళరావునగర్: కాబోయే భార్య కనిపించడంలేదంటూ ఓ వైద్యుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కార్మికనగర్ నివాసి అన్షుకుమార్ మాదాపూర్‌లో ఫిజియోథెరపిస్ట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. వరంగల్‌కు చెందిన మహిళా ఫిజియోథెరపిస్ట్‌తో ఏడేళ్ళుగా ప్రేమలో ఉన్నాడు. ఈనెల 26న పెళ్లిచేసుకోవాలనుకున్నారు. ఇద్దరూ వరంగల్‌నుంచి 21న నగరానికి వచ్చారు. 22న సాయంత్రం విధులు ముగించుకుని రూంకు వచ్చాడు. అయితే అక్కడ కాబోయే భార్య కనిపించలేదు. ఆందోళన చెందిన అన్షుకుమార్ అన్నిచోట్ల వెదికి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్మికనగర్‌లో చోరీ.. రూ.50వేలు మాయం

వెంగళరావునగర్ : సొంతింటికి వెళ్లి వచ్చేలోగా పాస్టర్ గదిలో దొంగలు పడి నగదు, డాక్యుమెంట్లు దోచుకెళ్ళిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎం.సాల్మన్ కార్మికనగర్‌లో పాస్టర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 19న మోతీనగర్‌లోని సొంతింటికి వెళ్ళి 21న వచ్చాడు. అయితే తన గది తలుపు తెరిచి ఉంది. గదిలోని తన ప్రత్యేక బాక్స్ కనిపించలేదు. అందులో రూ.50వేలు నగదు, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయని పాస్టర్ సాల్మన్ మధురానగర్ పోలీసులకు తెలియజేశారు.

నాని కార్స్‌లో భారీ అగ్ని ప్రమాదం..



బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలోని గణపతి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నాని సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయ కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారులోని బ్యాటరీ పేలడంతో మంటలు వ్యాపించి గంట వ్యవధిలోనే అక్కడ పార్కింగ్ చేసి ఉన్న 23 కార్లు దగ్ధమయ్యాయి. ఉదయం మంటలను గుర్తించిన వాహనదారులు వాచ్‌మెన్ అంజద్‌ను అప్రమత్తం చేశారు. అతను యజమాని నరేందర్ నానికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అతను మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించాడు. ఇంకా కొన్ని కార్లకు మంటలు అంటుకోకుండా వాటి అద్దాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి మూడు కార్లను బయటికి తీసుకురాగలిగారు. ఈ ఘటనలో నానితో పాటు అంజద్‌కు గాయాలయ్యాయి. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోగా వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. యజమాని నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో దాదాపు రూ.కోటి ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సలహాదారుగా కరుణా గోపాల్

లక్డీకాపూల్ : భారతీయ జనతా పార్టీ నాయకురాలు, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణ గోపాల్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సలహాదారుగా ఆహ్వానం అందింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ), ఐఐటీ ఢిల్లీ, ఐఐటి హైదరాబాద్, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ (యూఎస్‌ఏ)ల కన్సార్టియం ఆధ్వర్యంలో ఐఐటీ కాన్పూర్‌లోని సుస్థిర నగరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సలహాదారుగా ఆమెకు ఈ ఆహ్వానం అందింది. 14 దేశాలు తమ స్మార్ట్ డెవలప్‌మెంట్ ప్రయత్నాలను మెరుగుపరుచుకునేందుకు కరుణను ఆహ్వానించాయి. భారత్‌లో '100 స్మార్ట్ సిటీస్ మిషన్' ఇండియా టెక్నాలజీ రోడ్ మ్యాప్ 2047కి ఆమె సహకరించారు. గతంలో వరల్డ్ బ్యాంక్, డీఎఫ్ఐడీ (డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్, యూకే), యూఎస్ఏఐడీ (యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్), ఏడీబీ (ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్)లకు అర్బన్ ఎక్స్‌పర్ట్‌గా కూడా కరుణ గోపాల్ పని చేశారు.

ఉత్సాహంగా ఎల్లో కలర్ డే వేడుకలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని బీవీబీపీ ఆత్మకూరు రామారావు స్కూల్‌లో మంగళవారం ఎల్లో కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఎల్లో డ్రెస్సుల్లో వచ్చి సందడి చేశారు. అలాగే పాఠశాల తరగతి గదులను ఎల్లో కలర్‌లోకి మార్చడంతో పాటు ఎల్లో కలర్ వస్తువులను ప్రదర్శించారు. పసుపు రంగు ప్రాధాన్యతను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు. అలాగే పోస్టింగ్, కలరింగ్ యాక్టివిటీస్‌ను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న విజయారెడ్డి...

- ఆంజనేయ స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలు ఆలయాల్లో లక్ష తమలపాకుల పూజలు
- భారీగా అన్నదాన కార్యక్రమాలు

బంజారాహిల్స్: హనుమాన్ జయంతి వేడుకలు నియోజక వర్గ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు ప్రాంతాల్లో ఆలయాల నిర్వాహకులు బస్తీ, కాలనీవాసులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

- నందినగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన లక్ష తమలపాకుల పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దశరథతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.
- బంజారాహిల్స్ ఉదయ్‌నగర్ హనుమాన్ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.
- పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో టీఎమ్మార్పీఎస్ యువ సేన అధ్యక్షుడు నల్ల శివ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు నవీన్ పాల్గొన్నారు. 3 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ప్రతాపనగర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నందినగర్‌లో అన్నదానం

ప్రతాప్‌నగర్‌లో అన్నదాన

వైభవంగా హనుమాన్ ర్యాలీ


వికాస్‌పురికాలనీలో హనుమాన్ జయంతి పూజల్లో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్


ర్యాలీ జెండా ఊపి ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి

రహమత్‌నగర్ : హనుమాన్ జయంతి వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో ఘనంగా నిర్వహించారు. బోరబండ డివిజన్‌లో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి జనార్ధన్ రెడ్డి జెండాను ఊపి ర్యాలీ ప్రారంభించారు. సైట్3 గోశాల మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ పలు ఆలయాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాయకులు నరసింహా, మహేష్‌గౌడ్, ఖయ్యూం పాల్గొన్నారు.


ప్రతాప్‌నగర్‌లో సినీ నటుడు నవీన్ తదితరులు...


ఉదయ్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం...


భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్తాం...

ఇంటి వద్దే దింపేస్తాం

- దివ్యాంగులకు అధికారుల అవకాశం
- ఓటు వేసి ఇంటికి చేర్చే వరకు బాధ్యత
- ప్రత్యేక యాప్‌పై అవగాహన


సక్షం మొబైల్ యాప్‌పై దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్న సర్కిల్-18 డీపీవో ఆశా విరానిక

బంజారాహిల్స్: ఓటరు శాతం పెంచేందుకు ఎన్నికల యంత్రాంగం ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడం లేదు. ఇందులో భాగంగా అను నిత్యం వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. తాజాగా దివ్యాంగుల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వారు పోలింగ్ కేంద్రం వరకు వచ్చి ఓటు హక్కు వినియోగించునేలా వాతావరణాన్ని తయారు చేస్తున్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీపీవో ఆశా విరానిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ, అవగాహనకార్యక్రమం నిర్వహించారు. వారి కోసం ప్రత్యేకంగా ఎన్నికల యంత్రాంగం రూపొందించిన 'సక్షం' మొబైల్ యాప్ గురించి అవగాహన కల్పించారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలో 1564 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని వారందరికీ పోలింగ్ బూత్‌ల వారిగా ఈ మొబైల్ యాప్‌ను వారి ఫోన్‌లో రిజిష్టర్ చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉండే బీఎల్‌వోలు, ఆర్పీలు వారికి దాని ప్రయోజనాలు వివరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఓటు వేయడానికి ముందుకు వచ్చిన దివ్యాంగులను అధికారులు ప్రత్యేకంగా సత్కరించారు.



ఓటరు శాతాన్ని పెంచేందుకే

దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఓటు వేసేందుకు కాస్త ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటరు కేంద్రానికి తీసుకొచ్చి మళ్ళీ ఇంటి వద్ద దిగబెట్టేలా కార్యాచరణను రూపొందించాం. ప్రతీ ఓటు విలువైనదే అనే విషయాన్ని వారికి తెలియజేస్తున్నాం. 100 శాతం దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేస్తున్నాం. మొబైల్ యాప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – ఆశా విరానిక, డీపీవో, సర్కిల్-18

పౌల్ట్రీ పరిశ్రమలో అవకతవకలు జరగలేదు

తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.రాఘవరావు


మాట్లాడుతున్న రాఘవరావు

గచ్చిబౌలి: పౌల్ట్రీ పరిశ్రమలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, తమ పరిశ్రమను రాజకీయాల్లోకి లాగవద్దని తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.రాఘవరావు పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవకతవకలు చేశారని ఎవరిపై విమర్శలు చేస్తున్నారో వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్నా అభ్యంతరం లేదన్నారు. పౌల్ట్రీ పరిశ్రమలో దాణా కుంభకోణం, గుడ్ల స్కాం జరగలేదని ఆయన స్పష్టం చేశారు. పౌల్ట్రీ రంగంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన వారు ఉన్నారని, ఏ పార్టీతో తమకు సంబంధం లేదన్నారు. పౌల్ట్రీ ఇండస్ట్రీలో లేయర్ ఇండస్ట్రీ, బ్రాయిలర్ వేరు అని అన్నారు. బ్రాయిలర్‌లో ఉన్న వారికి అంగన్‌వాడీలకు గుడ్లు సప్లయ్ చేసే వారికి సంబంధం ఉండదన్నారు. 2019లో మేజ్ విషయంలో కొందరు రైతులు ధర్నా చేయడంతో అసెంబ్లీలో జరిగిన చర్చతో వివాదం ముగిసిందన్నారు. నాలుగేళ్ల తరువాత అదే అంశాన్ని మళ్లీ లేవనెత్తడంలో అర్థం లేదన్నారు. విమర్శలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం 2020లో 5 లక్షల టన్నుల దాణాకు అనుమతి ఇచ్చిందన్నారు. తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ వి.భాస్కర్ రావు మాట్లాడుతూ రైతులు, కాంట్రాక్టర్లు మాత్రమే అంగన్‌వాడి కేంద్రాలకు గుడ్లు సప్లయ్ చేస్తారని తెలిపారు. ప్రభుత్వం నుంచి కేవలం విద్యుత్ బిల్లులకు మాత్రమే రాయితీ లభిస్తుందన్నారు. సమావేశంలో తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, ఉపాధ్యక్షులు మధుసూదన్, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

పంజగుట్ట: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్న డిమాండ్‌పై అన్ని పార్టీలు వారి వైఖరి ప్రకటించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (నగారా భేరి) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. జూన్ 20వ తేదీన చలో ఇందిరాపార్క్ గిరిజన గర్జన ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమరం బుచ్చయ్యతో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే నియంత పోకడలకు పోతే తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు.

వాష్‌రూంకు వెళ్ళి వచ్చేలోగా బ్యాగ్ మాయం

వెంగళరావునగర్ : వాష్‌రూంకు వెళ్ళివచ్చేలోగా మహిళ బ్యాగ్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్‌పేట బీఎస్ఎన్ఎల్‌లో విధులు నిర్వహించే హారిక ఈనెల 22న కార్యాలయంలోనే వాష్‌రూంలోకి వెళ్ళింది. ఐదు నిముషాల తర్వాత వచ్చి చూడగా తన బ్యాగ్ కనిపించలేదు. అందులో రూ.3వేలు నగదు, 4 గోల్డ్ రింగ్స్, డెబిట్ కార్డులు, ఆఫీస్ డాక్యుమెంట్స్, వెండి పట్టాలు ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ద్విచక్రవాహనం మాయం

వెంగళరావునగర్ : ప్రమాదవశాత్తు కింద పడటంతో ఆసుపత్రికి వెళ్ళిన బాధితుడి వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. అల్లాపూర్‌కు చెందిన జలీలుద్దీన్ ఈనెల 17న తన త్రిచక్ర వాహనంమీద వస్తూ మధురానగర్ సమీపంలోని ప్రధాన రహదారిపై పడ్డాడు. ఈ సంఘటనలో అతనికి గాయాలు కాగా కుమారుడు మహ్మద్ ఆలీ వచ్చి తండ్రిని ఆసుపత్రికి తరలించాడు. అనంతరం వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో ఆలీ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్‌హోల్‌లో మృతశిశువు



బంజారాహిల్స్: మ్యాన్‌హోల్‌లో మృతశిశువు కలకలం సృష్టించింది.. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలోని ఓ వీధిలో సీవరేజి ఓవర్ ఫ్లో అవుతుండటంతో స్థానికుల ఫిర్యా దు మేరకు మంగళవారం జలమండలి సిబ్బంది మ్యా న్‌హోల్‌ను శుభ్రం చేసేందుకు వచ్చారు. పనులు చేస్తుండగా వారి పరికరాలకు ఓ చిన్నారి మృతదేహం తగలడంతో బయటికి తీశారు. వారి సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న జలమండలి అధికారులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెలలు నిండిన బాలుడి మృతదేహంగా గుర్తించిన పో లీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రగతి నివేదన


గతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రగతి నివేదన పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు


రాజ్‌భవన్ హైస్కూల్‌లో 'అమ్మ ఆదర్శ' పాఠశాల కమిటీ సమావేశంలో చైర్మన్ సుజాత

బంజారాహిల్స్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించగా మంగళవారం ఆఖరు రోజు కావడంతో సర్కార్ బడుల్లో సందడి నెలకొంది. విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రగతి నివేదన పత్రాలను ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి పంపిణీ చేశారు. ఖైరతాబాద్ జోన్ విద్యాశాఖ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను అందజేశారు. మరోవైపు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఉపాధ్యాయులతో సమావేశమయ్యాయి. రాజ్‌భవన్ హైస్కూల్‌లో కమిటీ చైర్మన్ సుజాత, ఇన్‌ఛార్జి హెచ్ఎం గోపాల్‌తో పాటు ఉపాధ్యాయులు మహిళా సమాఖ్య ప్రతినిధులు కమిటీ సమావేశంలో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రతి పాఠశాలకు మరమ్మతుల కోసం రూ.2 లక్షలు కేటాయించగా, మొదటి విడతలో 20 శాతం నిధులు రెండు రోజుల్లో బ్యాంక్ ఖాతాలో జమ కానున్నాయి.

'దానం'పై ఈసీకి ఫిర్యాదు చేశాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: ఎన్నికల ప్రచారంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దానం నాగేందర్ తన మాటలను వెనక్కు తీసుకోవాలని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ డిమాండ్ చేశారు. మధురానగర్‌కాలనీలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దానం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో దానం రౌడీలతో కలిసి సన్మానం చేయించుకుంటూ మాగంటిని రౌడీయిజం చేస్తున్నారని, రౌడీలను పెంచి పోషిస్తున్నారని విమర్శించడం తగదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ మహిళానేతలు శారద, వాణి, సుజాత, కుమారి, లక్ష్మి, నాయకులు విజయ్‌కుమార్, కిట్టు, పవన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పార్సిల్ చేస్తున్నారంటూ వైద్యురాలికి భారీ మోసం

రూ.48 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: కొరియర్ ద్వారా డ్రగ్స్ పార్సిల్ చేస్తున్నారంటూ ఓ వైద్యురాలిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగర సైబర్ క్రై మ్ పోలీసులు తెలిపిన మేకు.. నగరానికి చెందిన వైద్యురాలికి ఫెడెక్స్ కొరియర్ పేరతో సైబర్ చీటర్స్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. ఆమె పేరుపై మలేషియా నుండి ఢిల్లీకు డ్రగ్స్ పార్సెల్ అవుతున్నట్లు తెలిపారు. ఆమె వాట్సాప్‌కు అరెస్ట్ వారెంట్‌ను పంపి , కోర్టుకు హాజరు కావాలని భయాందోళనకు గురిచేశారు. సీబీఐ సీనియర్ అధికారి పేరిట సుమారు 2 గంటల పాటు విచారణ చేశారు. ఈ సమయంలో బాధితురాలి భర్త , కుటుంబ సభ్యుల బ్యాంక్ వివరాలను సేకరించారు. బ్యాంక్ అకౌంట్‌లలో ఉన్న నగదును ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం వెరిఫై చేసి తిరిగి చెల్లిస్తామన్నారు. ఆమె తన ఖాతాలో మూడు వేలు మాత్రమే ఉన్నాయని, తన రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లలో రూ.50 లక్షలు ఉన్నట్లు తెలిపింది. వెంటనే ఆ డిపాజిట్‌ల నుండి 48 లక్షలు తమకు బదిలీ చేయాలని... ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఆ నగదును పరిశీలించి తిరిగి పంపిస్తామని నమ్మించారు. వారు చెప్పిన విధంగా నగదును ట్రాన్స్ఫర్ చేసింది. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని బాధితురాలు సైబర్ క్రై మ్ పోలీసులకు ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేసింది.

డెబిట్ , క్రెడిట్ కార్డుల అప్డేట్ పేరుతో మోసం

క్రెడిట్ , డెబిట్ కార్డుల అప్డేట్ పేరిట హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. బాధిత వ్యక్తికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుండి కాల్ చేస్తున్నట్లు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. అతని వద్ద ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కు సంబంధించిన క్రెడిట్ , డెబిట్ కార్డులను అప్డేట్ చెయ్యాలని, లేనిపక్షంలో అవి బ్లాక్ అవుతాయని తెలిపారు. అది నిజమేనని నమ్మిన బాధితుడు వారికి అతని కార్డ్స్ వివరాలు తెలిపాడు. వెంటనే అతనికి వచ్చిన ఓటీపిలను కూడా వెల్లడించారు. దానితో బాధితుడి క్రెడిట్ , డెబిట్ కార్డుల నుండి ఐదు లక్షల మూడు వేల రూపాయలు డెబిట్ అయ్యాయి. అనంతరం సైబర్ నేరగాళ్లు అతని కార్డులను డియాక్టివేట్ చేసి మళ్లీ యాక్టివ్ చేశారు. దీంతో మోసపోయానని బాధితుడు సైబర్ క్రై మ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

25 నుంచి మే 2 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్‌సీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 25 నుంచి మే 2 వరకు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈఓ సూచించారు.

రూ. వందల కోట్లున్నా రంజిత్‌రెడ్డికి కారు లేదు!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పేరున రూ.158.81 కోట్లు, ఆయన సతీమణి సీతాదేవి పేరున రూ.135.52 కోట్లు, ఆయన కుమారుడు రాజార్యన్‌రెడ్డి పేరున రూ.14.17 లక్షల విలువ చేసే ఆస్తులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. ఆయన పేరున రూ.37.83 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, ఆయన సతీమణి పేరున రూ.1.59 కోట్ల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు ఉన్నట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపారు. వివిధ బ్యాంకుల్లో ఆయన పేరున రూ.20.39 కోట్లు, ఆయన భార్య పేరున రూ.2.62 కోట్ల అప్పులు ఉన్నట్లు ప్రకటించారు. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ ఆయనకు సొంతంగా కారు కూడా లేదు. ఆయనపై ఒక క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉంది.

కాసానికీ కారు లేదు..

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబ ఆస్తులు రూ.15.12కోట్లు ఉన్న ట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ప్రకటించారు. ఆయన పేరున రూ.3.16 కోట్లు, ఆయన సతీమణి పేరున రూ.11.95 కోట్లు ఉన్నట్లు చూపించారు. వీరి పేరున రూ.30 లక్షల అప్పు ఉన్నట్లు పేర్కొన్నారు. కాసాని పేరున సొంత వాహ నం లేదు కానీ ఆయన భార్య పేరున మాత్రం నాలుగు వాహనాలు ఉన్నట్లు తెలిపారు. ఇక 50.20 ఎకరాల భూముల తోపాటు ఒక క్రిమినల్ కేసు ఉంది.

అప్పుల్లేని ఆత్రం సక్కుపై 47 క్రిమినల్ కేసులు

- రూ.1,77,49,000 ఆస్తులున్నట్లుగా అఫిడవిట్‌లో వెల్లడి
- బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థి ఆత్రం సక్కు

కైలాస్‌నగర్: తన పేరిట రూ.1,77,49,000 విలువైన చరాస్తులు, మరో రూ.3లక్షల విలువైన స్థిరాస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మంగళవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన ఆయన తన పేరిట, తన కుటుంబ సభ్యుల పేరిట బ్యాంకుల్లో ఎలాంటి అప్పులు గానీ రుణాలు గానీ లేవని వెల్లడించారు. తనపై వివిధ పోలీస్ స్టేషన్లలో 47 క్రిమినల్ కేసులు నమోదైనట్లుగా వెల్లడించారు. ఉమ్మడి జిల్లా ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, ఉట్నూర్ పీఎస్ పరిధిలో 31, సిర్పూర్ (యు) పీఎస్‌లో 9, జైనూర్ పీఎస్ పరిధిలో రెండు, తిర్యాణి పోలీస్ స్టేషన్‌లో ఒకటి చొప్పున మొత్తం 47 క్రిమినల్ కేసులు నమోదైనట్లుగా పేర్కొన్నారు.

మాలోత్ కవితపై రెండు కేసులు

మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితపై రెండు పోలీస్ కేసులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు ఒక కేసు, 2014లో ఓటర్లకు డబ్బులు పంచారన్న ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. కవితతోపాటు ఆమె కుటుంబ సభ్యుల(భర్త భద్యనాయక్, కుమార్తె మహతి, కుమారుడు నయన్)కు ఆస్తుల(చరాస్తులు - నగదు, బ్యాంక్, డిపాజిట్లు, ఇనూరెన్స్, బంగారం, వాహనాలు) విలువ అంతా కలిపి రూ 3,97,72,259 ఉంటుందని చూపించారు. రెండు వాహనాలకు రూ.39,30,000, బంగారం 115తులాలకు గాను విలువ రూ 76,13,000 ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు. అప్పులు రూ.10,05,024 ఉన్నట్లు చూపించారు.

బీజేపీకి 40 మంది స్టార్ క్యాంపెయినర్లు

- ఎన్నికల సంఘానికి పంపిన తెలంగాణ బీజేపీ
- జాబితాలో ప్రధానిసహా కీలక నేతలు
- జయసుధకు దక్కని అవకాశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే 40 మంది బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా సిద్ధమైంది. ఈ జాబితాను బీజేపీ ఎన్నికల సంఘానికి పంపింది. ఇందులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, జేపీ నడ్డా, అమిత్ షా లాంటి జాతీయ నేతలతో పాటు తెలంగాణ నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్‌తో పాటు పలువురి పేర్లు ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సైతం స్టార్ క్యాంపెయినర్ జాబితాలో చోటు దక్కింది. కానీ ఇప్పటి వరకు ఆయన ప్రచారంలో పాల్గొనలేదు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో సినీ నటులు రాధిక శరత్ కుమార్, కుష్బూ, జీవిత రాజశేఖర్‌లకు చోటు దక్కగా.. నటి జయసుధ పేరు లేకపో వడం గమనార్హం.



నేడు మహిళల రాజకీయ సాధికారత దినోత్సవం

లోక్‌సభలో నారీ పవర్..

- జాతీయస్థాయి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి సై అంటున్న నారీమణులు
- 1951లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన 22 మంది మహిళలు
- 2009లో 50 దాటిన మహిళా ఎంపీల సంఖ్య... 2019లో అత్యధికంగా 78 మంది గెలుపు


(మేకల కళ్యాణ్ చక్రవర్తి)

రాజకీయాల్లో రాణించడం.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి విజయతీరాలకు చేరడం అంత సులువేమీ కాదు. భారత్‌లాంటి సాంప్రదాయ దేశాల్లో మహిళాలోకం రాజకీయంగా అభివృద్ధి చెందడం కొద్దిగా కష్టమే. అయినా ఉక్కు మహిళలుగా పేరొందిన మన దేశ నారీమణులు ప్రత్యక్ష ఎన్నికల్లో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు. సమకాలీన పరిస్థితులు, పురుషాధిపత్య రాజకీయాలను అధిగమిస్తూ అనేకస్థాయిల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గ్రామ సర్పంచ్ మొదలు దేశ ప్రధాని, రాష్ట్రపతి లాంటి మహోన్నత స్థానాల్లో కూడా కూర్చున్న ఘనత మన భారతీయ మహిళలది. మండల పరిషత్ అధ్యక్షురాలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులుగా, ఆర్థికం లాంటి కీలకశాఖలు నిర్వహించిన ధీర వనితలుగా మన దేశ మహిళలకు రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి భారతీయ మహిళల ప్రాతినిధ్యం పార్లమెంట్ దిగువసభ అయిన లోక్‌సభలో నానాటికీ పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో 4–5 శాతం ఉన్న మహిళల ప్రాతినిధ్యం ఇప్పుడు లోక్‌సభలో ఏకంగా 14 శాతం దాటింది. క్షేత్రస్థాయిలోనే కాదు జాతీయస్థాయిలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో నారీమణులు పురుషులను ఢీ కొడుతూ, రాజకీయ దిగ్గజాలను ప్రజాక్షేత్రంలో మట్టికరిపిస్తూ ప్రజల మన్ననలు పొంది దేశంలోనే అత్యున్నత చట్టసభలో అడుగుపెడుతున్నారు.



మాటలే కాదు... చేతల మాస్కరీన్

యానీమాస్కరీన్...వాక్ స్వాతంత్ర్యం, విద్యావికాసం, తిరుగుబాటు, మహిళా సాధికారతకు ప్రతీక ఈ పేరు. ప్రస్తుత కేరళ రాష్ట్రం, అప్పటి ట్రావెన్‌కోర్ సంస్థానంలో జన్మించిన ఈమె రాజకీయాల్లో మహిళాప్రాతినిధ్యానికి 20వ శతాబ్దం తొలినాళ్లలోనే బీజం వేసిన యోధురాలు. 1902 జూన్ 6న లాటిన్ కాథలిక్ కుటుంబంలో జన్మించారు. ప్రభుత్వఉద్యోగి అయిన తండ్రి గాబ్రియెల్ పెంపకంలో తిరువనంతపురంలోని మహారాజాస్ కళాశాల నుంచి డబుల్ పీజీ (ఎకనామిక్స్, హిస్టరీ) చేశారు. ఆ తర్వాత న్యాయశాస్త్రం కూడా అభ్యసించారు. ఆ తర్వాత 1938లో ట్రావెన్‌కోర్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరిన మాస్కరీన్ సంస్థానాధీశులు, దివాన్‌లకు వ్యతిరేకంగా గళమెత్తారు. దివాన్‌గా పనిచేసిన రామస్వామి అయ్యర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ జరిపిన పోరాటంలో ఆమె క్రియాశీలపాత్ర పోషించారు. ఇందుకు ప్రతిఫలంగా ఆమె పోలీసు దెబ్బలు తిన్నారు. ఆమె ఇంటిని కూలగొట్టి, ఇంట్లోని వస్తువులను దొంగిలించారు. ఆ తర్వాత 1939లో ఆమె ట్రావెన్‌కోర్ సంస్థానంలో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు ప్రాతినిధ్యం వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న మాస్కరీన్‌కు 1946, ఫిబ్రవరి 21న మహాత్మాగాంధీ రాసిన లేఖ అప్పట్లో సంచలనమైంది. బాంబేలో ఆమె ఇచ్చిన ఉపన్యాసానికి స్పందిస్తూ 'మీ నాలుక అదుపులో లేదు. బుద్ధికి ఏది తోస్తే అది మాట్లాడుతున్నారు.' అని రాస్తూనే ట్రావెన్‌కోర్ ప్రభుత్వం నుంచి ఆమెను తొలగించాలని గాంధీజీ ఆ లేఖలో కోరడం గమనార్హం. ఇక, ఆ తర్వాత 1946లో ఏర్పాటైన 299మంది సభ్యులతో కూడిన కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ ఆఫ్ ఇండియాలో నియమితులయ్యారు. 1951లో మొదటి లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాతి ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు.





ఆ ఆరుగురి అదృష్టం ఏంటో?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనన తర్వాత ఇప్పటి వరకు రెండుసార్లు ఎంపీ ఎన్నికలు జరగ్గా 2014 ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత(టీఆర్‌ఎస్) నిజామాబాద్ నుంచి, 2019 ఎన్నికల్లో మాలోతు కవిత(టీఆర్‌ఎస్) మహబూబాబాద్ నుంచి గెలుపొందారు. ఇక, 2024 ఎన్నికల్లో ఏకంగా ఆరుగురు మహిళలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత మళ్లీ మహబూబాబాద్ నుంచి పోటీలో ఉండగా, బీజేపీ సీనియర్ నాయకురాలు డీకే.అరుణ మహబూబ్‌నగర్ నుంచి బరిలో నిలిచారు. హాస్పిటల్ రంగానికి చెందిన కొంపెల్లి మాధవీలత (బీజేపీ) హైదరాబాద్ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈసారి ముగ్గురు మహిళలకు అవకాశం కల్పించింది. ఆదిలాబాద్ నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, వరంగల్ నుంచి డాక్టర్ కడియం కావ్య, మల్కాజ్‌గిరి నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డిలను రంగంలోకి దింపింది.

బీఆర్‌ఎస్ ఒక్క ఎంపీ సీటూ గెలవదు

30 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వస్తామంటున్నా.. మేమే వద్దంటున్నాం : కోమటిరెడ్డి



నల్లగొండ: కేసీఆర్ బస్సు యాత్ర చేసినా.. మోకాళ్ల యాత్ర చేసినా బీఆర్‌ఎస్ ఒక్క ఎంపీ సీటు కూడా గెలవదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ శకం ముగిసిందని, కేసీఆర్‌ను ఎవరూ నమ్మట్లేదని చెప్పారు. మంగళవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టును పూర్తి చేయకుండా సాగర్‌ను ఎండబెట్టిన కేసీఆర్.. ఏ ముఖం పెట్టుకొని మిర్యాలగూడ నుంచి బస్సు యాత్ర చేపట్టేందుకు వస్తున్నారని ప్రశ్నించారు. మెదక్‌లో కూడా బీఆర్‌ఎస్ మూడో స్థానంలోకి పడిపోతుందని జోస్యం చెప్పారు. 30 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తామంటున్నా తాము వద్దంటున్నామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ బస్సు యాత్ర మానుకొని ఢిల్లీలో కవితకు బెయిల్ కోసం ప్రయత్నించాలని హితవు పలికారు. రేపోమాపో తండ్రీకొడుకులు జైలుకుపోక తప్పదని హెచ్చరించారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండలో ఓపెన్ టాప్ వాహనంలో ప్రచారం చేస్తున్నారని, అదే తరహాలో తాను కూడా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నానని పేర్కొన్నారు. నీటిని అమ్ముకున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి రూ. 5 వేల కోట్లు ఎక్కడ్నుంచి వచ్చాయని, 80 ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా నిర్మించుకున్నారని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

మోదీ విజయంతోనే దేశ భవిష్యత్తు

విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్



సాక్షి, యాదాద్రి: మోదీ విజయంతో దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. మోదీ హయాంలో దేశం అభివృద్ధి దిశగా పయనిస్తోందని చెప్పారు. మంగళవారం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ విజయ సంకల్ప నామినేషన్ ర్యాలీలో, అనంతరం వినాయక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన రోడ్ షోలో జైశంకర్ ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ఈ ఎన్నికల్లో మోదీ మరోసారి అధికారంలోకి రాబోతున్నారన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ, మోదీ ప్రపంచం మెచ్చిన నాయకుడని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు మోదీ మద్దతు ఇస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్ కొమ్ముకాస్తోందని ఆరోపించారు. అనంతరం బూరనర్సయ్యగౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత ప్రభుత్వం: జగదీశ్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో 13 హామీలు ఉన్నాయని, వాటిలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ మోసపూరిత ప్రభుత్వమని తెలిసిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీగా కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జగదీ శ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎదు రు చూస్తున్నారని తెలిపారు. రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ నా య కులకు పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 'రై తులందరికీ రైతుబంధు ఇస్తే మా అభ్యర్థి నామినే షన్ ఉపసంహరించుకుంటాం. రైతుబంధు రైతులందరికీ ఇవ్వకపోతే మీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరింపజేసే దమ్ము మీకుందా' అని కాంగ్రెస్ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. నల్ల గొండ జిల్లాను ఫ్లోరోసిస్ బారి నుంచి కాపాడింది కేసీఆర్ అని, సాగర్‌లో ఇంతకన్నా తక్కువ నీరున్నా.. సాగునీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అని అన్నారు.



నాణేలతో నామినేషన్

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ లోక్‌సభ స్థానానికి సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పేరాల మానసరెడ్డి మంగళవారం వినూత్నంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ రుసుముగా రూ.25 వేలు చెల్లించాల్సి ఉండగా.. రూ.10 నాణేలను భారీ మొత్తంలో అందజేశారు. వాటిని లెక్కించేందుకు సిబ్బంది నానాతంటాలు పడ్డారు. నిరుద్యోగ యువత, రైతులు, నిరుపేద కుటుంబాలు ఇచ్చిన చేయూతతో నామినేషన్ రుసుము చెల్లించానని, తన అభ్యర్థిత్వానికి సకలవర్గాలు బాసటగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.



రాజారంలో తీర్మాన పత్రాన్ని చూపిస్తున్న గ్రామస్తులు

సమస్యల్ని పరిష్కరించేంత వరకూ

ఓట్ల కోసం రావొద్దు

ఎన్నికలు బహిష్కరిస్తూ రాజారం గ్రామస్తుల తీర్మానం

కోటపల్లి(మంచిర్యాల జిల్లా): పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తూ మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాజారం గ్రామ పంచాయతీ ప్రజలు తీర్మానం చేశారు. మంగళవారం గ్రామంలో సమావేశమైన ప్రజలు గ్రామంలో రోడ్లు, ప్రధాన రహదారుల సమస్యలపై చర్చించారు. వీటిని పరిష్కరించిన తర్వాతే ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి రావాలని స్పష్టం చేశారు. రాజారం గ్రామం కోటపల్లి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందని, కనీసం మండల కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రం చెన్నూర్‌కు రోడ్డు సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాగులపై వంతెనలు లేక బయటి ప్రపంచానికి దూరం కావాల్సి వస్తోందని వాపోయారు. విద్యార్థులు కాలినడకన పాఠశాలలకు, కాలేజీలకు వెళ్తున్నారని తెలిపారు. తమ సమస్యల్ని పరిష్కరించకపోతే ఈసారి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోబోమని, ఎన్నికలకు దూరంగా ఉంటామని తీర్మానం చేశారు. గ్రామంలో 800మంది ఓటర్లు ఉండగా ఎక్కువశాతం గిరిజన జనాభా ఉన్నారు.

ఖమ్మం బరిలో పొంగులేటి వియ్యంకుడు

రఘురాంరెడ్డి తరపున రెండు సెట్ల నామినేషన్లు దాఖలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి తరపున ఖమ్మం లోక్‌సభ స్థానానికి మంగళవారం రెండుసెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఖమ్మం ఎంపీ అభ్యర్థిని ఏఐసీసీ ఇప్పటివరకు ప్రకటించలేదు. అయితే పొంగులేటి అనుచరులు రెండు సెట్ల నామినేషన్లను ఆర్‌ఓ వీ.పీ.గౌతమ్‌కు అందజేశారు. ఖమ్మం టికెట్ విషయంలో ఇప్పటికే అధిష్టానం హైదరాబాద్‌తోపాటు ఢిల్లీలో చర్చలు జరపగా, సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే బెంగళూరులో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటితో సమావేశమైనా అభ్యర్థి ఎవరన్నది ఓ కొలిక్కి రాలేదు. నామినేషన్ల గడువు ఈనెల 25తో ముగియనుండడంతో మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురాంరెడ్డి తరపున రెండు సెట్ల నామినేషన్లు వేశారు. అయితే అధిష్టానం పార్టీ అభ్యర్థిగా రఘురాంరెడ్డినే ప్రకటిస్తుందని, అధికారికంగా 25న జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతో కలిసి ఆయన ఇంకో సెట్ నామినేషన్ దాఖలు చేస్తారని పొంగులేటి అనుచరుల్లో ప్రచారం జరుగుతోంది.

191 నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్ : ఎంపీ నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. మంగళవారం 191 నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీఆర్‌ఎస్ తరపున మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవిత, ఎంఐఎం నుంచి హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ పార్టీ అధికారికంగా అభ్యర్థుల పేర్లు ప్రకటించకపోయినా ఖమ్మం నుంచి రామసహాయం రఘురామిరెడ్డి, హైదరాబాద్ నుంచి మహమ్మద్ వలీ ముల్లా నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల దాఖలుకు మరో రెండురోజులే మిగిలి ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారికంగా కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

మరోసారి ఎన్నికల బరిలో బర్రెలక్క



నాగర్‌కర్నూల్: శిరీష (బర్రెలక్క) మరోసారి ఎన్నికల బరిలోకి దిగనున్నారు. మంగళవారం ఆమె నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత గ్రామాల్లో పర్యటించిన తనకు కొన్ని సమస్యలు కనిపించాయని, ఎంపీ ఎన్నికల్లో తాను గెలిస్తేనే ఆ సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు చాలా దుర్భరంగా ఉన్నాయని అన్నారు. నిరుద్యోగుల ప్రతినిధిగా ఈ ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని చెప్పారు.

రూ.155 కోట్ల మద్యం, నగదు, నగలు పట్టివేత

ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున నగదు, మద్యం, బంగారు ఆభరణాలు, చీరలు పట్టుబడుతున్నాయి. ఈమేరకు ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం రూ.155.85 కోట్ల విలువైన లాప్‌ట్యాప్‌లు, కుక్కర్లు, చీరలు, బంగారు, వెండి ఆభరణాలు, మద్యం, నార్కోటిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గతనెల 15 నుంచి ఈనెల 21వ తేదీ వరకు రూ.61.11 కోట్ల నగదు, రూ.24.10 కోట్ల విలువైన మద్యం, వాణిజ్య పన్నుల శాఖ రూ.28.92 కోట్లు, డ్రగ్స్, నార్కోటిక్స్ సీజ్ చేసిన వాటి విలువ రూ.23.87 కోట్లు, విలువైన ధాతువులు బంగారం, వెండి, ఆభరణాలు విలువ రూ.19.16 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

ఒట్టేసి చెబుతున్నా..!

రేవంత్ 'ఒట్లపై' రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

- బాసర సరస్వతి, ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చి, యాదాద్రి, భద్రాద్రి రామయ్య, సేవాలాల్ సాక్షిగా ఒట్లు
- ఆగస్టు 15 కల్లా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం
- హామీల అమల్లో విఫలం కావడం వల్లే దేవుళ్ల పేరిట ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారంటున్న విపక్షాలు
- విపక్షాల ప్రచారానికి కౌంటర్‌గా తప్పనిసరి పరిస్థితుల్లో రేవంత్ ఒట్లు పెడుతున్నారంటున్న కాంగ్రెస్ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: 'బాసర సరస్వతి అమ్మవారి మీద ఒట్టేసి చెపుతున్నా.. మా ప్రభుత్వం పంద్రాగస్టు లోపల రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుంది. అది మా మంత్రివర్గం బాధ్యత. రుణమాఫీ చేసి మీ రుణం తీర్చుకుంటాం..'. నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఒక్క నిజామాబాద్‌లోనే కాదు..ఆదిలాబాద్ అయినా మహబూబాబాద్ అయినా, మహబూబ్‌నగర్ అయినా, మెదక్ అయినా, భువనగిరి అయినా.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎక్కడకు వెళ్లినా రేవంత్ ఒట్లు మీద ఒట్లు పెడుతున్నారు. ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చి, యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి, భద్రాద్రి రామయ్యతో పాటు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ సాక్షిగా అంటూ.. పంద్రాగస్టు లోపు రైతు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేస్తున్నారు. దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని నిత్యం విరుచుకుపడే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ముఖ్యమంత్రి.. ఏ దేవుడి దగ్గరకు వెళితే ఆ దేవుడు సాక్షి అంటూ ఒట్టేస్తుండటం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

ఒట్టు మాటలు గట్టివేనా?

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న ఈ 'ఒట్టు'మాటలు ఎంత గట్టివనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ రాజకీయ ప్రత్యర్థులపై దూకుడుగా ప్రచారం నిర్వహిస్తున్న రేవంత్ దేవుళ్ల సాక్షిగా ఎందుకు మాట ఇస్తున్నారనేది హాట్‌టాపిక్‌గా మారింది. రైతు రుణమాఫీ కేంద్రంగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు అటు ప్రతిపక్షాలతో పాటు ఇటు అధికార పక్షంలోనూ చర్చోపచర్చలకు దారితీస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో విఫలమైనందున రేవంత్‌రెడ్డి మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మడం లేదని, అందుకే ఈ తరహాలో హామీ ఇవ్వడం ద్వారా వారిని నమ్మించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లోనే రేవంత్ 'ఒట్టు'మాటలు మాట్లాడాల్సి వస్తోందని అంటోంది. రైతు బంధు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని, కరువు వచ్చి పడిందని, కరువును కూడా ప్రభుత్వం ఎదుర్కోలేకపోతోందని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు ఇదే మార్గమని చెబుతోంది. తాము అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి కాగానే..ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఈలోపే తామేమీ చేయడం లేదన్నట్టు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే రేవంత్ ఘాటుగా స్పందిస్తున్నారని ఆ పార్టీ నేతలు చెపుతున్నారు. ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్ ఇవ్వడంతో పాటు ప్రజలు ఆయన మాటలు విశ్వసించేలా చేసేందుకే ఆయన ఈ ఎత్తుగడ అమలు పరుస్తున్నారని అంటున్నారు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో బీజేపీ దూకుడుకు కళ్లెం వేసేందుకు, మహిళలు, రైతులు, మైనార్టీల ఓట్లు రాబట్టుకునే వ్యూహంతోనే రేవంత్ ఈ తరహాలో ఎన్నికల ప్రచార ప్రసంగాలు చేస్తున్నారని రాజకీయ వర్గాలంటున్నాయి.

కోమటిరెడ్డికి కితాబుపైనా చర్చ

భువనగిరి ప్రచార సభలో మాట్లాడుతూ సీఎం అయ్యేందుకు మంత్రి కోమటిరెడ్డికి అన్ని అర్హతలున్నాయని రేవంత్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత చర్చకు దారితీస్తున్నాయి. భువనగిరి అభ్యర్థి, తన సన్నిహితుడు చామల కిరణ్‌రెడ్డిని గెలిపించుకోవడంలో భాగంగా అక్కడ మంచి పట్టున్న కోమటిరెడ్డి బ్రదర్స్‌ను మచ్చిక చేసుకునేందుకే రేవంత్ అలా మాట్లాడారని కొందరంటుంటే... మరికొందరు మాత్రం రేవంత్ స్టైల్ ఆట నల్లగొండలో ఆడారని, ఆ జిల్లాకు చెందిన నేతలను డిఫెన్స్‌లో పడేసేలా ఆయన మాట్లాడారని కొందరంటున్నారు. మరోవైపు బీజేపీ చేస్తున్న హిందుత్వ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కూడా దేవుడు, మతాన్ని ప్రస్తావిస్తూ రేవంత్ వ్యాఖ్యలు చేస్తున్నారు. 'దేవుడు గుడిలో ఉండాలి..భక్తి గుండెల్లో ఉండాలి.. పోలింగ్ బూత్‌లలో కాదు.. నేను హిందువునని గర్వపడతా.. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులను ఆదరిస్తా.. గౌరవిస్తా..'అంటూ చెప్పడం, హామీల అమలుకు దేవుళ్ల మీద ఒట్లు పెట్టడం.. ఎలాంటి ఫలితాలనిస్తుందోనన్న చర్చ జరుగుతోంది.

వేడి రాజేసేలా రాజకీయ వ్యాఖ్యలు

ఒట్ల మాటలు అలా ఉంటే... ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్ పదేపదే మరో విషయాన్ని నొక్కి చెబుతున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి తన ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చేస్తున్నాయంటూ ఆయన ఆరోపిస్తున్నారు. ఇవి కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుకే ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఆయన, సమయం వచ్చినప్పుడల్లా ఈ అంశాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఇక తనతో 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లోకి వచ్చారంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యల తర్వాత ఈ అంశంపై దాడిని ఆయన మరింత తీవ్రతరం చేశారు. టచ్ చేసి చూడండి... మసై పోతారంటూ సినిమా డైలాగులు విసురుతున్నారు. 'ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కాపలా ఉంది రేవంత్‌రెడ్డి. నేను జైపాల్‌రెడ్డి, జానారెడ్డి కాదు. రేవంత్‌రెడ్డిని..'లాంటి పదునైన వ్యాఖ్యలతో సవాళ్లు విసురుతున్నారు. అయితే అలాంటి వ్యాఖ్యల ద్వారా కేడర్‌లో ధైర్యాన్ని నింపడమే కాకుండా రాజకీయ వేడి పుట్టించడం ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ సానుకూలతను పెంచేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని రాజకీయ వర్గాలంటున్నాయి.

ఆ ఐదు చోట్ల అమీతుమీ

రెండో విడతలో అందరి దృష్టీ వీటిపైనే

- ఛత్తీస్‌గఢ్‌లో బఘెల్‌కు కఠిన పరీక్ష
- రాజ్‌నంద్‌గావ్‌లో చెమటోడుస్తున్న మాజీ సీఎం
- నాందేడ్‌లో బీజేపీ గెలుపు బాధ్యత చవాన్‌పై
- అమరావతిలో నటి నవనీత్ కౌర్ ఎదురీత
- పూర్ణియాలో ప్రధాన పార్టీలకు పప్పూ సవాల్
- బాలూర్‌ఘాట్‌లో సుకాంత వర్సెస్ మమత

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రెండో విడతలో శుక్రవారం దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల పరిధిలోని 89 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. వాటిలో బీహార్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఐదు లోక్‌సభ స్థానాలు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. పలు సమీకరణాల నేపథ్యంలో అక్కడ హోరాహోరీ పోరు నెలకొనడమే ఇందుకు కారణం. ఆ స్థానాల్లో గెలుపును అధికార ఎన్డీఏ, విపక్ష ఇండియా కూటములు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై ఫోకస్...


- సాక్షి, నేషనల్ డెస్క్

పూర్ణియా (బిహార్)


• పప్పూయాదవ్

ఇక్కడ ఎన్డీఏ కూటమి నుంచి సిట్టింగ్ ఎంపీ, జేడీ(యూ) నేత సంతోష్ కుమార్ కుశ్వాహా ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. విపక్ష ఇండియా కూటమి తరఫున ఆర్జేడీ నాయకురాలు బీమా భారతీ పోటీలో ఉన్నారు. ఆమె నెల క్రితమే జేడీ(యూ) నుంచి ఆర్జేడీలో చేరారు. కానీ బాహుబలి రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూయాదవ్ రంగప్రవేశంతో పోటీ ఒక్కసారిగా ఆసక్తికరంగా మారిపోయింది. ఆయనపై లెక్కలేనన్ని హత్య, హత్యాయత్నం తదితర కేసులున్నాయి. ఐదుసార్లు లోక్‌సభ ఎంపీగా నెగ్గారు. పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. 2015లో ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురయ్యాక జన్ అధికార్ పార్టీ పేరుతో సొంత కుంపటి పెట్టుకున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై ఆశతో దాన్ని ఇటీవలే ఆ పార్టీలో విలీనం చేశారు. కానీ కూటమి సర్దుబాటులో ఆ సీటు ఆర్జేడీకి వెళ్లడంతో ఆగ్రహించి స్వతంత్రునిగా రంగంలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు పెనుసవాలు విసురుతున్నారు. గతంలో కూడా ఆయన స్వతంత్రునిగా నెగ్గడం విశేషం. సంతోష్‌కుమార్‌పై ఓటర్లలో అసంతృప్తి, వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. పైగా జేడీ(యూ) మాజీ నేత అయిన బీమా భారతీ కూడా ఆ పార్టీ ఓట్లను బాగానే చీల్చేలా కన్పిస్తున్నారు. ప్రణామ్ పూర్ణియా పేరిట పప్పూయాదవ్ చేస్తున్న ప్రచారానికి భారీ స్పందన లభిస్తుండటం విశేషం!

రాజ్‌నంద్‌గావ్ (ఛత్తీస్‌గఢ్)


• భూపేశ్ బఘెల్

ఈ స్థానం బీజేపీకి కంచుకోట. ఈసారి దాన్ని ఎలాగైనా బద్దలు కొట్టాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. అందులో భాగంగా తాజా మాజీ సీఎం భూపేశ్ బఘెల్‌ను బరిలో దింపింది. అయితే, కాకాగా ప్రసిద్ధుడైన ఆయన బహుముఖ సవాళ్లను ఎదుర్కొంటున్నారు. నిజానికి సీఎంగా ఈ ప్రాంతాన్ని బఘెల్ ఎంతగానో అభివృద్ధి చేశారు. పైగా ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 8 అసెంబ్లీ సీట్లలో ఏకంగా ఐదు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. అయినా ఈసారి కూడా ఇక్కడ బీజేపీదే విజయమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఆ పార్టీ తరఫున బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ సంతోష్ పాండే ఈసారి కూడా విజయంపై ధీమాగా ఉన్నారు. 2000లో రాష్ట్రం ఏర్పడ్డ నాటినుంచి ఒక్కసారి మినహా ఇక్కడ కాషాయ జెండాయే ఎగిరింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి నేపథ్యంలో ఇక్కడ గెలుపు బఘెల్‌కు తప్పనిసరిగా మారింది. దాంతో ఈ పోరును ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుడిగాలి పర్యటనలతో నియోజకవర్గమంతా చుట్టేస్తున్నారు. నిత్యం ఓటర్లను కలుస్తూ ఓట్లడుగుతున్నారు. కాకపోతే మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం ఆరోపణలు ఆయన అవకాశాలకు మరింతగా గండికొట్టేలా కన్పిస్తున్నాయి. ఇక్కడి ఓటర్లలో ఆదివాసీలు ఏకంగా 35 శాతం, ఓబీసీలు 30 శాతమున్నారు.

అమరావతి (మహారాష్ట్ర)


• నవనీత్ కౌర్ రాణా

రాష్ట్రంలో అత్యంత హోరాహోరీ పోరు నెలకొన్న స్థానాల్లో ఇదొకటి. సిట్టింగ్ ఎంపీ, సినీ నటి నవనీత్ కౌర్ రాణా ఈసారి బీజేపీ టికెట్‌పై బరిలో ఉన్నారు. ఆమె 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీపీ దన్నుతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కేంద్ర మాజీ మంత్రి ఆనంద్‌రావ్ అడ్సుల్‌పై నెగ్గి తొలిసారి లోక్‌సభలో ప్రవేశించారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి మాత్రం ఎదురీదుతున్నారు. ఎందుకంటే ఆమెకు టికెటివ్వడంపై స్థానిక బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఇది చాలదన్నట్టు ఎన్డీఏ స్థానిక భాగస్వామి ప్రహార్ పార్టీ రాణా అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ పార్టీ తరఫున దినేశ్ బూబ్‌ను పోటీకి నిలిపింది! దీనికి తోడు మహావికాస్ అఘాడీ కూటమి తరఫున బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బల్వంత్ వాంఖడేకు నియోజకవర్గమంతటా మంచి పేరుంది. పైగా ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సీట్లలో మూడు కాంగ్రెస్ చేతిలోనే ఉన్నాయి. అయితే వంచిత్ బహుజన్ పార్టీ నుంచి బరిలో ఉన్న అంబేడ్కర్ మనవడు ఆనంద్‌రాజ్ అంబేడ్కర్ కాంగ్రెస్ ఓట్లను భారీగా చీలుస్తారని భావిస్తున్నారు. ఇది రాణాకు బాగా కలిసొచ్చే అంశం.

బాలూర్‌ఘాట్ (పశ్చిమబెంగాల్)


• సుకాంత మజుందార్

పశ్చిమబెంగాల్లో బీజేపీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ నడుమ హోరాహోరీ పోటీ నెలకొన్న లోక్‌సభ స్థానాల్లో బాలూర్‌ఘాట్ ముఖ్యమైనది. ఇక్కడి నుంచి బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపీ సుకాంత మజుందార్ పోటీ చేస్తున్నారు. 2019లో బీజేపీ తొలిసారిగా రాష్ట్రంలో భారీగా సీట్లను గెలుచుకోవడం తెలిసిందే. ఆ ఎన్నికల్లో తృణమూల్ అభ్యర్థి అర్పితా ఘోష్‌పై సుకాంత భారీ మెజారిటీతో నెగ్గారు. దాంతో ఈసారి బాలూర్‌ఘాట్‌ను తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుకాంతను ఎలాగైనా ఓడించి తీరాలని పట్టుదలగా ఉన్నారు. రాష్ట్ర మంత్రి విప్లవ్ మిత్రాను మమత బరిలో దించడంతో పోరు మరింత ఆసక్తికరంగా మారింది. అయినా సుకాంత మాత్రం బాలూర్‌ఘాట్‌తో పాటు బెంగాల్ మొత్తాన్నీ మోదీ వేవ్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందంటున్నారు. ఈసారి కూడా తనకు భారీ మెజారిటీ ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తృణమూల్ నేతల అంతులేని అవినీతి, సందేశ్‌ఖాలీలో మహిళలపై వారి అకృత్యాలతో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని చెబుతున్నారు.

మీరట్ (ఉత్తరప్రదేశ్)


• అరుణ్ గోవిల్

'టీవీ రాముడు' అరుణ్ గోవిల్ పోటీతో ఈ లోక్‌సభ స్థానం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. దూరదర్శన్‌లో సీరియల్‌గా వచ్చిన రామాయణంలో రాముని పాత్ర పోషించిన ఆయన దేశవ్యాప్త క్రేజ్ సంపాదించారు. బీజేపీ ఆయనను అనూహ్యంగా పార్టీలో చేర్చుకోవడమే గాక మీరట్ టికెట్ కూడా ఇచ్చింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో 80 స్థానాలకు గాను బీజేపీ 62 చోట్ల నెగ్గడం తెలిసిందే. ఈసారి దేశవ్యాప్తంగా సొంతంగా 370 లోక్‌సభ స్థానాల లక్ష్యాన్ని సాధించాలంటే యూపీలో క్లీన్‌స్వీప్ చేయడం తప్పనిసరని పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో మీరట్ పరిసరాల్లోని పలు లోక్‌సభ స్థానాల్లో గోవిల్ ప్రభావం చూపుతారన్న అంచనాతో ఆయన్ను బరిలోకి దింపింది. సమాజ్‌వాదీ నుంచి సునీతా వర్మ, బీఎస్పీ నుంచి దేవవ్రత్ కుమార్ త్యాగీ ఆయనకు ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు.

నాందేడ్ (మహారాష్ట్ర)


• అశోక్ చవాన్

ఈ లోక్‌సభ స్థానం కొన్నాళ్ల క్రితం దాకా కాంగ్రెస్‌కు పెట్టని కోట. కానీ ఆ పార్టీ అగ్ర నేత, మాజీ సీఎం అశోక్ చవాన్ ఇటీవల బీజేపీలో చేరడంతో ఇక్కడ సమీకరణాలు పూర్తిగా మారాయి. దానికి తోడు గత ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ పాగా వేసింది. అయితే సిట్టింగ్ బీజేపీ ఎంపీ ప్రతాప్‌రావ్ గోవిందరావ్ పాటిల్ చికలీకర్‌కు ఇండియా కూటమి తరఫున వసంత్ చవాన్ ఈసారి గట్టి పోటీ ఇస్తున్నారు. దీనికి తోడు ప్రకాశ్ అంబేడ్కర్ పార్టీ వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) కూడా బరిలో ఉండటంతో ముక్కోణపు పోరు నెలకొంది. ఈ సెగ్మెంట్లో సంఖ్యాధికులైన ఓబీసీలు బీజేపీకి గట్టి ఓటు బ్యాంకు. కానీ అదే సామాజిక వర్గానికి చెందిన వీబీఏ అభ్యర్థి అవినాశ్ భోసికర్ బీజేపీ ఓట్లను చీలుస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో చికలీకర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యతను పార్టీ నాయకత్వం అశోక్ చవాన్‌పై ఉంచింది. దాంతో ఆయన సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. వీబీఏ అభ్యర్థి బీజేపీ వ్యతిరేక ఓట్లనే చీల్చి చికలీకర్ విజయాన్ని సునాయాసం చేస్తారని చవాన్ చెబుతున్నారు.

బ్రిజ్‌భూషణ్‌కు టికెట్‌పై... డోలాయమానం!

- కైసర్‌గంజ్ సిట్టింగ్ ఎంపీపై ఎటూ తేల్చని బీజేపీ
- వేధింపుల కేసులో తీర్పు కోసం ఎదురుచూపులు
- అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టిన ఎస్పీ, బీఎస్పీ



సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానం నుంచి వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్ పోటీపై అయోమయం నెలకొంది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనకు టికెటివ్వడంపై బీజేపీ పునరాలోచనలో పడ్డట్టు చెబుతున్నారు. ఈ కేసుపై ఢిల్లీ కోర్టు వెలువరించే తీర్పు ఆధారంగా తుది నిర్ణయానికి వచ్చే అవకాశం కన్పిస్తోంది. కేసును కొట్టేయాలన్న పోలీసుల పిటిషన్‌పై మే 20న తుది తీర్పు వెలువరించనున్నట్టు కోర్టు మంగళవారం పేర్కొంది. అయితే ఐదో విడతలో కైసర్‌గంజ్‌లో పోలింగ్ కూడా అదే రోజున ఉండటం విశేషం! బీజేపీ ఎటూ తేల్చకపోవడంతో ప్రత్యర్థులైన సమాజ్‌వాదీ, బీఎస్పీ కూడా తమ అభ్యర్థులను ఇంకా ఖరారు చేయలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో బ్రిజ్‌భూషణ్ భార్య, మాజీ ఎంపీ కేతకీసింగ్‌కు బీజేపీ టికెటిచ్చే అవకాశముందని అంటున్నారు. వారి కుటుంబానికి బీజేపీ అవకాశమే ఇవ్వని పక్షంలో భార్యాభర్తల్లో ఎవరో ఒకరికి టికెటివ్వాలని సమాజ్‌వాదీ యోచిస్తున్నట్టు కూడా చెబుతున్నారు.

క్షత్రియ సామాజికవర్గానికి చెందిన బ్రిజ్‌భూషణ్ మూడు దశాబ్దాలుగా స్థానికంగా చక్రం తిప్పుతున్నారు. 1991లో గోండా నుంచి తొలిసారి ఎంపీగా గెలిచారు. 2009 నుంచి కైసర్‌గంజ్ ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. ఐదుసార్లు బీజేపీ టికెట్‌పై గెలిచారు. 2011 నుంచి 2023 దాకా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా కొనసాగారు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎట్టకేలకు పదవి నుంచి తప్పుకున్నారు.

13 ముచ్చట రిపీట్!

తొలిసారి 13 రోజుల ముచ్చటగా ముగిసిన వాజ్‌పేయి పాలన రెండో విడతలో 13 నెలలకే పరిమితమైంది! గతానుభవంతో 1998 లోక్‌సభ ఎన్నికల్లో వీలైనన్ని ప్రాంతీయ పార్టీల మద్దతు సాధించి ఎన్డీఏ సర్కారును ఏర్పాటు చేసినా జయలలిత రూపంలో ముప్పు ముంచేసింది. కాంగ్రెసైనా, బీజేపీ అయినా కేంద్రంలో పాగా వేయాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి సాగాల్సిన పరిస్థితులు మరింతగా బలపడ్డాయి. అలా 12వ లోక్‌సభా కాలం దేశ రాజకీయాల్లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



వాజ్‌పేయికి అచ్చిరాని 13

- కొంప ముంచిన జయలలిత, గమాంగ్
- 13 నెలలకే పడిపోయిన ఎన్డీఏ సర్కారు
- రెండేళ్లయినా కొనసాగని 12వ లోక్‌సభ

"మీకు అధికారం కావాలి. మేం మాత్రం దేశం కోసం పని చేయాలనుకుంటున్నాం. ఆ ప్రయత్నం నెరవేరేదాకా విశ్రమించేదే లేదు'' అని 1996 మేలో బల నిరూపణకు ముందే ప్రధాని పదవికి రాజీనామా చేస్తూ విపక్షాలనుద్దేశించి వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యలు! అన్నట్టుగానే 1998లో కేంద్రంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారాయన. 1998 ఫిబ్రవరి 16, 22, 28 తేదీల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగ్గా మరోసారి హంగ్ ఏర్పడింది. బీజేపీ బలం ఇంకాస్త పెరిగి 182 స్థానాలకు చేరింది. కాంగ్రెస్‌కు 141 సీట్లు దక్కాయి. సీపీఎం 32, సమాజ్‌వాదీ 20, అన్నాడీఎంకే 18, ఆర్జేడీ 17, టీడీపీ, సమతా పార్టీ చెరో 12 స్థానాలు నెగ్గాయి.

ఏడాదితో సరి

1998లో బీజేపీ ముందుగానే ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంది. వాటితో కలిపి సీట్ల సంఖ్య 252కు చేరింది. టీడీపీ బయటి నుంచి మద్దతుతో వాజ్‌పేయి రెండోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. కానీ కొద్ది రోజులకే అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత బెదిరింపులకు దిగారు. తమిళనాట డీఎంకే సర్కారును రద్దు చేయాలని, అది తనపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఒత్తిళ్లు తేవడం మొదలుపెట్టారు. లేదంటే మద్దతు ఉపసంహరిస్తానని బెదిరించినా వాజ్‌పేయి తలొగ్గలేదు. జయ అన్నంత పనీ చేయడంతో లోక్‌సభలో బలపరీక్ష తప్పలేదు. 270 ఓట్లొస్తే సర్కారు గట్టెక్కేది. కానీ 269 దగ్గరే ఆగిపోయింది. ఒకే ఒక్క ఓటు తేడాతో 13 నెలలకే ప్రభుత్వం పడిపోయింది.

బీఎస్పీ యూటర్న్

ఐదుగురు ఎంపీలున్న బీఎస్పీ వాజ్‌పేయి సర్కారుకు మద్దతిస్తానని హామీ ఇచ్చింది. తీరా ఓటింగ్ సమయానికి పార్టీ అగ్రనేత మాయావతి అడ్డం తిరిగారు. తాము సర్కారుకు వ్యతిరేకమని ప్రకటించి వాజ్‌పేయి ఆశలపై నీళ్లుచల్లారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్‌ను రాష్ట్రపతి ఆహ్వానించారు. కానీ మద్దతు కూడగట్టలేక పార్టీ ముందుకు రాకపోవడంతో మళ్లీ ఎన్నికలు అనివార్యమయ్యాయి.

ఆ ఒక్క ఓటు...!



ఒకే ఒక్క ఓటుతో వాజ్‌పేయి సర్కారు కూలిపోవడానికి ప్రధాన కారకుడిగా ఒడిశాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గిరిధర్ గమాంగ్ శాశ్వత అప్రతిష్ట మూటగట్టుకున్నారు. కోరాపుట్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన వాజ్‌పేయి ప్రభుత్వ బలపరీక్షకు కాస్త ముందే ఒడిశా సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. దాంతో విశ్వాస పరీక్షలో ఓటేయడానికి గమాంగ్ అనర్హుడని ఎన్డీఏ వాదించింది. కానీ ఆయన ఇంకా లోక్‌సభకు రాజీనామా చేయకపోవడంతో ఓటేసేందుకు అర్హుడేనని స్పీకర్ తేల్చిచెప్పారు. చివరికి ఆయన వేసిన ఆ ఒక్క ఓటు తేడాతోనే సర్కారు పడిపోయింది! అన్నట్టూ, కాంగ్రెస్ తరఫున ఏకంగా తొమ్మిదిసార్లు ఎంపీగా నెగ్గిన గమాంగ్ 2015లో బీజేపీలో చేరడం విశేషం!

గతం

సోనియా ప్రభావం అంతంతే

రాజీవ్‌గాంధీ మరణించిన నాటి నుంచీ కాంగ్రెస్ నేతలు ఎంతగా ఒత్తిడి చేస్తున్నా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న సోనియాగాంధీ 1998 ఎన్నికల ముంగిట అరంగేట్రం చేశారు. అయితే ఎన్నికల్లో ఆమె దేశవ్యాప్త ప్రచారం అంతంతగానే లాభించింది.

అణుపరీక్ష కార్గిల్ యుద్ధం

- దేశ భద్రతకు వాజ్‌పేయి సర్కారు ప్రథమ ప్రాధాన్యమిచ్చింది. ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నా, పాశ్చాత్య దేశాల ఆంక్షలున్నా వెరవకుండా అణ్వస్త్ర పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. 1998 మే 11–13 మధ్య పోఖ్రాన్‌లో వరుసగా ఐదు అణుబాంబులను పరీక్షించింది.
- వాజ్‌పేయి ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్న వేళ కశ్మీర్ దురాక్రమణకు తెగబడింది పాకిస్తాన్. ఉగ్రవాదుల ముసుగులో పాక్ దళాలు నియంత్రణ రేఖ దాటుకుని కార్గిల్ ప్రాంతాన్ని ఆక్రమించాయి. 1999 మే 3 నుంచి జూలై 26 దాకా రెండు నెలలకు పైగా సాగిన యుద్ధంలో పాక్ సైన్యాన్ని భారత దళాలు తరిమికొట్టాయి.

12వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
బీజేపీ	182
కాంగ్రెస్	141
సీపీఎం	32
సమాజ్‌వాదీ	20
అన్నాడీఎంకే	18
ఆర్జేడీ	17
టీడీపీ	12
సమతా పార్టీ	12
ఇతరులు	103
స్వతంత్రులు	6

ఇప్పుడు మధుర గోపిక

హేమమాలిని. డ్రీమ్‌గాళ్‌గా హృదయాలను కొల్లగొట్టిన తమిళ పొన్ను. 75 ఏళ్ల వయసులోనూ క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. యూపీలోని మధుర నుంచి ముచ్చటగా మూడోసారి నెగ్గి హ్యాట్రిక్ కొట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. 'ఇదే నా చివరి పోటీ. గత హామీలన్నీ నెరవేర్చి రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని ప్రకటించారు...

- సాక్షి, నేషనల్ డెస్క్



పరిచయం

రాజకీయ ప్రస్థానం..

బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా వెలుగొందిన హేమమాలిని 2003లో రాజ్యసభకు నామినేటయ్యారు. 2010లో బీజేపీ ప్రధాన కార్యదర్శి అయ్యాక 2011లో మరోసారి రాజ్యసభకు నామినేటయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మధుర నుంచి బీజేపీ తరఫున ఆర్ఎల్డీ చీఫ్ జయంత్ చౌదరిపై పోటీ చేశారు. మధురలో జాట్ల ప్రాబల్యం ఎక్కువ. హేమ భర్త, బాలీవుడ్ హీమాన్ ధర్మేంద్రది అదే సామాజికవర్గం. 'జాట్ల కోడలు' అంటూ భార్య కోసం ఆయన ప్రచారం వారిని ఆకట్టుకుంది. అలా 2014లో నెగ్గిన ఆమె 2019 లోక్‌సభ ఎన్నికల్లో మరింత మెజారిటీతో విజయం సాధించారు.

బృందావనవాసిని...


మధురను మరింత అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమంటారు హేమ. తాను నాన్‌లోకల్ అన్న ఆరోపణలను దీటుగా తిప్పికొడుతూ వచ్చారు. ''నాకు ముంబైలో ఇల్లుంటే సమస్యేమిటి? మధురలోనూ నాకు సొంతిల్లుంది. నేను బృందావనవాసిని. మధురతో నాది దైవిక బంధం'' అంటారు. తొలిసారి లోక్‌సభకు నెగ్గాక రెండేళ్లపాటు ప్రజలతో కలవడానికి ఇబ్బంది పడ్డానని అంగీకరిస్తారు. అలాంటి హేమ 2019 ఎన్నికల నాటికి ఆరితేరిన నేతగా ఎదిగారు.

ఆత్మకథ రాస్తా...

హేమమాలినిది తమిళనాడు. వీఎస్ఆర్ చక్రవర్తి అయ్యంగార్, జయలక్ష్మి దంపతులకు 1948 అక్టోబర్ 16 జన్మించారు. 11వ తరగతి మధ్యలోనే ఆపేశారు. 16 ఏళ్లకే సినిమాల్లో అడుగుపెట్టారు. తెలుగు, తమిళ సినిమాల్లో నటించాక 1968లో రాజ్‌కపూర్ సరసన సప్నోం కా సౌదాగర్ చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తిరుగులేని తారగా వెలుగొందారు. ధర్మేంద్రతో 35 చిత్రాల్లో కలిసి నటించారు. అప్పటికే పెళ్లై పిల్లలున్న ధర్మేంద్రను ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలి చిత్రం 'దిల్ ఆష్నా హై'కి హేమ దర్శకత్వం వహించడం విశేషం! సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటారు. భరతనాట్యమంటే ఆమెకు ప్రాణం. ''ఎప్పటికైనా ఆత్మకథ రాస్తా. ప్రత్యేకించి నా డ్యాన్స్ అనుభవాలను పొందుపరుస్తా. అలాగే కుటుంబానికి సమయం కేటాయించుకోవాలి. నాకెంతో ఇష్టమైన డ్యాన్స్‌పై మరింత ఫోకస్ చేయాలి. అందుకే ఈసారి హామీలన్నీ నెరవేర్చి రాజకీయాలకు గుడ్‌బై చెప్తా'' అని ఇప్పటికే ప్రకటించారు.

గుసగుస

వై నాట్ కుప్పం



సీఎం జగన్ ఏ ముహూర్తాన 'వై నాట్ కుప్పం'అన్నారోగానీ.. అప్పటి నుంచి చంద్రబాబుకు వెన్నులో వణుకు మొదలైంది. ఇన్నేళ్ల రాజకీయంలో ఎన్నడూ లేనంతగా కుప్పం చుట్టూనే తిరుగుతున్నారు. భార్యను కూడా అక్కడే ప్రచారానికి పెట్టారు. గత 4 ఎన్నికల్లో ఆయనకు వచ్చిన మెజార్టీ క్రమేపీ తగ్గుతూ నగానికి పడిపోయింది. 2019 ఎన్నికల్లో అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఎన్ని అక్రమాలు చేసినా మెజార్టీలో కోత తప్ప లేదు. స్థానిక ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీ స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో కుప్పం నుంచి ఇదే తన చివరి పోటీ అని, ఈసారి గెలిపిస్తే వచ్చే ఎన్నికల్లో కుప్పం సీటు మీదే నంటూ.. ఒకరిద్దరు స్థానిక నేతలకు హామీ ఇచ్చారట. ఈసారి ఓడిపోతే పార్టీ ఉండదు.. బొ.. ఉండదు.. ఈపాటి దానికి కుప్పంలో మేం పొడిచేది ఏముంటుందంటూ.. హామీ పొందిన నేతల గుసగుసలు.

జవ'హర్ట్'



చేసే మూడ్ .. ఉత్సాహం సర్వనాశన మైపోతాయ్.. ఏమైనా అంటేనేమో.. హర్ట యిపోతారు.. తగలబెట్టండి సార్.. నిరంజన్‌గారూ.. అనే మీమ్ సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. ఇదే రీతిలో ప్రస్తుతం మాజీ మంత్రి, టీడీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ రెచ్చిపోతున్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన్ని బుజ్జగించేందుకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టి, జిల్లా అధ్యక్ష పదవిలో కాస్త కోత పెట్టారు. కొత్త జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే ఆరింటికే ఆయన అధ్యక్షుడట. తన నివాస ప్రాంతమైన కొవ్వూరు వ్యవహారాల్లో ఏమాత్రం కలుగజేసుకోరాదట. దీంతో పార్టీ అధిష్టానం పెత్తందార్లను ప్రోత్సహించి. దళితుడైన జవహర్‌ను అవమానిస్తోందంటూ ఆయన అనుచరులు వాపోతున్నారు.


అభివృద్ధి బటన్ నొక్కిన సీఎం జగన్

ఈ 5 ఏళ్లలో ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమల్లో రూ.78,514 కోట్ల పెట్టుబడులు

- బాబు హయాంలో రూ.59,970 కోట్లు మాత్రమే
- కరోనా నష్టాల్ని అధిగమించి మరీ రాష్ట్రంలో పరిశ్రమలకు సీఎం జగన్ పట్టం
- 386 ఒప్పందాలతో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులకు జగన్ ప్రభుత్వం ఒప్పందాలు
- ఏడాదిలోపే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపం
- గత ప్రభుత్వంలో రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులు అంటూ ఊదరగొట్టిన చంద్రబాబు
- 3 శాతం కూడా తీసుకురాలేక అభాసుపాలు
- మూడు పారిశ్రామిక కారిడార్లతో మారనున్న రాష్ట్ర రూపురేఖలు
- అంబానీ, అదానీ, బిర్లా, మిట్టల్, సంఘ్వీ వంటి పారిశ్రామిక దిగ్గజాలతో భారీ ఒప్పందాలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

ఆర్థికాభివృద్ధి అదుర్స్



చంద్రబాబు పాలనలో కంటే సీఎం జగన్ హయాంలోనే ఎక్కువ అభివృద్ధి

'సెల్ ఫోన్ నేనే కనిపెట్టా.. ఐటీని నేనే సృష్టించా.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌నూ నేనే కట్టా.. హైదరాబాద్‌లో రింగు రోడ్డునూ నేనే వేశా.. సింధూకు బాడ్మింటన్ ఆడమని నేనే చెప్పా.. అంతెందుకు నా గైడెన్స్ మేరకే సత్య నాదెళ్ల ఇవాళ అంతటివాడయ్యాడు.. తుపాన్లనే ఆపగలిగాను.. సంపద సృష్టికి నేనే బ్రాండ్ అంబాసిడర్..' ఇలా కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పేదెవరంటే, చంద్రబాబు అని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు.

అప్పుడు బాబు హయాంలో, ఇప్పుడు జగన్ హయాంలో దాదాపు ఒకే బడ్జెట్.. అప్పులు అప్పటి కంటే ఇప్పుడే తక్కువ.. అయినప్పటికీ సీఎం జగన్ ఈ ఐదేళ్లలో పేద ప్రజల ఖాతాల్లో వివిధ పథకాల రూపేణ ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. తద్వారా ఆర్థిక చక్రాన్ని పరుగులు పెట్టించారు. అభివృద్ధి విషయంలో కొత్త పుంతలు తొక్కించారు. ఈ ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి 6.20 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనం. అన్ని రంగాల్లోనూ స్పష్టమైన అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తోంది. ఇందుకు కేంద్ర గణాంకాలే సాక్ష్యం.

స్థిర ధరల ప్రకారం గత ఐదేళ్లలో జీఎస్‌డీపీ పెరుగుదల రూ.**1,94,063** కోట్లు

అదే బాబు పాలనలో రూ.**1,28,341** కోట్లే

కోవిడ్ సంక్షోభంలోనూ జగన్ హయాంలోనే భారీగా పెరిగిన సంపద

స్థిర ధరల ఆధారంగా 2023–24 రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి 7.35 శాతం

బాబు హయాంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.6.26 లక్షల కోట్లు

2023–24లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.8.20 లక్షల కోట్లు

కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ లెక్కలే ఇందుకు నిదర్శనం

బాబు ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి **5.15%**

ఈ ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి **6.20%**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓ వైపు సంక్షేమాభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ.. మరో వైపు పేదరికాన్ని తగ్గించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కంటే ముందంజలో ఉంది. రాష్ట్ర అభివృద్ధికి, సంపద సృష్టించారనడానికి కొలమానం ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలే. ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభాలను సైతం అధిగమించి సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో వరుసగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కోవిడ్ సంక్షోభం లేనప్పటికీ గత చంద్రబాబు ఐదేళ్ల చంద్రబాబు మరిచిపోతున్నారు. తనకొక్కడికే సంపద సృష్టించడం వచ్చనే ధోరణిలో చంద్రబాబు ఇస్తున్న బిల్డప్ అంతా తుస్ అని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ద్వారా వెల్లడైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి నమోదులో టాప్ పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉందని స్పష్టమైంది. ఈ గణాంకాలన్నీ 2011–12 సంవత్సరం స్థిర ధరల ఆధారంగా కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ గణాంకాలన్నీ పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉన్నాయి.

కోవిడ్‌లోనూ రయ్.. రయ్..

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.1,28,341 కోట్లు పెరిగింది. అంటే మొత్తం ఐదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 25.74 శాతం పెరిగింది. అంటే సగటు వార్షిక వృద్ధి 5.15 శాతంగా నమోదైంది. అదే సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.1,94,063 కోట్ల మేర పెరిగింది. అంటే ఐదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల 30.95 శాతం. వార్షిక సగటు వృద్ధి 6.20 శాతంగా ఉంది. దీన్ని బట్టి చూస్తే సంపద సృష్టించడంలో, రాష్ట్ర అభివృద్ధి విషయంలో గత చంద్రబాబు పాలన కన్నా సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో మెరుగ్గా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభంతో రాష్ట్ర సొంత ఆదాయంతో పాటు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా రూపంలో రాబడి తగ్గిపోయినప్పటికీ రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోకుండా కొనసాగించే చర్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్నారు. మరో పక్క కోవిడ్‌లోనూ పేద, మధ్య తరగతి ప్రజలకు నేరుగా నగదు బదిలీ పథకాలను అమలు చేశారు. ఈ చర్యలతో రాష్ట్ర ఆర్థిక చక్రం ఆగిపోకుండా నిలదొక్కుకుంది. అందువల్లే జగన్ పాలనలో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల ఎక్కువగా నమోదైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి 7.35 శాతం వృద్ధి నమోదైందని కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.


పాలనలో సగటు వార్షిక వృద్ధి రేటు 5.15 శాతం నమోదు కాగా, అదే సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో సగటు వార్షిక వృద్ధి 6.20 శాతం నమోదైంది. పదే పదే సంపద సృష్టిస్తానంటూ ఎన్నికల ముందు ప్రజల్లోకి వెళ్లి ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు.. తన ఐదేళ్ల పాలనలో కోవిడ్ లాంటి సంక్షోభం లేనప్పటికీ సంపద సృష్టించడంలో ఎందుకు వెనుకబడ్డారో చెప్పాలి. ప్రజలు ఏది చెబితే అదే నమ్ముతారనుకోవడం ఎల్లవేళలా సాగదనే విషయం


బ్యాంకింగ్ కీలక సూచికలు

ఆర్‌బీఐ నిబంధనల మేరకు గత ఏడాది డిసెంబర్ నాటికి కీలక సూచికలు ఇలా

ఆర్‌బీఐ నిబంధన	శాతం	రుణాల మంజూరు శాతం
క్రెడిట్ రేషియో	60	157.94
ప్రాధాన్యత రంగం	40	64.91
వ్యవసాయ రంగం	18	43.21
చిన్న, సన్నకారు రైతులు	10	28.69
బలహీన వర్గాలకు	12	32.47
మహిళలు	5	25.32
సూక్ష్మ పరిశ్రమలు	7.50	8.68


తలసరి ఆదాయం పెరుగుదల ఇలా









ఆస్పత్రులకు కాయకల్ప అవార్డులు






స్థిర ధరల ఆధారంగా 2019-20 నుంచి 2022-23 వరకు రంగాల వారీగా గత నాలుగేళ్లలో వృద్ధి ఇలా




గత ఐదేళ్లలో బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుదల, రుణాలు మంజూరు పెరుగుదల ఇలా ఉంది

సంవత్సరం	డిపాజిట్లు పెరుగుదల	రుణాల మంజూరు పెరుగుదల (కోట్లలో)
31-03-2019 నాటికి	3,12,642	3,97,350
31-03-2020	3,40,208	4,34,261
31-03-2021	3,85,929	5,03,075
31-03-2022	4,14,594	5,81,968
31-03-2023	4,56,961	6,84,466
31-12-2023	4,94,690	7,81,313

రాష్ట్రంలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్స్‌లో నవజాత శిశు మరణాల రేటు తగ్గుదల ఇలా..





రక్తహీనత నివారణ చర్యల్లో భాగంగా చిన్నారులు, బాలింతలు, మహిళలకు 2023-24లో ఐఎఫ్ఏ మాత్రల పంపిణీలో ఏపీ పనితీరు

రాష్ట్రం	6–59 నెలల చిన్నారులు	5–9 ఏళ్ల పిల్లలు	10–19 పిల్లలు యువత	గర్భిణీ స్త్రీలు	బాలింతలు	ర్యాంక్
ఆంధ్రప్రదేశ్	76.9	95	93.7	95	84.6	1
తమిళనాడు	92.2	95	95	95	62.8	2
ఛత్తీస్‌గఢ్	75	91.6	95	95	76.3	3
తెలంగాణ	61.6	95	94.3	95	78.3	4
కేరళ	10.1	35.1	8.1	95	60.6	5
దేశవ్యాప్తంగా	37.1	46.5	50.1	95	65.2	–

ఆమే కీలకం..




ఏపీలో మహిళా ఓటర్లే అధికం

- ప్రస్తుతం ఏపీలో పురుష,మహిళా ఓటర్ల రేషియో 1:1.02
- భవిష్యత్‌లో 1:1.06కు పెరిగే అవకాశం
- ఏపీలో 2014లో ఓటు వేయని మహిళలు 83 లక్షలు.. 2019లో 41 లక్షలు
- 2024 ఎన్నికల్లో మహిళలు ఎక్కువ శాతం ఓటు వేస్తే ఫలితాల్లో గణనీయ మార్పు
- ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ 68 కోట్లకు చేరవచ్చని అంచనా.. మహిళా ఓటర్లు 33 కోట్లు

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి


సాక్షి, అమరావతి

వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో మహిళలే నిర్ణయాత్మక శక్తిగా అవతరించనున్నారని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, గోవా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌లో కూడా మహిళలదే ప్రధాన భూమిక అని నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంగా మహిళా ఓటర్లు ఎలా నిర్ణయాత్మకంగా మారుతున్నారనే అంశంపై ఎస్‌బీఐ పరిశోధన నివేదికను విడుదల చేసింది. దేశంలో ప్రస్తుత సాధారణ ఎన్నికలతో పాటు రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్రగణనీయంగా పెరుగుతుందని అంచనా వేసింది. ప్రస్తుత ఎన్నికల్లో కేరళ, గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని, భవిష్యత్ ఎన్నికల్లో ఈ రాష్ట్రాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఇంకా పెరుగుతుందని నివేదిక వెల్లడించింది. భవిష్యత్ ఎన్నికల్లో తెలంగాణ,హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, సిక్కిం రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య పెరిగి ఫలితాలను నిర్ణయిస్తారని నివేదిక పేర్కొంది.



ఆంధ్రప్రదేశ్‌లో 2014 ఎన్నికల్లో 83 లక్షల మంది మహిళలు పోలింగ్ కేంద్రాలకు రాలేదని, 2019 ఎన్నికల్లో మాత్రం పోలింగ్ కేంద్రాలకు రాని మహిళా ఓటర్ల సంఖ్య ఏకంగా 41 లక్షలకు తగ్గిపోయిందని, మహిళలు ఓటింగ్‌లో ఎక్కువ మంది పాల్గొంటున్నారనడానికి ఇదే సంకేతమని స్పష్టం చేసింది. గతంలో కంటే ప్రస్తుత ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొంటారని, తద్వారా ఫలితాలు గణనీయంగా మారిపోతాయని అంచనా వేసింది. దేశంలో వివిధ రాష్ట్రాల్లో జెండర్ రేషియో పెరుగుతోందని, లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర గణనీయంగా పెరుగుతోందని నివేదిక తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఎన్నికల్లో పురుష, మహిళ ఓటర్ల రేషియో 1:1.02 ఉండగా భవిష్యత్‌లో 1:1.06కు పెరుగుతుందని వెల్లడించింది. గత ఓటింగ్ శాతాలు, మార్పులను విశ్లేషించడం ద్వారా 2024లో పోలింగ్ 68 కోట్లకు చేరుతుందని, ఇందులో 33 కోట్లు మహిళా ఓటర్లే ఉంటారని, ఇది 49%గా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత పోలింగ్ రేటు ప్రకారం 2029 నాటికి పోలింగ్ 73 కోట్లకు చేరుతుందని, ఇందులో 37 కోట్లు మహిళా ఓటర్లు ఉంటారని అంచనా వేసింది. 2047 నాటికి దేశంలో 115 కోట్ల మంది ఓటర్లుగా నమోదు కావచ్చని, ఓటింగ్‌లో 92 కోట్ల మంది పాల్గొంటారని నివేదిక తెలిపింది. 2047లో అత్యధికంగా మహిళా ఓటర్లు 50.6 కోట్ల మంది పాల్గొననుండగా పురుష ఓటర్లు 41.1 కోట్ల మంది పాల్గొంటారని అంచనా వేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పురుష ఓటర్ల పోలింగ్ 67.01 శాతం ఉండగా మహిళా ఓటర్ల పోలింగ్ 67.18 శాతం ఉందని పేర్కొంది. గత లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో అదనంగా 13 కోట్ల మంది మహిళలు ఓటు వేయవచ్చని, ఇది గేమ్ చేంజర్‌గా మారవచ్చని వ్యాఖ్యానించింది.

మహిళా ఓటర్లలో చైతన్యం



న్యూస్‌మేకర్



ప్రియంవద రంగరాజన్

'టైమ్' మేగజీన్ 2024 సంవత్సరానికి గాను '100 మంది ప్రభావపూరిత వ్యక్తుల' జాబితా ప్రకటించింది. ప్రపంచవ్యాప్త ఉద్దండులతో పాటు భారతీయులు కూడా ఈ ఎంపికైన వారిలో ఉన్నారు. వారిలో ఒకరు ఆస్ట్రోఫిజిసిస్ట్ ప్రియంవద రంగరాజన్. కృష్ణబిలాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా సృష్టి పుట్టుకను విశదం చేయగల మర్మాన్ని ఈమె విప్పుతున్న తీరు అసామాన్యమని 'టైమ్' భావించింది. కోయంబత్తూరులో జన్మించి అమెరికాలో స్థిరపడ్డ ప్రియంవద పరిచయం.

కృష్ణబిలాల అన్వేషణలో

కోయంబత్తూరులో జన్మించి...

ప్రియంవద రంజరాజన్ కోయంబత్తూరులో జన్మించారు. తండ్రి ఉద్యోగం రీత్యా ఇంటర్ వరకూ ఢిల్లీలో చదువుకున్నారు. ఆమె అండర్ గ్రాడ్యుయేషన్ 'మసాచుసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో జరిగింది. ఆ తర్వాత యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ నుంచి పిహెచ్‌డి చేశారు. ప్రస్తుతం అమెరికాలోని యేల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. 'మ్యాపింగ్ ది హెవెన్స్: ది రాడికల్ సైంటిఫిక్ ఐడియాస్ దట్ రివీల్ ది కాస్మోస్' అనే ముఖ్యమైన గ్రంథాన్ని రచించారు.

మన పాలపుంతలో ఎన్ని కృష్ణ బిలాలు (బ్లాక్ హోల్స్) ఉంటాయో తెలుసా? కనీసం కోటి నుంచి నూరు కోట్ల వరకు. అంతరిక్షంలో కృష్ణ బిలాలు ఒక నిగూఢ రహస్యం. ఐన్‌స్టీన్ వీటిని ఊహించాడుగాని ఆయన జీవించి ఉన్నంత కాలం వాటి ఉనికిపై వాస్తవిక ఆధారాలు వెల్లడి కాలేదు. 1967లో జాన్ వీలర్ అనే ఫిజిసిస్ట్ 'బ్లాక్ హోల్' పదం వాడినప్పటి నుంచి వీటిపై చర్చలు కొనసాగాయి. ఆ తర్వాతి కాలంలో ఉనికి గురించిన ఆధారాలు దొరికాయి. కృష్ణ బిలాలు కాంతిని కూడా మింగేసేంత శక్తిమంతమైనవి. చిన్న చిన్న బ్లాక్‌హోల్స్ నుంచి అతి భారీ (సూపర్ మాస్) బ్లాక్ హోల్స్ వరకూ మన పాలపుంతలో ఉన్నాయి. ఒక తార తన గురుత్వాకర్షణలో తానే పతనం అయినప్పుడు బ్లాక్ హోల్స్ ఏర్పడతాయనేది ఒక సిద్ధాంతమైతే ఇవి విశ్వం ఏర్పడే సమయంలోనే అంతరిక్ష ధూళిమేఘాలు తమపై తాము పతనవడం వల్ల ఏర్పడ్డాయని మరో సిద్ధాంతం. ఈ మరో సిద్ధాంతానికి ఊతం ఇస్తూ ప్రియంవద రంగరాజన్ సాగిస్తున్న పరిశోధనల వల్లే ఆమె తాజాగా 'టైమ్' మేగజీన్‌లో 'హండ్రెడ్ మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షల్ పీపుల్'లో ఒకరుగా నిలిచారు.

ఆమె పరిశోధన

ప్రియంవద కృష్ణబిలాల పరిశోధనలో ప్రత్యేక కృషి చేశారు. గురుత్వాకర్షణ లెన్సింగ్ పద్ధతి ద్వారా నక్షత్ర మండలాల ఆవిర్భావాన్ని, వాటి పరిణామాలను, అనేక నక్షత్ర మండలాల మధ్య అంతర్గత సంబంధాలపై అధ్యయనం చేశారు. నక్షత్ర మండల సమూహాల గతిశీలతను అధ్యయనం చేయడానికి లెన్సింగ్, ఎక్స్-రే, సున్యావ్-జెల్డోవిక్ డేటాను ఉపయోగించారు. అంతే కాదు ఒక నక్షత్రం, కృష్ణబిలం కలయిక ద్వారా ఏర్పడే విద్యుదయస్కాంత, గురుత్వాకర్షణ తరంగాలపై కూడా అధ్యయనం చేశారు. ఆమెను ఎన్నో అవార్డులు వరించాయి. ప్రతిష్ఠాత్మక లిబర్టీ సైన్స్ సెంటర్ వారి 'జీనియస్ అవార్డు' కూడా దక్కింది.

ఈ విశ్వం ఎలా పరిణామం చెందిందో తెలుసుకోవడానికి ప్రియంవద సాగిస్తున్న కృష్ణబిలాల అన్వేషణ చాలా కీలకంగా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

పోరాటం

మన దేశంలో మహారాష్ట్రలో గాడిదలను అధిక స్థాయిలో రవాణాకు ఉపయోగిస్తున్నారు. ఇటుక బట్టీలలో ఇసుక రవాణాలో వీటి వీపు మీద 200 కేజీల వరకూ వేయడానికి వెనుకాడరు. దీని వల్ల గాడిదలు హింసకు గురవుతున్నాయి. రోగాల బారిన పడుతున్నాయి. అందుకే నాందేడ్‌కు చెందిన సిర్జనా నిజ్జర్ గాడిదల సంరక్షణ గురించి పోరాడుతోంది. గాడిద మోత నుంచి గాడిదలను తప్పించాలంటోంది. ఆమె పోరాటం గురించి...



సిర్జనా నిజ్జర్

గాడిద మోత వద్దు.. వద్దు..

'జనం దేనికైనా విరాళాలు ఇస్తారు గాని గాడిదలంటే ఇవ్వరు. కాని గాడిదలు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు' అంటుంది సిర్జనా గుజ్జర్.

ఢిల్లీ యూనివర్సిటీలో లా చదివిన సిర్జనా జనం కోసం న్యాయస్థానాల్లో వాదించడం కంటే హింసకు గురవుతున్న మూగజీవాల కోసం సమాజంలో వాదించడం మేలు అనుకుంది. అందుకే ఆమె ఎఫ్.ఐ.ఎ.పి.ఓ. (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్)లో కీలకబాధ్యతలు నిర్వహిస్తోంది. వీధి శునకాలతో మొదలైన ఆమె సేవ నేడు గాడిదలకు చేరింది.

నాందేడ్‌లో చూసి...

మహారాష్ట్రలోని నాందేడ్ సిర్జనా తాతగారి ఊరు. కాలేజీ రోజుల్లో వేసవి సెలవుల్లో అక్కడకు వెళితే గాడిదలు విపరీతంగా కనిపించేవి. వాటిని చూసి సరదా పడదామనుకుంటుడగానే ఒళ్లంతా గాయాలతో, బరువులు మోయలేక అవస్థపడుతూ, తిండి లేక ఎముకలు తేలి ఉన్న వాటి రూపాలు సిర్జనాకు ఎంతో బాధ కలిగించేవి. విద్యార్థిగా ఉండగానే వాటి కోసం చేతనైనంతలో హెల్త్ క్యాంప్స్ నిర్వహించేది. లా పూర్తయ్యాక ఇప్పుడు పూర్తి స్థాయిలో వాటి సంరక్షణ కోసం పని చేస్తోంది.



మూడు జిల్లాల్లో...

'మహారాష్ట్రలోని మూడు జిల్లాలు నాందేడ్, బీడ్, లాతూర్ లలో గాడిదల సంఖ్య ఎంత లేదన్నా 6000 ఉంటుంది. ఇవి మహారాష్ట్రలో వాన కొరత ప్రాంతాలు. జనం పేదరికంలో మగ్గుతుంటారు. ఈ మూడు జిల్లాల్లోనూ ఇటుక బట్టీలు విస్తారం. వాటిలో కూలీ చేస్తే రోజుకు వంద రూపాయలు వస్తాయి. ఇటుకలు మోయడానికి వీరంతా గాడిదలను ఉపయోగిస్తారు. ఇటుకలను చేరవేయడానికి వాటి వీపు మీద 60 కేజీల నుంచి 100 కేజీల వరకూ బరువు మోయిస్తారు. ఈ ప్రాంతంలో పారే ఉపనది చంద్రభాగ ఒడ్డు నుంచి ఇసుక మోయిస్తారు. శక్తికి మించి బరువు మోయడం వల్ల గాడిదలు గాయాల బారిన పడతాయి. ఒక్కోసారి వాటి కాళ్లు విరుగుతాయి. కంటి సమస్యలు వస్తాయి. వాటికి వైద్యం చేయించే శక్తి పేదలకు ఉండదు. వాటిని అలాగే వదిలేస్తారు' అంటుంది సిర్జనా.

వానలు వస్తే పస్తే

'నాందేడ్, బీడ్, లాతూర్ జిల్లాల్లో అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకూ నిర్విరామంగా ఇటుక బట్టీల పని జరుగుతుంది. అన్నాళ్లు గాడిదలకు పని ఉంటుంది. కొద్దోగొప్పో తిండి దొరుకుతుంది. కాని ఎప్పుడైతే తొలకరి మొదలవుతుందో ఇటుక బట్టీలు మూతపడతాయి. కూలీలు గాడిదలకు తిండి భారం అని రోడ్ల మీద వదిలేస్తారు. వాటికి తిండి దొరకదు. మంచినీరు దొరకదు. రోగాలతో బాధ పడతాయి. ముసలివైతే కబేళాకు అమ్మేస్తారు. వాటి కోసం ఈ మూడు జిల్లాలో సంరక్షణాశాలలను ఏర్పాటు చేస్తున్నాం. ఎస్.పి.సి.ఎ. (సొసైటీస్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు యానిమల్స్) బలోపేతం చేస్తున్నాం. గత పదేళ్లలో గాడిదల సంఖ్య కూడా బాగా తగ్గింది. వీటి సంఖ్య కాపాడుకుంటూ వీటితో మానవీయంగా వ్యవహరించే చైతన్యాన్ని కలిగించడమే నా లక్ష్యం' అని తెలిపింది సిర్జనా.

యూత్ పల్స్

కంటెంట్‌లో సత్తా ఉండాలేగానీ కాలు కదపకుండా, కడుపులో చల్ల కదలకుండా సొంత ఊళ్లోనే ఉంటూ తగినంత డబ్బు సంపాదించవచ్చు అని నిరూపిస్తున్నారు గ్రామీణ యువ కంటెంట్ క్రియేటర్‌లు. హాస్యం నుంచి వ్యవసాయం వరకు రకరకాల సబ్జెక్ట్‌లను వైరల్ చేయడంలో నేర్పు సాధించారు.

పల్లె టు పాపులర్ జోన్

• జోరుగా హుషారుగా



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆరియారి గ్రామానికి చెందిన శివానీ కుమారికి సోషల్ మీడియాలో వేలాది మంది ఫాలోవర్‌లు ఉన్నారు. గ్రామీణ జీవితాన్ని పాటలు, కామెడీతో కూడిన స్కెచ్‌ల ద్వారా ఆవిష్కరిస్తూ సోషల్ మీడియాలో పేరు తెచ్చుకుంది.

తనతో సమానంగా ఫాలోవర్‌లు ఉన్న ఇంగ్లీష్ క్రియేటర్‌లు కుమారి కంటే ఎక్కువ సంపాదిస్తున్నటికీ డబ్బుల గురించి చింత ఆమెకు లేదు. డబ్బుల కంటే కంటెంట్ క్రియేషన్ గురించే ఎక్కువ దృష్టి పెడుతుంది కుమారి.

ఒడిశాలోని చిత్రకూట్‌కు చెందిన ధీరజ్ టక్రీకి గతంలో ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడడం వచ్చేది కాదు. తడబడుతూ మాట్లాడేవాడు. దీంతో యూట్యూబ్ వీడియోలు చూసి ధీరజ్ అమెరికన్స్‌లా ఫ్లూయెంట్‌గా మాట్లాడడం నేర్చుకున్నాడు. అమెరికన్ యాక్సెంట్‌తో మాట్లాడే నైపుణ్యం ధీరజ్‌ను 'ఇన్‌స్టా ఫేమ్' చేసింది.

2023లో ధీరజ్ ఫాలోవర్‌ల సంఖ్య 160 మాత్రమే. హ్యాండ్‌సమ్ అనే మాటను ఫారిన్ యాక్సెంట్‌లో ఎలా పలకాలి అనే రీల్ వైరల్ కావడంతో ధీరజ్ టక్రీ ఫాలోవర్‌ల సంఖ్య వేలకు చేరింది.

మధ్యప్రదేశ్‌లోని బిరాఖేడీ గ్రామానికి చెందిన 23 సంవత్సరాల రామ్ పారమార్ 17 సంవత్సరాల వయసులో యూట్యూబ్ చానల్ మొదలు పెట్టాడు. తన చానల్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన విషయాల గురించి మాట్లాడేవాడు. ఏడు, ఎనిమిది వేలతో యూట్యూబ్‌లో అతడి సంపాదన మొదలైంది. ఇప్పుడు బ్రాండ్ కొలాబరేషన్ ద్వారా లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నాడు.

పది లక్షలు వెచ్చించి తన గ్రామంలో ఆఫీస్ నిర్మించుకున్నాడు. కారు కొన్నాడు. ఇద్దరు సభ్యులతో ఉన్న టీమ్‌ను విస్తరించే పనిలో ఉన్నాడు. గుజరాతీ, తమిళ భాషల్లో కూడా కంటెంట్‌ను విస్తరించే ఆలోచనలో ఉన్నాడు.

'మన దేశంలో చాలా ప్రాంతాల్లో రైతులు హిందీ భాషను అర్థం చేసుకోలేరు. వారిని దృష్టిలో పెట్టుకొని ఇతరుల సహకారంతో ప్రాంతీయ భాషల్లో కంటెంట్‌ను క్రియేట్ చేయాలనుకుంటున్నాను. దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు కంటెంట్‌ను చేరువ చేయాలనుకుంటున్నాను' అంటున్నాడు ధీరజ్.

ఇరవై ఏడు సంవత్సరాల మయూరి పాటిల్‌కు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా డబ్బు సంపాదించాలనేది లక్ష్యం కాదు. 'పశ్చిమ కనుమలను కాపాడుకుందాం' అనే నినాదంతో రీల్స్ చేస్తోంది. పశ్చిమ కనుమల అందాలను కళ్లకు కట్టేలా ఉండే ఆ రీల్స్ ఎంతోమందిని ఆకట్టుకుంటున్నాయి. ఆలోచింపచేలా చేస్తున్నాయి.

కొండపై ఉన్న ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న ఒక వృద్ధురాలి జీవనశైలిపై పాటిల్ చేసిన రీల్ వైరల్ అయింది. ఎలాంటి కమర్షియల్ ఎలిమెంట్స్ లేని ఈ రీల్ సూపర్ సక్సెస్ కావడమే కాదు అది పాటిల్‌కు ఎంతో ఉత్సాహాన్నీ ఇచ్చింది.

మహారాష్ట్రలోని పులగామ్ గ్రామానికి చెందిన నేహా తాంబ్రేది సూపర్ పవర్ గ్రామీణ యాస. కామెడీ దట్టించి వివిధ సామాజిక సమస్యలపై తమ ప్రాంత మాండలికంలో నేహా చేసే వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాయి. తన గ్రామం నుంచి వెళ్లి పుణెలో ఇంజనీరింగ్ చేయడం నేహాకు కల్చరల్ షాక్.

'నా గ్రామీణ మరాఠీ యాసను వెక్కిరించేవారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది నేహా.

ఎంతోమంది వెక్కిరించిన ఆ యాస కంటెంట్ క్రియేషన్‌లో ఆమె బలం అయింది. నేహా సృష్టించిన 'తోంబ్రే బాయి' క్యారెక్టర్ బాగా పాపులర్ అయింది.

స్థూలంగా చెప్పాలంటే గ్రామీణ ప్రాంత క్రియేటర్‌లు సోషల్ మీడియాలో కొత్త దృశ్యం ఆవిష్కరిస్తున్నారు. కర్నాటకాలోని చిన్న పల్లెల నుంచి ఈశాన్య ప్రాంతాలలోని మారుమూల గ్రామాల వరకు కంటెంట్ క్రియేషన్ ద్వారా వైవిధ్యాన్ని ఆవిష్కరిస్తున్నారు. ప్రతి క్రియేటర్ తనదైన ప్రత్యేకతను కంటెంట్‌కు జోడిస్తున్నారు.

'ఇన్‌స్టాగ్రామ్ ఉద్దేశాన్ని చాలా బ్రాండ్స్ మరిచిపోయాయి. ఇన్‌స్టాగ్రామ్ అనేది ఫన్, స్టోరీ టెల్లింగ్‌కు వేదిక' అంటుంది ముంబైకి చెందిన కంటెంట్ సొల్యూషన్స్ ఫర్మ్ 'అప్పర్‌కేస్' డైరెక్టర్ నిశిషా భర్వానీ.

ఇన్‌స్టాగ్రామ్‌కు కీలకమైన ఫన్, వైవిధ్యాన్ని జోడిస్తూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు గ్రామీణ ప్రాంత యువ కంటెంట్ క్రియేటర్‌లు.

ఎక్కడా తగ్గేదే లేదండీ

గ్రామీణప్రాంత జీవనశైలికి అద్దం పట్టే వీడియోలతో పాపులర్ అయింది ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శివానీ కుమారి. ఆడంబరాల కంటే సహజత్వమే కంటెంట్‌కు అందాన్ని తీసుకువస్తుంది అనేది కుమారి నమ్మే థియరీ. అందుకే ఆమె చేసే వీడియోల్లో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు. యూట్యూబ్ ద్వారా వచ్చిన ఆదాయంతో ఊళ్లో సొంత ఇళ్లు కట్టుకుంది. సోషల్ మీడియాలో కుమారి పాపులారిటీని దృష్టిలో పెట్టుకొని వ్యక్తుల నుంచి మొదలు ఆర్గనైజేషన్స్ వరకు ప్రశంసపూర్వకమైన ఈ-మెయిల్స్ వస్తుంటాయి. అవి ఆమెకు బలమైన టానిక్‌లా పనిచేస్తాయి. 'ఇంగ్లీష్‌లో గడగడా మాట్లాడితేనే కంటెంట్ హిట్ అవుతుంది' అనే భావనను కుమారిలాంటి వాళ్లు తప్పని తేల్చేస్తున్నారు. ఇంగ్లీష్-స్పీకింగ్ అర్బన్ క్రియటర్స్ కంటే తాము తక్కువ కాదని నిరూపిస్తున్నారు.



శివాని కుమారి

'ఎంత పెద్ద చదువులు చదివినా.. ఆర్థికంగా ఎంత ఎదిగినా మనసుకు తృప్తిగా లేకపోతే అందులో సహజత్వం లోపిస్తుంది. చేసే పనుల్లో నైపుణ్యం రాదు..' అంటున్నారు హేమ. పర్యావరణహితంగా మహిళలకు ఉపయుక్తంగా ఉండే రీ యూజబుల్ క్లాత్‌తో ప్యాడ్స్, పిల్లలకు డైపర్లు తయారుచేస్తూ, గ్రామంలోని మహిళలకు ఉపాధి కల్పిస్తూ వాటిని మార్కెటింగ్ చేస్తున్నారు.



హేమ

పర్యావరణ ప్రేమిక



తమిళనాడు, చిత్తూరు బార్డర్‌లో ఉన్న అతిమంజరీ పేట్‌లో ఉన్న హేమ తన ఉత్పత్తులతో హైదరాబాద్‌లోని క్రాఫ్ట్ కౌన్సిల్‌లోని ప్రదర్శనశాలలో తన స్టాల్ ద్వారా పరిచయం అయ్యారు. అత్యంత నిరాడంబరంగా కనిపిస్తున్న ఆమె... అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేసి, స్వదేశానికి వచ్చి తనను తాను పర్యావరణ ప్రేమికగా ఎలా మలచుకున్నారో, మరికొందరి మహిళలను ఎలా భాగస్వాములను చేస్తున్నారో వివరించారు.

''మా ఊరిలో పన్నెండేళ్లుగా ఉంటున్నాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వాడకంలో ఉన్న వస్తువులకు ప్రత్యామ్నాయ, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తయారుచేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. చాలా ఆలోచనలు చేశాక మహిళల రుతుక్రమ సమయంలో వాడే ప్యాడ్స్‌కు సంబంధించిన పరిష్కారం కనుక్కోవాలనుకున్నాను. అందులో భాగంగా 2020లో 'కొన్ని' పేరుతో మా ఉత్పత్తులన్నీ గ్రామంలోని మహిళలు, యువతతో కలిసి చిన్న చిన్న సమూహాలుగా ఏర్పాటు చేసి, వారితో తయారుచేస్తున్నాను. మహిళలు, చంటిపిల్లలకు ఉపయోగపడే రీ యూజబుల్ ఉత్పత్తుల తయారీకి కొంతమందిని గ్రూప్‌గా చేసి వారి ఇళ్ల నుంచే, సౌకర్యవంతమైన సమయంలో తయారుచేసిచ్చేలా ప్రణాళిక చేశాను. చదువుకునే అమ్మాయిలకు, అబ్బాయిలకు ఇది ఒక పార్ట్‌టైమ్ ఉపాధి లాగా కూడా ఉపయోగపడుతుంది.

■ వాడకం సులువు..

మృదువుగా, మన్నికగా ఉండటమే కాకుండా వాడిన తర్వాత రెండు గంటల పాటు నీళ్లలో నానబెట్టి, ఎండలో ఆరవేయవచ్చు. తిరిగి వీటిని వాడుకోవచ్చు. వెదురు కాటన్‌ను వాటర్‌ప్రూఫ్ ఫ్యాబ్రిక్‌తో జత చేసి వీటిని తయారుచేస్తుంటాం. ఇవి సురక్షితంగానూ, అనుకూలంగానూ ఉంటాయి. తిరిగి ఉపయోగించడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్నీ నివారించవచ్చు. డిస్పోజబుల్ ప్యాడ్‌లలో రసాయనాల కారణంగా చర్మానికి హాని కూడా కలిగిస్తాయి. మహిళలకు రీ యూజబుల్ క్లాత్ ప్యాడ్స్ మాత్రమే కాదు పిల్లలకు డైపర్లు, మ్యాట్లు, వైప్స్.. అన్నీ ఎకో ఫ్రెండ్లీవే తయారుచేస్తున్నాం. ఇవి మృదువుగా ఉంటాయి. కాబట్టి చర్మానికి ఎలాంటి హానీ కలిగించవు. స్మాల్, మీడియమ్.. సైజులను బట్టి డిజైన్ల బట్టి ధరలు ఉన్నాయి. ఆర్డర్లను బట్టి ఒక్కొరికి రూ.5,000 వరకు ఆదాయం లభిస్తుంది. ఇందులో ఇప్పుడు పెద్దగా ఆదాయం రాకపోవచ్చు. నేను ఆదాయం, రాబడి గురించి ఆలోచించడం లేదు. ముసుముందు అందరూ పర్యావరణహితంగా మారాల్సిందే. అందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నాను.

■ సొంత ఊరికి...

మేం పన్నెండేళ్లు అమెరికాలో ఉన్నాం. నేనూ, మా వారు దేవ్ అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగాలు చేశాం. మాకు ఇద్దరు పిల్లలు. ఒక దశలో మాకు అక్కడ ఉండాలనిపించలేదు. మొత్తం కుటుంబంతో సొంత ఊరికి వచ్చేశాం. ఇక్కడే ఊళ్లో ఏడెకరాల భూమి కొనుగోలు చేశాం. అందులో ఎక్కువ శాతం రాగులు పండిస్తాం. ఆ పని అంతా మా వారు చూసుకుంటారు.

■ ఎవరికి నచ్చిన పని వాళ్లు...

అమెరికన్ సంస్కృతిలో పిల్లల మీద చదువుల ఒత్తిడి ఉండదు. పిల్లలకు ఏది ఇష్టమో, ఏ కళలో నైపుణ్యం సాధించాలనుకుంటారో దానిని వారే కనిపెట్టేలా, నైపుణ్యాలు సాధించేలా చూస్తారు. మేం కూడా పిల్లలను స్కూళ్లను, కాలేజీకి పంపించలేదు. హోమ్ స్కూలింగ్ అని మాకు గ్రూప్ ఉంటుంది. ఆ కమ్యూనిటీలో పిల్లలకు నచ్చినవి చదువుకుంటారు. తప్పనిసరిగా చదవాలనే నిబంధన పెడితే, మనసుకు ఇష్టంలేనిదానిమీద వారెప్పటికీ ప్రావీణ్యులు కాలేరు. ఇవన్నీ ఆలోచించాం. పిల్లలకు ఏది ఇష్టమో అదే చేయమన్నాం. ఇద్దరూ సంగీతం నేర్చుకున్నారు. ఇరవై ఏళ్ల మా అబ్బాయికి శాస్త్రీయ సంగీతం అంటే ఎక్కువ ఇష్టం. పద్దెనిమిదేళ్ల మా అమ్మాయి ఉడెన్ ఫర్నీచర్‌లో తన నైపుణ్యాలను చూపుతుంటుంది. నేను పర్యావరణ హితంగా ఉండే పనులు చేయాలనే ఆలోచనతో రీ యూజబుల్ న్యాపికిన్స్ పై దృష్టి పెట్టాను. మా విధానాలు మా ఇతర కుటుంబాల వారికి నచ్చుతుందని నేను అనుకోను. ఎందుకంటే, ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పరుగులు పెట్టేవారే. తమకేది నచ్చుతుందో, ఏం చేయగలమో, ఎందులో సంతృప్తి లభిస్తుందో దానిని కనుక్కోలేరు. ప్రకృతి నీడన, నచ్చిన పనుల్లో భాగస్వాములం అవుతూ పర్యావరణహితగా జీవిస్తున్నాం. నా ఈ ఆలోచనను విరివిగా మార్కెట్లోకి తీసుకెళ్లడానికి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్ ద్వారా రకరకాల క్రాఫ్ట్స్ మేళాలో పెడుతూ సాధ్యమైనంత వరకు ప్రజల్లోకి తీసుకెళుతున్నాను' అని వివరించారు హేమ.

– నిర్మలారెడ్డి



జొకోవిచ్‌కు లారియస్ అవార్డు

పురుషుల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ ప్రతిష్టాత్మక లారియస్ వరల్డ్ స్పోర్ట్స్ వార్షిక అవార్డుల్లో మెరిశాడు. 2023 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో ఈ సెర్బియా దిగ్గజం 'ఉత్తమ క్రీడాకారుడు' పురస్కారం గెల్చుకున్నాడు. జొకోవిచ్‌కు ఈ అవార్డు లభించడం ఇది ఐదోసారి. 2023లో జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించడంతోపాటు వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. సీజన్‌ను టాప్ ర్యాంక్‌తో ముగించాడు. మహిళల విభాగంలో స్పెయిన్ ఫుట్‌బాల్ ప్లేయర్ బొన్మాటి 'ఉత్తమ క్రీడాకారిణి' అవార్డు అందుకుంది.

తొలి రౌండ్‌లోనే రష్మిక పరాజయం



షార్లొట్స్‌విల్ డబ్ల్యూ–75 మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో జరుగుతున్న ఈ టోర్నీలో సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో రష్మిక 2-6, 2-6తో గాబ్రియేలా ప్రైస్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది.

స్టొయినిస్ విధ్వంసం



- 63 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్స్‌లతో 124*
- చెన్నైపై లక్నో సూపర్ జెయింట్స్ విజయం
- రుతురాజ్ అజేయ సెంచరీ వృథా

చెన్నై: నాలుగు రోజుల క్రితం లక్నో వేదికగా చెన్నై సూపర్‌కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌కు ఇప్పుడు చెన్నైలో రీప్లేగా జరిగిన పోరులో లక్నోనే మళ్లీ 'సూపర్'గా ఆడి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో లక్నో 6 వికెట్ల తేడాతో చెన్నైపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (60 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ శతకాన్ని నమోదు చేశాడు. 'హిట్టర్' శివమ్ దూబే (27 బంతుల్లో 66; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో 19.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్కస్ స్టొయినిస్ (63 బంతుల్లో 124 నాటౌట్; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) అసాధారణ ఇన్నింగ్స్‌తో అజేయ సెంచరీ సాధించి లక్నోను విజయతీరాలకు చేర్చాడు. పూరన్‌తో నాలుగో వికెట్‌కు 70 పరుగులు, దీపక్ హుడాతో అబేధ్యమైన ఐదో వికెట్‌కు 55 పరుగులు జోడించిన స్టొయినిస్ లక్నోకు చిరస్మరణీయ విజయం అందించాడు.

కెప్టెన్ ఇన్నింగ్స్...

రహానే (1), వన్‌డౌన్‌లో మిచెల్ (11), జడేజా (16) చెన్నై టాప్–4 బ్యాటర్లలో ముగ్గురి స్కోరిది! పవర్ ప్లేలో చెన్నై చేసిన స్కోరు 49/2 తక్కువే! ఈ దశలో కెప్టెన్ రుతురాజ్ బౌండరీలతో పరుగుల వేగాన్ని అందుకున్నాడు. గైక్వాడ్ 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... జట్టు స్కోరు 11.3 ఓవర్లలో వందకు చేరింది. అదే ఓవర్లో జడేజా నిష్క్రమించడంతో వచ్చిన దూబే ఓ రకంగా శివతాండవమే చేశాడు. 15 ఓవర్లలో చెన్నై 135/3 స్కోరు చేసింది. కానీ ఆ తర్వాత దూబే పవర్‌ప్లే మొదలైంది. భారీ సిక్సర్లతో స్కోరు ఒక్కసారిగా దూసుకెళ్లింది. 16వ ఓవర్లో దూబే హ్యాట్రిక్ సిక్స్‌లతో 19 పరుగులు, 18వ ఓవర్లో గైక్వాడ్ 6, 4, 4లతో 16 పరుగులు, 19వ ఓవర్లో మళ్లీ దూబే దంచేయడంతో 17 పరుగులు, ఆఖరి ఓవర్లో 15 పరుగులతో స్కోరు 200 పైచిలుకు చేరింది. చివరి 5 ఓవర్లలో దూబే వికెట్ మాత్రమే కోల్పోయిన చెన్నై 75 పరుగులు సాధించింది. గైక్వాడ్ 56 బంతుల్లో శతకాన్ని, దూబే 22 బంతుల్లో అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నారు.

బ్యాటింగ్ గేర్ మార్చి...

కొండంత లక్ష్యం ముందున్న లక్నోకు ఆరంభంలో అన్ని ఎదురుదెబ్బలే తగిలాయి. ఓపెనర్లు డికాక్ (0), కేఎల్ రాహుల్ (14 బంతుల్లో 16; 1 ఫోర్, 1 సిక్స్), దేవదత్ పడిక్కల్ (19 బంతుల్లో 13) నిరాశ పరిచారు. టాపార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన స్టొయినిస్ ఒక్కడే గెలిపించేదాకా మెరిపించాడు. ఈ క్రమంలో 26 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. తర్వాత నికోలస్ పూరన్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) జోరు పెంచగానే... పతిరణ మరుసటి ఓవర్లోనే పెవిలియన్ చేర్చాడు. స్టొయినిస్ 56 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీపక్ హుడా కూడా (6 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) బ్యాట్‌కు పని చెప్పడంతో అనూహ్యంగా లక్నో లక్ష్యం వైపు పరుగు పెట్టింది. 18 బంతుల్లో 47 పరుగుల కష్టమైన సమీకరణం ఇద్దరి దూకుడుతో సులువైంది. 18, 19వ ఓవర్లలో 15 పరుగుల చొప్పున వచ్చాయి. 6 బంతుల్లో 17 పరుగుల్ని స్టొయినిస్ 6, 4, నోబాల్4, 4లతో ఇంకో మూడు బంతులు మిగిల్చి ముగించాడు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) రాహుల్ (బి) హెన్రీ 1; రుతురాజ్ (నాటౌట్) 108; మిచెల్ (సి) హుడా (బి) యశ్ 11; జడేజా (సి) రాహుల్ (బి) మోసిన్ 16; దూబే (రనౌట్) 66; ధోని (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 210. **వికెట్ల పతనం:** 1-4, 2-49, 3-101, 4-205. **బౌలింగ్:** హెన్రీ 4-0-28-1, మోసిన్ ఖాన్ 4-0-50-1, రవి బిష్ణోయ్ 2-0-19-0, యశ్ ఠాకూర్ 4-0-47-1, స్టొయినిస్ 4-0-49-0, కృనాల్ పాండ్యా 2-0-15-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (బి) దీపక్ 0; రాహుల్ (సి) రుతురాజ్ (బి) ముస్తఫిజుర్ 16; స్టొయినిస్ (నాటౌట్) 124; పడిక్కల్ (బి) పతిరణ 13; పూరన్ (సి) శార్దుల్ (బి) పతిరణ 34; హుడా (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (19.3 ఓవర్లలో 4 వికెట్లకు) 213. **వికెట్ల పతనం:** 1-0, 2-33, 3-88, 4-158. **బౌలింగ్:** దీపక్ చహర్ 2-0-11-1, తుషార్ 3-0-34-0, ముస్తఫిజుర్ 3.3-0-51-1, శార్దుల్ 3-0-42-0, మొయిన్ అలీ 2-0-21-0, జడేజా 2-0-16-0, పతిరణ 4-0-35-2.


రుతురాజ్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × గుజరాత్
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
గుజరాత్	8	4	4	8	-1.055
ముంబై	8	3	5	6	-0.227
ఢిల్లీ	8	3	5	6	-0.477
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

గుకేశ్ 'భూకంపం' తెచ్చాడు!

గ్యారీ కాస్పరోవ్ ప్రశంస

టొరంటో: క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచి వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ పోరుకు అర్హత సాధించిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌పై 'ఆల్‌టైమ్ గ్రేట్' గ్యారీ కాస్పరోవ్ ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ చెస్‌లో కొత్త మార్పునకు ఇది సూచన అని ఈ మాజీ వరల్డ్ చాంపియన్ అభిప్రాయపడ్డాడు. 'గుకేశ్‌కు అభినందనలు. టొరంటోలో ఒక భారతీయుడు భూకంపం సృష్టించాడు. 17 ఏళ్ల కుర్రాడు చైనా చాంపియన్ డింగ్ లిరెన్‌ను ఢీకొనబోతుండటం ప్రపంచ చెస్‌లో ఆధిక్యం ఒక దిక్కు నుంచి మరో దిక్కుకు మారిందనేదానికి సరైన సూచిక. విశ్వనాథన్ ఆనంద్ 'పిల్లలు' అన్ని చోట్లా దూకుడు ప్రదర్శిస్తున్నారు. గుకేశ్ మరింత పైకి ఎదుగుతాడు. చైనా, భారత్‌కు చెందిన కుర్రాళ్లు చెస్‌లో ఏదైనా సాధించే సంకల్పంతో దూసుకుపోతుంటే ఇంగ్లండ్, అమెరికా జూనియర్ ఆటగాళ్లు మాత్రం చూస్తూనే ఉండిపోతున్నారు' అని కాస్పరోవ్ వ్యాఖ్యానించాడు. ఆదివారం ముగిసిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ఓపెన్ విభాగంలో భారత్ నుంచి గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి పోటీపడ్డారు. గుకేశ్ విజేతగా అవతరించగా... ప్రజ్ఞానంద ఐదో స్థానంలో, విదిత్ ఆరో ర్యాంక్‌లో నిలిచారు. ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి రన్నరప్‌గా నిలువగా, వైశాలికి నాలుగో స్థానం లభించింది.


విన్నర్స్ ట్రోఫీ, స్వర్ణ పతకంతో గుకేశ్


రన్నరప్, రజత పతకంతో కోనేరు హంపి

భారత నంబర్‌వన్‌గా శ్రీజ

తెలంగాణ టీటీ క్రీడాకారిణి ఘనత

న్యూఢిల్లీ: రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల సింగిల్స్ నంబర్‌వన్ ర్యాంకర్‌గా అవతరించింది. మంగళవారం విడుదల చేసిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో శ్రీజ ఒక స్థానం మెరుగుపర్చుకొని 38వ ర్యాంక్‌లో నిలిచింది. ఇప్పటి వరకు భారత నంబర్‌వన్‌గా ఉన్న మనిక బత్రా రెండు స్థానాలు పడిపోయి 39వ ర్యాంక్‌కు చేరుకుంది. భారత్ నుంచి యశస్విని 99వ ర్యాంక్‌లో, అర్చన కామత్ 100వ ర్యాంక్‌లో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న 25 ఏళ్ల శ్రీజ ఈ ఏడాది నిలకడగా రాణిస్తూ ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సర్క్యూట్‌లో రెండు టైటిల్స్ సాధించింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో ఆచంట శరత్ కమల్‌తో కలిసి శ్రీజ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో శరత్ కమల్ 37వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సత్యన్ జ్ఞానశేఖరన్ 60వ స్థానంలో, మానవ్ ఠక్కర్ 61వ స్థానంలో, హర్మీత్ దేశాయ్ 64వ ర్యాంక్‌లో ఉన్నారు. హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ 147వ ర్యాంక్‌లో నిలిచాడు.




జ్యోతి సురేఖకు రెండో స్థానం



షాంఘై (చైనా): ప్రపంచ ఆర్చరీ కొత్త సీజన్‌లో భాగంగా ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత క్రీడాకారిణులు రాణించారు. మహిళల కాంపౌండ్ విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ 711 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. భారత్‌కే చెందిన అదితి 704 పాయింట్లతో 8వ స్థానంలో, పర్ణీత్ కౌర్ 703 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచారు. జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్ స్కోర్లతో కలిపి భారత బృందం 2118 పాయింట్లతో టీమ్ విభాగంలో టాప్ ర్యాంక్‌ను పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

సినిమా


'ప్రాశ్వదీర్ఘ'లో బ్రహ్మానందం


'లవ్@65'లో రాజేంద్రప్రసాద్, జయప్రద


'మారుతి నగర్'లో రావు రమేష్

హీరోల్

హాస్య నటులు, ప్రతినాయకులు, సహాయ నటులుగా కనిపించి, ఆకట్టుకునే నటులు ఫర్ ఎ చేంజ్ కథానాయకులుగా కనిపిస్తే ఆ సినిమాకి కావాల్సినంత క్రేజ్ ఏర్పడుతుంది. ఆ నటులకు కూడా రొటీన్ క్యారెక్టర్స్ నుంచి కాస్త మార్పు దక్కుతుంది. ఎక్కువగా కమెడియన్లు, విలన్లు, క్యారెక్టర్లు ఆర్టిస్టులుగా చేసే ఆ నటులు ఇప్పుడు హీ'రోల్'లో కనిపించనున్నారు. ఆ 'హీరోల్' చేస్తున్న చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.

తొలిసారి నేపాలీ భాషలో...

తెలుగు పరిశ్రమలో హాస్యబ్రహ్మగా పేరు తెచ్చుకున్నారు బ్రహ్మానందం. దాదాపు నలభై ఏళ్లుగా తనదైన హాస్యంతో ప్రేక్షకులను నవ్విస్తున్న ఆయన అడపాదడపా హీరోగానూ చేశారు. 'బాబాయ్ హోటల్' (1992), 'జోకర్ మామ సూపర్ అల్లుడు' (1992) వంటి చిత్రాల్లో సోలో హీరోగా చేసిన బ్రహ్మానందం 'సూపర్ హీరోస్' (1997), 'హ్యాండ్సప్' (2020) వంటి మరికొన్ని చిత్రాల్లో ఓ హీరోగా నటించారు. తాజాగా 'ప్రాశ్వదీర్ఘ' చిత్రంలో ఆయన ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. చంద్ర పంత్ దర్శకత్వంలో తెలుగు, నేపాలీ భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. బ్రహ్మానందం నటిస్తున్న ఈ తొలి నేపాలీ చిత్రం సెప్టెంబర్ 27న రిలీజ్ కానుంది.

ఆరు పదులలో ప్రేమ

ఆరు పదుల వయసులో ప్రేమలో పడ్డారు రాజేంద్రప్రసాద్, జయప్రద. ఈ ఇద్దరూ జంటగా నటించిన చిత్రం 'లవ్@65'. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్ ఆ మధ్య విడుదలైంది. 'ఈ ప్రపంచాన్నే బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. త్వరలో ఈ చిత్రం రిలీజ్ రానుంది.

వినోదాల సుబ్రమణ్యం

కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా రావు రమేశ్ ఏ రేంజ్‌లో విజృంభిస్తారో వెండితెరపై చూస్తుంటాం. 'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్రంలో తొలిసారి ఆయన హీరోగా కనిపించనున్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రావు రమేశ్ సరసన ఇంద్రజ నటించారు. పూర్తి స్థాయి వినోదంతో, భావోద్వేగాలతో రూపొందిన ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది.

మధ్యవయస్కుడి కథ

తెలుగులో దాదాపు 36 ఏళ్లుగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెప్పిస్తున్నారు రాజా రవీంద్ర. పలు చిత్రాల్లో లీడ్ రోల్స్‌లోనూ నటించిన ఆయన తాజాగా 'సారంగదరియా' సినిమాలో లీడ్ రోల్ చేశారు. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడు. మధ్యవయస్కుడైన ఓ వ్యక్తి పరువుగా బతికితే చాలనుకుంటాడు. అయితే అతనికి తన కొడుకులు, కూతురు వల్ల సమాజం నిలదీసే పరిస్థితులు ఎదురవుతాయి. అప్పుడు అతను ఏం చేశాడు? అనే కథాంశంతో 'సారంగదరియా' చిత్రం రూపొందింది. మేలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.


'సారంగదరియా'లో రాజా రవీంద్ర

తండ్రి విలువ తెలిపేలా...

తెలుగులో శివాజీ రాజాది మూడు దశాబ్దాలకు పైగా ప్రయాణం. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోగా తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారాయన. ఇటీవల సినిమాలకు కొంచెం గ్యాప్ ఇచ్చిన శివాజీ రాజా 'నాన్నా మళ్లీ రావా..!'లో లీడ్ రోల్ చేస్తున్నారు. ఆయనకు జోడీగా ప్రభావతి నటిస్తున్నారు. నిర్దేష్ దర్శకుడు. మనసుని హత్తుకునే బలమైన సెంటిమెంట్, భావోద్వేగాల నేపథ్యంలో తండ్రి విలువ తెలిపేలా ఈ చిత్రం రూపొందుతోంది.


'నాన్నా మళ్లీ రావా'లో శివాజీ రాజా

మ్యూజిక్ షాప్‌లో...

'ప్రస్థానం' (2010) సినిమాతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రస్థానం మొదలుపెట్టారు అజయ్ ఘోష్. కమెడియన్, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్.. ఇలా తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో నటించి, మెప్పించారాయన. తాజాగా 'మ్యూజిక్ షాప్ మూర్తి'లో హీరోగా చేశారు. శివ పాలడుగు దర్శకత్వం వహించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. మన జీవితాల్లో మనం ఏం కోల్పోయి ఏ స్థితిలో ఉన్నామో చూపించేలా ఈ చిత్రం ఉంటుందని యూనిట్ పేర్కొంది.


'మ్యూజిక్ షాప్'లో అజయ్ ఘోష్, చాందిని

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రారంభం

సందీప్ కిషన్ హీరోగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా మంగళవారం ఆరంభమైంది. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించనున్నారు. తొలి సన్నివేశానికి దర్శకుడు విజయ్ కనకమేడల కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. అనిల్ సుంకర గౌరవ దర్శకత్వం వహించారు. ''ఈ సినిమాలో సందీప్ కిషన్ క్యారెక్టరైజేషన్ కొత్తగా ఉంటుంది. రావు రమేశ్ ఓ కీలక పాత్రలో నటిస్తారు. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నాం. దర్శకుడిగా నక్కిన త్రినాథరావు విజయవంతమైన ప్రయాణంలో భాగమైన రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు డైలాగ్ రైటర్‌గా చేస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


'దిల్' రాజు, సందీప్ కిషన్

గట్స్ ఉన్నవాళ్లకే హిట్స్ వస్తాయి

- తేజ సజ్జా


చైతన్య, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా, సముద్ర ఖని

''సత్యం' థియేటర్‌లో వందరోజులు ఆడిన సినిమాలు చూశాను. అలాంటి ప్లేస్‌లో మా 'హను–మాన్' వంద రోజుల పండగ జరుపుకోవడం హ్యాపీగా ఉంది. ప్రేక్షకులు మాకు ఇచ్చిన గిఫ్ట్ ఇది'' అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను–మాన్'. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది జనవరి 12న విడుదలైంది. దాదాపు 300 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం 25 కేంద్రాల్లో వంద రోజుల ప్రదర్శనను పూర్తి చేసుకుందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'హను–మాన్' హిస్టారిక్ 100 డేస్ సెలబ్రేషన్స్‌లో తేజ సజ్జా మాట్లాడుతూ– ''దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్‌రెడ్డిగారిలోని ధైర్యాన్ని ఈ తరం స్ఫూర్తిగా తీసుకోవాలి. గట్స్ ఉన్నవాళ్లకే హిట్స్ వస్తాయి'' అన్నారు. ''ఇంద్ర, నువ్వు నాకు నచ్చావ్, పోకిరి' వంటివి.. నాకు బాగా గుర్తున్న వంద రోజుల వేడుకలు జరుపుకున్న సినిమాలు. అయితే ఇప్పుడు సినిమా అంటే ఓ వీకెండ్ అయిపోయింది. ఇలాంటి తరంలో వందో రోజు కూడా థియేటర్స్‌కు వచ్చి ఆడియన్స్ మా సినిమా చూస్తున్నారంటే అది మా అదృష్టంగా భావిస్తున్నాం. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయు)లో రాబోయే సినిమాల్లో అన్ని పరిశ్రమల నుంచి పెద్ద నటీనటులు కనిపిస్తారు'' అన్నారు ప్రశాంత్ వర్మ. ''నా కాలేజీ రోజుల్లో సినిమాల వంద రోజుల ఫంక్షన్స్ చూసేవాడిని. అలాంటిది నేను నిర్మించిన సినిమా వంద రోజులు జరుపుకోవడం హ్యాపీగా ఉంది'' అన్నారు నిరంజన్ రెడ్డి. ''హను–మాన్' వంద రోజుల వేడుక చేసుకోవడం హ్యాపీగా ఉంది''అన్నారు చైతన్య.

ఐమాక్స్ త్రీడీలో జై హనుమాన్... 'హను–మాన్'కు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానుంది. మంగళవారం (ఏప్రిల్ 23) హనుమాన్ జయంతి సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, భారీ వీఎఫ్‌ఎక్స్‌తో రూపొందించనున్న ఈ సినిమాను ఐమాక్స్ 3డీ వెర్షన్‌లో విడుదల చేయనున్నట్లు యూనిట్ పేర్కొంది.

ధర్మవీర్ శంభాజీ

ఛత్రపతి శివాజీ మహారాజ్ పెద్ద కుమారుడు శంభాజీ జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ఛావా'. ఈ చిత్రంలో శంభాజీ పాత్రను విక్కీ కౌశల్ చేస్తున్నారు తండ్రి శివాజీలానే శంభాజీని కూడా ధర్మవీర్ అని గౌరవించేవారు. అలాంటి గొప్ప పాత్ర కావడంతో ఫిజికల్ మేకోవర్ పరంగా, నటన పరంగా విక్కీ కౌశల్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ హిస్టారికల్ మూవీలో శంభాజీ భార్య ఏసుభాయి పాత్రలో రష్మికా మందన్నా కనిస్తారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాకు సంబంధించిన విక్కీ కౌశల్ లుక్ లీకై, సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాను డిసెంబరు 6న విడుదల చేసేలా చిత్రనిర్మాత దినేష్ విజన్ ప్లాన్ చేస్తున్నారట.


విక్కీ కౌశల్

సీత కష్టాలతో...


గరిమ, సుమన్ తేజ్

సుమన్ తేజ్, గరిమా చౌహాన్ జంటగా సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించిన చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ – ''యుగంధర్ నిర్మించిన 'సీతా కల్యాణ వైభోగమే' టైటిల్ చూస్తే, ఫీల్ గుడ్ మూవీలా కనిపిస్తోంది. మంచి కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు. ''కొన్ని వందల స్క్రిప్ట్స్ విన్నాం. ఫైనల్‌గా ఈ సినిమాతో జర్నీ మొదలైంది'' అన్నారు సుమన్ తేజ్. ''సీతమ్మ తల్లి పడ్డ కష్టాలు మనకు పూర్తిగా తెలియవు. ఈ చిత్రంలో నాలాంటి రావణ పాత్రతో సీత ఎలాంటి కష్టాలు పడిందో చూపించారు. సీత క్యారెక్టర్‌లో గరిమ చక్కగా నటించారు'' అన్నారు గగన్ విహారి. ''మహిళలు ఎదుర్కొనే సమస్యలను ఎమోషనల్ జర్నీగా చూపించాం'' అన్నారు సతీష్ పరమవేద. ''ఏ మాత్రం పారితోషికం ఆశించకుండా పని చేసిన సంగీతదర్శకుడు చరణ్ అర్జున్‌కు థ్యాంక్స్'' అన్నారు రాచాల యుగంధర్.

పడమటి కొండల్లో ప్రేమ


అనురోప్ కటారి

అనురోప్ కటారి హీరోగా నటిస్తున్న సినిమా 'పడమటి కొండల్లో...'. యశస్వి శ్రీనివాస్, శ్రావ్య రెడ్డి, మురళీ కృష్ణం రాజు, లతీష్ జవ్వాది, మురళీ రాజు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. నరేష్ పెంట దర్శకత్వంలో జయకృష్ణ దురుగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో సాయిదుర్గా తేజ్ 'ఎక్స్' వేదికగా విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా కొనసాగే ఈ సినిమాలోని లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా వినూత్నంగా ఉంటూ, ఓ విజువల్ ఫీస్ట్‌లా ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు ఈ చిత్ర దర్శకుడు– సంగీత దర్శకుడు నరేష్ పెంట.

సాక్షి బిజినెస్

బుధవారం
24-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 90	73,738
నిఫ్టీ ▲ 32	22,368

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,690	▲ 239
డోజోన్స్	38,498	▲ 258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,045	▲ 21
డాక్స్	18,138	▲ 277
షాంఘై	3,022	▽ 23
నికాయ్	37,552	▲ 114

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,598 ▽ 1,277
బంగారం (99.5 స్వచ్ఛత)	71,311 ▽ 1,272
వెండి (కేజీ)	80,007 ▽ 1,547

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయసిటర్	83.43	85.33
£	బ్రిటన్ పౌండ్	ధాయసిటర్	100.71	105.92
€	యూరో	ధాయసిటర్	86.64	91.36
¥	జపాన్ ఎన్ (100)	ధాయసిటర్	41.00	67.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధాయసిటర్	51.36	56.34
S$	సింగపూర్ డాలర్	ధాయసిటర్	58.79	63.65
SAR	సౌదీ రియాల్	ధాయసిటర్	21.31	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయసిటర్	21.78	23.62
¥	చైనా యువాన్	ధాయసిటర్	10.37	12.47

రేటు బదిలీలో ప్రభుత్వ బ్యాంకులే ముందు: ఆర్‌బీఐ



ముంబై: ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులలో (పీఎస్‌బీ) కీలక రేటు (రెపో) బదిలీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రచురించిన 2024 ఏప్రిల్ బులెటిన్ ఒకటి స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయంలో డిపాజిట్ రేట్ల పెంపు అధికంగా ఉంటే, రుణ రేట్లు ప్రైవేటు బ్యాంకుల కంటే తక్కువగా కొనసాగుతున్నట్లు తెలిపింది. ''ఏప్రిల్ 2023 నుండి ఫిబ్రవరి 2024 వరకు పరిశీలిస్తే.. ఆర్‌బీఐ రెపో రేటు బదలాయింపు ప్రక్రియ కొనసాగుతోంది. డిపాజిట్ల సమీకరణ అధిక రేట్ల వద్ద జరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది'' అని ఏప్రిల్ 5న ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర పేర్కొనడాన్ని బులెటిన్ ప్రస్తావించింది. కాగా దేశీయ ఎకానమీ పురోగతి బాటన పయనిస్తోందని అయితే వాతావరణ పరిణామాలు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఎకానమీకి సంబంధించిన మరో బులెటిన్‌లో ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు.

బీఎఫ్‌ఐతో ఐకేపీ నాలెడ్జ్ పార్క్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సైన్స్ పార్క్స్, ఇంక్యుబేటర్స్ సంస్థ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ తాజాగా బ్లాక్‌చెయిన్ ఫర్ ఇంపాక్ట్ (బీఎఫ్‌ఐ)తో జట్టు కట్టింది. బయోమెడికల్ విభాగంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు తోడ్పడేలా యువ ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించేందుకు ఈ వ్యూహాత్మక ఒప్పందం ఉపయోగపడనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	400-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380-00
విజయవాడ	380-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10


ఇక 'నిఫ్టీ నెక్స్ట్ 50' ఫ్యూచర్స్

నేటి నుంచి డెరివేటివ్ కాంట్రాక్టులు

ముంబై: నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ నేటి(బుధవారం) నుంచి 'నిఫ్టీ నెక్స్ట్ 50' సూచీ డెరివేటివ్ కాంట్రాక్టులు ప్రవేశపెడుతోంది. మూడు నెలల ఫ్యూచర్స్, ఆప్షన్స్ కాంట్రాక్టులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంచుతుంది. ప్రతినెలా చివరి శుక్రవారం ఈ కాంట్రాక్టుల గడువు ముగుస్తుంది. నిఫ్టీ 100లోని నిఫ్టీ 50 కంపెనీలు మినహా మిగితా కంపెనీలన్నీ ఈ సూచీలో ఉంటాయి. ఈ ఏడాది మార్చి 29 నాటికి ఈ సూచీలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.70 లక్షల కోట్లుగా ఉంది. ఎన్ఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువలో ఇది సుమారు 18%గా ఉంది. ఈ కాంట్రాక్టులపై అక్టోబర్ 31 వరకు ఎలాంటి ట్రాన్సాక్షన్ చార్జీలు ఉండవని ఎన్ఎస్ఈ పేర్కొంది.



మూడో రోజూ సూచీలు ముందుకే...



స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. సెన్సెక్స్ 90 పాయింట్లు పెరిగి 73,738 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32 పాయింట్లు బలపడి 22,368 వద్ద నిలిచింది. సూచీలకిది ఇది మూడో రోజూ లాభాల ముగింపు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 411 పాయింట్లు ఎగసి 74,060 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు దూసుకెళ్లి 22,448 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి. అయితే అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరులో లాభాల స్వీకరణ, క్రూడాయిల్ ధరల రికవరీ, విదేశీ ఇన్వెస్టర్లు విక్రయాలతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. టెలికం, రియల్టీ, యుటిలిటీ, కన్జూమర్, కమోడిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. మెటల్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

- ఫాలోఆన్ఆఫర్(ఎఫ్‌పీఓ) ద్వారా రూ.18వేల కోట్లు సమీకరించడంతో వొడాఫోన్ ఐడియా షేరు 12% పెరిగి రూ.14.39 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ఎగసి రూ.14.42 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

భారీగా తగ్గిన పసిడి ధర



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రికత్తలు తగ్గుముఖం పట్టడం, భారీగా పెరిగిన ధర వద్ద లాభాల స్వీకరణ పసిడి ధర్‌పై తాజాగా ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా దేశంలో బంగారం ధరలు మంగళవారం భారీగా తగ్గాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర రూ.1,450 తగ్గి రూ.72,200కు దిగివచ్చింది. కేజీ వెండి ధర రూ.2,300 తగ్గి, రూ.83,500కు చేరింది. కాగా ఆర్థిక రాజధాని ముంబైలో 99.9, 99.5 స్వచ్ఛత ధరలు వరుసగా రూ.1,277, రూ.1,272 తగ్గి రూ.71,598, 71,311కు దిగివచ్చాయి. వెండి కేజీ రూ.1,547 మైనస్‌తో రూ.80,007కు తగ్గింది.కాగా పసిడి ఫ్యూచర్ మార్కెట్లలో సైతం క్రితం ముగింపుతో పోలిస్తే నష్టాల్లో ట్రేడవుతోంది.

ఫోక్స్‌వ్యాగన్ టైగున్ కొత్త వేరియంట్లు



చెన్నై: వాహన తయారీలో ఉన్న జర్మనీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ తాజాగా స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ టైగున్ కొత్త వేరియంట్లను భారత్‌లో ప్రవేశపెట్టింది. 1.0 లీటర్ టీఎస్ఐ ఇంజిన్‌తో టైగున్ జీటీ లైన్‌ను అందుబాటులోకి తెచ్చింది. 6 స్పీడ్ ఆటోమేటిక్, 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో ఇది లభ్యం. ఎక్స్‌షోరూం ధర రూ.14.08 లక్షలు. అలాగే టైగున్ జీటీ ప్లస్ స్పోర్ట్ వేరియంట్‌ను 1.5 లీటర్ టీఎస్ఐ ఇంజన్‌తో పరిచయం చేసింది. 6 స్పీడ్ మాన్యువల్, 7 స్పీడ్ డైరెక్ట్ షిఫ్ట్ గేర్‌బాక్స్ (డీఎస్‌జీ) ట్రాన్స్‌మిషన్‌తో రూపొందింది. ఎక్స్‌షోరూం ధర రూ.18.53 లక్షలు.

ఎయిర్‌టెల్ రోమింగ్ రూ.133

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్స్‌ను అందుబాటు ధరలో ప్రవేశపెట్టింది. టారిఫ్ రోజు కు రూ.133 నుంచి ప్రారంభం. అధిక డేటా ప్రయోజనాలు, ఇన్-ఫ్లైట్ కనెక్టివిటీ, 24 గంటలు కస్టమర్ కేర్ సేవలు అందుబాటులో ఉంటాయి.

టాటా కన్జూమర్ లాభం డౌన్

క్యూ4లో రూ. 212 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ కన్సాలిడేటెడ్ నికర లాభం మార్చి త్రైమాసికంలో 27% క్షీణతతో రూ. 212 కోట్లకు పరిమితమైంది. ఇందుకు ఇతర సంస్థల కొనుగోళ్లు, విలీన వ్యయాలు, ఆస్తుల విలువ తగ్గింపు, ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్స్ నష్టాలు తదితర అంశాలు ప్రభావం చూపాయి.

పూర్తి ఏడాదికి

గత ఆర్థిక సంవత్సరంలో టాటా కన్జూమర్ నికర లాభం రూ. 1,215 కోట్లకు పరిమితమైంది. 2022–23లో రూ. 1,320 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 13,783 కోట్ల నుంచి రూ. 15,206 కోట్లకు జంప్‌చేసింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. కాగా, క్యూ4లో టాటా స్టార్‌బక్స్ కొత్తగా 29 స్టోర్లను ఏర్పాటు చేసింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్ఎస్ఈలో నామమాత్ర లాభంతో రూ. 1,172 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో జీసీసీపై 'హిటాచీ' కసరత్తు



ఎండీ ఎస్ వేణు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైల్వేలు, యుటిలిటీస్ తదితర రంగాల సంస్థల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, హై వోల్టేజీ ఉత్పత్తులు మొదలైనవి తయారు చేసే హిటాచీ ఎనర్జీ హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. ఆరు నెలల నుంచి ఏడాది వ్యవధిలో దీనిపై ఒక నిర్ణయానికి రావచ్చని, పుణే కూడా పరిశీలనలో ఉందని సంస్థ ఇండియా ఎండీ ఎస్ వేణు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమకు గణనీయంగా కార్యకలాపాలు ఉన్నాయని, పరిశ్రమ సంబంధ సాంకేతికతల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించేందుకు వరంగల్ ఎన్ఐటీతో కూడా జట్టు కట్టామని ఆయన పేర్కొన్నారు.

సైయంట్ డీఎల్ఎం లాభం రూ. 61 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరంలో సైయంట్ డీఎల్ఎం నికర లాభం (కన్సాలిడేటెడ్) సుమారు 93 శాతం పెరిగి రూ. 32 కోట్ల నుంచి రూ. 61 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 838 కోట్ల నుంచి రూ. 1,220 కోట్లకు పెరిగింది. క్యూ4లో ఆదాయం రూ. 276 కోట్ల నుంచి రూ. 370 కోట్లకు, లాభం రూ. 12.5 కోట్ల నుంచి రూ. 23 కోట్లకు పెరిగింది.

మహీంద్రా ఫైనాన్స్‌లో రూ. 150 కోట్ల మోసం

ఆర్థిక ఫలితాలు మే 30కి వాయిదా



న్యూఢిల్లీ: ఆర్థిక సేవల సంస్థ మహీంద్రా ఫైనాన్స్ రుణాల పోర్ట్‌ఫోలియోలో దాదాపు రూ. 150 కోట్ల మోసం బైటపడింది. ఈశాన్య రాష్ట్రాల్లోని ఒక శాఖలో ఇది చోటుచేసుకున్నట్లుగా గుర్తించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నాలుగో త్రైమాసికం, పూర్తి సంవత్సర ఆర్థిక ఫలితాల వెల్లడిని మే 30కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. బోర్డు సమావేశాన్ని కూడా అదే రోజునకు రీ-షెడ్యూల్ చేసినట్లు వివరించింది. రిటైల్ వాహన రుణాల మంజూరులో కేవైసీ డాక్యుమెంట్లను ఫోర్జరీ చేయడం ద్వారా నిధులను పక్కదారి పట్టించారని గుర్తించినట్లు స్టాక్ ఎక్స్చేంజీలకు కంపెనీ తెలిపింది. దీనిపై ప్రస్తుతం విచారణ తుది దశలో ఉన్నట్లు వివరించింది. అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నామని, కొందరు వ్యక్తులను అరెస్టు చేయడం సహా చర్యల అమలు వివిధ దశల్లో ఉందని మహీంద్రా ఫైనాన్స్ పేర్కొంది.

తాజా పరిణామాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో మంగళవారం 5 శాతం పైగా క్షీణించి రూ. 263.60 వద్ద క్లోజయ్యింది.

భవిత

జాబ్ పాయింట్

నవోదయ విద్యాలయ సమితి, భోపాల్‌లో 500 టీజీటీ, పీజీటీ పోస్టులు

భోపాల్‌లోని నవోదయ విద్యాలయ సమితి.. ఒప్పంద ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేస్తారు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 500
- » **పోస్టుల వివరాలు:** టీజీటీ–283, పీజీటీ–217.
- » **ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ):** **సబ్జెక్టులు:** హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఒరియా, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, ఆర్ట్, ఒకేషనల్, లైబ్రేరియన్. **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.
- » **పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ):** **సబ్జెక్టులు:** హిందీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, కామర్స్. **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు పీజీటీలకు రూ.42,250, టీజీటీలకు రూ.40,625.
- » **వయసు:** 01.07.2024 నాటికి 50 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలు, అవార్డులు, పని అనుభవం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.04.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.04.2024
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 16.05.2024 నుంచి
- » **వెబ్‌సైట్:** https://navodaya.gov.in

నావల్ డాక్‌యార్డ్‌లో 301 అప్రెంటిస్‌లు

ముంబైలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ).. నావల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్.. వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 301
- » **ఖాళీల వివరాలు:** ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్–288; రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్–13.
- » **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీ మ్యాన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్ రైట్(ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్(బీసీ), ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
- » **అర్హత:** ఎనిమిది, పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** కనిష్ఠ వయసు 14 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.04.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024
- » **వెబ్‌సైట్:** https://indiannavy.nic.in

సీఎమ్ఎస్ఎస్, న్యూఢిల్లీలో 15 పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ(సీఎమ్ఎస్ఎస్)..ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్–05, మేనేజర్–08, ఆఫీస్ అసిస్టెంట్–01, వేర్‌హౌస్ మేనేజర్–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఏ, ఎంఎస్సీ, బీకాం, బీఫార్మా, ఎంఫార్మా, బీఈ, బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,00,000, మేనేజర్, వేర్‌హౌస్ పోస్టులకు రూ.50,000, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో తమ డేటాను ది జనరల్ మేనేజర్(అడ్మినిస్ట్రేషన్, సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ, రెండో ఫ్లోర్, విశ్వయువక్ కేంద్ర, టీస్ మూర్తి మార్గ్, చాణక్యపురి, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024.
- » **వెబ్‌సైట్:** https://cmss.gov.in

ఇర్కాన్ న్యూఢిల్లీలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- » **అర్హత:** డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 1,40,000
- » **దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024.
- » **వెబ్‌సైట్:** https://www.ircon.org

బీటెక్.. మారుతోంది!

- » టెక్నాలజీ రంగంలో వేగంగా మార్పులు
- » విస్తృతమవుతున్న ఇండస్ట్రీ 4.0 కార్యకలాపాలు
- » కోర్‌తోపాటు లేటెస్ట్ టెక్నాలజీస్‌పై పట్టు తప్పనిసరి
- » జాబ్ మార్కెట్‌కు తగ్గ స్కిల్స్ ఉంటేనే కొలువులు

బీటెక్.. లక్షల మంది విద్యార్థుల స్వప్నం! బీటెక్ పూర్తి చేసుకుంటే.. జాబ్ మార్కెట్‌లో అవకాశాలు స్వాగతం పలుకుతాయనే అభిప్రాయం. బీటెక్‌తో కెరీర్‌లో త్వరగా స్థిరపడొచ్చు..సుస్థిర భవిష్యత్తుకు మార్గం వేసుకోవచ్చనే బావన!! అందుకే ఏటా లక్షల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు కృషి చేస్తున్న పరిస్థితి! ఎంట్రన్స్‌లలో ర్యాంకుతో బీటెక్‌లో చేరగానే లక్ష్యం నెరవేరినట్లు కాదు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు పెంచుకుంటేనే అవకాశాలు అంటున్నారు నిపుణులు!! ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్ విద్యలో తాజా ట్రెండ్స్, పెంచుకోవాల్సిన స్కిల్స్‌పై ప్రత్యేక కథనం..

టెక్నాలజీ రంగంలో చాలా వేగంగా మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీలైన ఐవోటీ, ఏఐ, బిగ్ డేటా, రోబోటిక్స్, ఆటోమేషన్‌ల ప్రాధాన్యం పెరుగుతోంది. దీంతో.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ లేటెస్ట్ స్కిల్స్ సొంతం చేసుకుంటేనే అవకాశాలు దక్కే పరిస్థితి కనిపిస్తోంది.

డిజిటలైజేషన్

ప్రభుత్వ విభాగాలు నుంచి కార్పొరేట్ సంస్థల వరకూ.. నేడు అన్ని చోట్లా డిజిటలైజేషన్‌కు పెద్ద పీట వేస్తున్నారు. డిజటలైజేషన్ ఆధారిత కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్నాయి. నాస్‌కామ్ అంచనా ప్రకారం-వచ్చే కొన్నేళ్లలో భారత ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) మార్కెట్ తారాస్థాయికి చేరుకోనుంది. అంతే స్థాయిలో ఈ విభాగంలో నైపుణ్యాలు కలిగిన యువతకు డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి బీటెక్ విద్యార్థులు ఐఓటీ నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

పునరుత్పాదక ఇంధనం

జాతీయ స్థాయిలో పునరుత్పాదక శక్తి రంగానికి ప్రోత్సాహమిచ్చేలా ప్రభుత్వ విధానాలు అమలవుతున్నాయి. కాబట్టి రెన్యువబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్, సోలార్ పవర్, ఎనర్జీ ఎఫిషియన్సీ విభాగాలు బీటెక్ విద్యార్థులకు కెరీర్ అవకాశాలు కల్పించనున్నాయి. ఈ విభాగాలపై ఆసక్తి పెంచుకొని నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

డేటాసైన్స్ అండ్ అనాలిసిస్

తాజాగా మాన్యుఫ్యాక్చరింగ్, సేవలు, బ్యాంకింగ్.. ఇలా అన్ని రంగాల్లోనూ కార్యకలాపాల నిర్వహణలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న మరో విభాగం.. డేటా సైన్స్ అండ్ అనాలిసిస్. సంస్థలు బిగ్ డేటా ఆధారిత సమాచారవిశ్లేషణ ద్వారా వినియోగదారులను పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. కాబట్టి డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, అనలిటిక్స్ విభాగాల్లో నైపుణ్యాలను సొంతం చేసుకున్న వారికి జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది.

సైబర్ సెక్యూరిటీ

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో.. బీటెక్ అభ్యర్థులకు అవకాశాలు కల్పించడంలో సైబర్ సెక్యూరిటీ ముందుంటోంది. ముఖ్యంగా ఈ-కామర్స్, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్.. ఇలా అన్ని రంగాల్లోనూ ఇంటర్నెట్ ఆధారిత ఆన్‌లైన్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. అవి సాఫీగా సాగేందుకు వీలుగా పటిష్ఠ భద్రత కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో.. థ్రెట్ డిటెక్షన్, ఎథికల్ హ్యాకింగ్, డేటా ప్రొటెక్షన్ వంటి సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలున్న వారికి చక్కటి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

నైపుణ్య మార్గాలు!

దేశంలో ఇంజనీరింగ్, సాంకేతిక విభాగాల్లో ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ వంటివి కీలకంగా మారుతున్న నేపథ్యంలో.. ఈ స్కిల్స్‌ను పెంచుకునే మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. పలు ఇన్‌స్టిట్యూట్స్ బీటెక్ స్థాయిలోనే ఏఐ-ఎంఎల్ బ్రాంచ్‌తో ప్రత్యేక ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాయి. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్స్ ఎంటెక్ స్థాయిలో వీటిని ప్రవేశపెట్టాయి. ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌కు సంబంధించి ఐబీఎం, సిస్కో, మైక్రోసాఫ్ట్, వీఎం వేర్, ఇంటెల్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు.. ఆటోమేషన్, ఐఓటీ పరిధిలోని పలు విభాగాల్లో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి.

మూక్స్‌తో లేటెస్ట్ టెక్నాలజీ

ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకునేందుకు మరో మార్గం.. మూక్స్(మాసివ్‌లీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్). అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానంలో కోర్సులను అందిస్తున్నాయి. ఈ మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినే అవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది. ఫలితంగా విద్యార్థులు తాజా పరిశోధనలు, టెక్నాలజీ, పరిణామాలు, ప్రాక్టికల్ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.



స్టార్ట్-అప్ ఎకో సిస్టమ్

దేశంలో స్టార్ట్-అప్ ఎకో సిస్టమ్ విస్తరిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులతో పోల్చుకుంటే.. భారత్ స్టార్ట్-అప్స్‌కు అనుకూలంగా మారుతోంది. ఫలితంగా బీటెక్ విద్యార్థులు తమ ఆవిష్కరణలకు రూపమిచ్చేందుకు ఎన్నో మార్గాలు, ప్రోత్సాహకాలు అందుబాటులోకి వస్తున్నాయి. స్టార్ట్-అప్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి స్కీమ్‌ల ద్వారా ఔత్సాహిక ఎంట్రప్రెన్యూర్స్‌కు ఫండింగ్ లభిస్తోంది. దీంతో.. స్టార్ట్-అప్ ఆలోచన లున్న బీటెక్ విద్యార్థులు వీటిని అందిపుచ్చుకునేలా కృషి చేస్తే తమ ఐడియాలను విజయవంతమైన వెంచర్స్‌గా మార్చుకోవచ్చు.

నిరంతర అధ్యయనం, పరిశీలన

విద్యార్థులు నిరంతరం అధ్యయనం, పరిశీలన దృక్పథాన్ని అలవరచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సబ్జెక్ట్‌ను చదవడానికే పరిమితం కాకుండా.. అప్లికేషన్ అప్రోచ్‌ను పెంచుకోవాలంటున్నారు. బీటెక్ విద్యార్థులు లేటెస్ట్ టెక్నాలజీపై ప్రాజెక్ట్ వర్క్, మినీ ప్రాజెక్ట్ వర్క్‌లు చేయాలని సూచిస్తున్నారు. దీనివల్ల తాజా సాంకేతికతపై అకడమిక్ దశలోనే ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతమవుతాయి. అదే విధంగా.. కొత్త టెక్నాలజీకి సంబంధించి ఇండస్ట్రీ వర్గాలు తీసుకుంటున్న చర్యలు, వాటిని అమలు చేస్తున్న తీరును పరిశీలించి.. దానికి అనుగుణంగా తమ స్కిల్స్‌కు పదును పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

ఆర్ అండ్ డీ


రీసెర్చ్, డెవలప్‌మెంట్(ఆర్ అండ్ డీ)పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవకాశాలు, ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయి. ఐఐటీలు, నిట్‌లు తదితర ప్రభుత్వ రంగ ఇన్‌స్టిట్యూట్స్, అదే విధంగా పరిశోధన లేబొరేటరీలు, కార్పొరేట్ రీసెర్చ్ ల్యాబ్స్ వంటివి పరిశోధనలకు వేదికలుగా నిలుస్తున్నాయి. బయో టెక్నాలజీ, నానో టెక్నాలజీ, ఏరోస్పేస్.. ఇలా విభిన్న విభాగాల్లో రీసెర్చ్‌కు అవకాశాలు లభిస్తున్నాయి.

ఎలక్ట్రిక్ వెహికిల్ రంగం

ఇంజనీరింగ్, సాంకేతిక విభాగాల్లో వేగంగా ముందుకొస్తున్న మరో విభాగం.. విద్యుత్ వాహన రంగం(ఎలక్ట్రిక్ వెహికిల్ సెగ్మెంట్). దేశంలో 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహన వినియోగాన్ని పెంచేలా కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్ పేరుతో ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు పలు రాయితీలు అందిస్తోంది. ఫేమ్ స్కీమ్‌తో పలు రాయితీలను ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విభాగానికి సంబంధించిన నైపుణ్యాలు సొంతం చేసుకుంటే అవకాశాలు అందుకోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈవీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్, హార్డ్‌వేర్ ఇంజనీర్స్, ఏఐ అండ్ డేటా ఇంజనీర్స్, బ్యాటరీ ఇంజనీర్స్, టెక్నాలజీ కన్సల్టెంట్స్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు.

స్పేస్ టెక్నాలజీ

స్పేస్ టెక్నాలజీ.. ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న మాట. అంతరిక్ష పరిశోధనల దిశగా దేశం ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఇస్రో పలు ప్రయోగాలు, పరిశోధనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే విధంగా ఈ సెగ్మెంట్‌లో ప్రైవేట్ ఆపరేటర్స్‌కు సైతం ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. దీంతో.. బీటెక్ ఉత్తీర్ణులు స్పేస్ టెక్నాలజీ రంగంలో శాటిలైట్ కమ్యూనికేషన్, ఎర్త్ అబ్జర్వేషన్, డేటా అనాలిసిస్, రిమోట్ సెన్సింగ్ వంటి విభాగాల్లో కొలువులను సొంతం చేసుకోవచ్చు.



మీ షూ సైజు ఎంత? యూకే సైజులో అయితే ఈ నంబర్.. యూఎస్ సైజులో అయితే ఈ నంబర్ అని చెబుతాం.. చాలా చెప్పుల షాపుల్లో ఈ నంబర్లే నడుస్తున్నాయి. ఎప్పుడైనా ఆలోచించారా? మన పాదాల సైజు గురించి చెప్పేందుకు.. వేరే దేశాల నంబర్లపై ఎందుకు ఆధారపడుతున్నామో.. మన దేశానికి సొంత ఫుట్‌వేర్ సైజుల నంబర్ ఎందుకు లేదో? ఇకపై ఆ సీన్ మారనుంది. ఎందుకంటే.. త్వరలోనే అప్నా నంబర్ బీ అయేగా..

యూకే, యూఎస్ నంబర్లకు చెల్లు..

త్వరలో 'భా' పేరిట అమల్లోకి భారత ఫుట్‌వేర్ సైజుల విధానం

దేశానికి స్వాతంత్య్రం ముందు బ్రిటిష్ వాళ్లు వారి ఫుట్‌వేర్ సైజుల విధానాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం సగటు భారత మహిళ 4 నుంచి 6 సైజుల మధ్య ఉండే పాదరక్షలను ధరిస్తోంది. అలాగే సగటు పురుషుడు 5 నుంచి 11 సైజుల మధ్య ఉండే ఫుట్‌వేర్‌ను వేసుకుంటున్నాడు. అయితే భారతీయుల అవసరాలకు అనుగుణంగా పాద రక్షల కొలతల వివరాలు లేవు.. దీంతో ఇప్పటివరకు మనకంటూ ప్రత్యేక విధానం లేకుండాపోయింది. అయితే ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల భారత్‌లో ఏటా సగటు భారతీయుడు 1.5 జతల పాదరక్షలను కొనుగోలు చేస్తున్నాడు. అంటే ఎన్ని కోట్ల జతలో చూడండి. అలాగే షూ తయారీపరంగా కూడా భారత్ అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. కానీ ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా వచ్చే పాదరక్షల్లో 50 శాతం తమకు సరిపోవట్లేదని వినియోగదారులు తిరస్కరిస్తున్నారని పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో భారత ఫుట్‌వేర్ సైజుల విధానాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా దేశవ్యాప్తంగా ఇటీవల భారతీయుల పాదాల సైజులపై ఓ సర్వే జరిగింది. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎల్ఆర్ఐ) ఈ అధ్యయనం చేపట్టింది. ఈ సైజుల విధానానికి 'భా'(భారత్) అనే పేరు పెట్టాలని భావిస్తున్నారు. దేశంలో ఫుట్‌వేర్ తయారీకి ఇకపై ఈ సైజులే కొలమానం కానున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న యూకే/యూరో పియన్, యూఎస్ సైజులను 'భా' భర్తీ చేయనుంది.

అప్పుడెప్పుడో బ్రిటిష్‌వాళ్లు..

భారత్‌లో వివిధ జాతుల ప్రజలు ఉండటం.. పైగా.. ఈశాన్య భారతానికి చెందిన ప్రజల పాదాలు దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజల పాదాలకన్నా కాస్త చిన్నవిగా ఉంటాయి కాబట్టి.. దేశంలో కనీసం 5 రకాల ఫుట్‌వేర్ సైజుల పద్ధతి అవసరమవుతుందని ఈ సర్వేకు ముందు భావించారు. తర్వాత అందరికీ ఒకే ఫుట్‌వేర్ సైజు సరిపోతుందని తేల్చారు. 2021 డిసెంబర్ నుంచి 2022 మార్చి మధ్య దేశవ్యాప్తంగా లక్ష మంది ప్రజల షూ కొలతలకు సంబంధించి సర్వే నిర్వహించారు. పాదాల సైజు, వాటి నిర్మాణ తీరు, సగటు భారతీయుల పాదాల ఆకారం గురించి మరింత మెరుగ్గా అర్థం చేసుకొనేందుకు 3డీ ఫుట్ స్కానింగ్ మెషీన్లను సర్వే కోసం ఉపయోగించారు. దీని ప్రకారం సగటు భారతీయ మహిళ పాదం 11 ఏళ్ల వయసులోనే గరిష్ట సైజుకు చేరుకుంటుందని తేలింది. అలాగే సగటు పురుషుడి పాదం 15 లేదా 16 ఏళ్లకు గరిష్ట సైజుకు చేరుకుంటోందని వెల్లడైంది. అలాగే భారతీయుల పాదాలు యూరోపియన్లు లేదా అమెరికన్ల పాదాలకన్నా వెడల్పుగా ఉంటాయని సర్వే నిర్ధారించింది. ఇన్నేళ్లుగా యూకే, యూరోప్, యూఎస్ పాదాల సైజుల ప్రకారం వెడల్పు తక్కువగా ఉండే ఫుట్‌వేర్ తయారవుతుండటంతో భారతీయులంతా ఇప్పటివరకు బిగుతుగా ఉన్న పాదరక్షలు ధరిస్తున్నారని.. బిగుతుగా ఉండటంతో కొందరు తమ పాదాల కన్నా పొడవైన పాదరక్షలు కొనుక్కుంటున్నారని తేలింది. ముఖ్యంగా హై హీల్స్ వాడే మహిళలు వారి పాదాల సైజుకన్నా పెద్దవైన హైహీల్స్‌నే వాడుతున్నారని.. ఇవి అసౌకర్యంగా, గాయాలకు దారితీసేలా ఉన్నాయని కూడా సర్వేలో వెల్లడైంది. ఇక మగవారైతే షూ వదులుగా ఉండకుండా చూసుకొనేందుకు లేస్‌లను మరింత గట్టిగా కడుతున్నారు. ఇది షూ ధరించే వారిలో సాధారణ రక్త ప్రసరణను దెబ్బతీస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, షుగర్ వ్యాధితో బాధపడేవారు ఇలా తమ సైజులకు నప్పని పాదరక్షలు ధరిస్తూ గాయాల ముప్పును ఎదుర్కొంటున్నారని తేలింది.



3డీ ఫుట్ స్కానింగ్ మెషీన్

సర్వేలో ఏం తేలింది?

ఈ నేపథ్యంలో 'భా' అందుబాటులోకి వస్తే అది వినియోగదారులకు, పాదరక్షల తయారీదారులకు లాభం చేకూర్చనుంది. ఈ సర్వే ఆధారంగా చేసిన సిఫార్సులను కేంద్ర వాణిజ్య శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ)కి సమర్పించింది. ఆ విభాగం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)కు ఈ సిఫార్సులను పంపింది. దేశంలో సైజుల విధానానికి అనుమతి తెలపడంతోపాటు దాన్ని అమలు చేసే అధికారం బీఐఎస్‌కే ఉంది. ప్రస్తుతం యూకే కొలతల ప్రకారం 10 సైజుల విధానం అమల్లో ఉండగా 'భా' వల్ల వాటి సంఖ్య 8కి తగ్గనుంది. దీనివల్ల ఇకపై అర సైజుల అవసరం కూడా తప్పనుంది. వచ్చే ఏడాదిలో 'భా' విధానం అమల్లోకి వస్తుందని అంచనా.

- సాక్షి సెంట్రల్ డెస్క్

నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

జూన్ 12న పునఃప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు అన్ని రకాల మేనేజ్‌మెంట్ల పరిధిలోని స్కూళ్లకు సెలవులు ఇస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో స్కూళ్లకు మంగళవారమే చివరి పనిదినంగా ఉంది. ఈ సందర్భంగా మంగళవారం ఇటీవల ముగిసిన సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షల ఫలితాలను స్కూళ్లలో ప్రకటించారు.

సీసీఎస్‌కు రూ.150 కోట్లు

- బకాయిలు చెల్లించిన ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులు నిర్వహించే సహకార పరపతి సంఘానికి ఎట్టకేలకు టీఎస్ఆర్టీసీ రూ.150 కోట్ల బకాయిలు చెల్లించింది. ఆర్టీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు, నిర్ధారిత బకాయిలు చెల్లించని పక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఐదుగురు ముఖ్య అధికారులు స్వయంగా కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొంది. 25లోగా బకాయిలు చెల్లించాలని తేల్చి చెప్పటంతో సంస్థ దిగొచ్చింది. మంగళవారం రూ.150 కోట్లను చెల్లించింది.

రూ.1,100 కోట్లకుపైగా బకాయిలు..

ఆర్టీసీ ఉద్యోగులు ప్రతినెలా కొంత మొత్తాన్ని సహకార పొదుపు సంఘానికి (సీసీఎస్) చెల్లిస్తారు. 12 ఏళ్లుగా సంస్థ సీసీఎస్ నిధులను సొంతానికి వాడుకోవడం ప్రారంభించింది. పదేళ్లలో ఆ నిధులు ఖాళీ అవటంతో సీసీఎస్ పూర్తిగా నిర్వీర్యమైంది. వడ్డీ కలుపుకొంటే దాదాపు రూ.1,100 కోట్లకుపైగా ఆర్టీసీ బకాయి పడింది. రెండున్నరేళ్ల క్రితం ఆ బకాయిలు రూ.400 కోట్లుగా ఉన్న సమయంలో సీసీఎస్ హైకోర్టును ఆశ్రయించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	114	73,853
నిఫ్టీ ▲	34	22,402

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,750	▲	54
డోజోన్స్	38,517	▲	13
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,040	▼	4
డాక్స్	18,089	▼	49
షాంఘై	3,045	▲	23
నికాయ్	38,460	▲	908

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,826 ▲	228
బంగారం (99.5 స్వచ్ఛత)	71,538 ▲	227
వెండి (కిలో)	80,687 ▲	680

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.17	84.19
£	బ్రిటన్ పౌండ్	102.67	105.22
€	యూరో	87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)	47.00	62.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.57	54.49
S$	సింగపూర్ డాలర్	59.20	63.40
SAR	సౌదీ రియాల్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	21.84	23.61
¥	చైనా యువాన్	10.39	12.39

కోటక్ బ్యాంక్‌కు ఆర్‌బీఐ షాక్..

- ఆన్‌లైన్‌లో కస్టమర్లను చేర్చుకోవద్దని ఆదేశం
- కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయొద్దని ఆంక్షలు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ షాకిచ్చింది. ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ మాధ్యమాల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవద్దని ఆదేశించింది. అలాగే కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయి. బ్యాంకు ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో 'తీవ్రమైన లోపాలు' బయటపడటం ఇందుకు కారణమని ఆర్‌బీఐ పేర్కొంది. అయితే, క్రెడిట్ కార్డు కస్టమర్లు సహా ప్రస్తుతమున్న ఖాతాదారులందరికీ బ్యాంకు యథా ప్రకారం సేవలు అందించడాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. మే 4న కోటక్ మహీంద్రా బ్యాంకు ఆర్థిక ఫలితాలను వెల్లడించనున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

బ్యాంకు ఎక్స్‌టర్నల్ ఆడిట్‌ను నిర్వహించి, అందులో బయటపడే సమస్యలను, తాము గుర్తించిన లోపాలను పరిష్కరిస్తే ఆంక్షలను సమీక్షిస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.



పదే పదే సాంకేతిక అంతరాయాలు తలెత్తుతున్న కారణంగా 2020 డిసెంబర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై కూడా ఆర్‌బీఐ దాదాపు ఇదే తరహా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

ఐటీ సంబంధ తనిఖీలో కీలకాంశాలు

2022, 2023 సంవత్సరాల్లో నిర్వహించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంబంధ తనిఖీల్లో తీవ్ర ఆందోళనకరమైన అంశాలను గుర్తించినట్లు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. 'ఐటీ ఇన్వెంటరీ నిర్వహణ, యూజర్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, వెండార్ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా సెక్యూరిటీ వంటి అంశాల్లో తీవ్రమైన లోపాలు, నిబంధనలను పాటించకపోవడం మొదలైన వాటిని గుర్తించాం' అని వివరించింది. వాటిని సమగ్రంగా, సకాలంలో పరిష్కరించడంలో బ్యాంకు నిరంతరం వైఫల్యం చెందుతున్న కారణంగా తాజా చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ తెలిపింది.

పటిష్టమైన ఐటీ మౌలిక సదుపాయాలు, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ లేకపోవడం వల్ల కోర్ బ్యాంకింగ్ సిస్టం (సీబీఎస్), ఆన్‌లైన్ .. డిజిటల్ బ్యాంకింగ్ మాధ్యమాలు గత రెండేళ్లుగా తరచూ మొరాయిస్తూ, కస్టమర్లను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయని వివరించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15న కూడా ఇదే తరహా ఘటన చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకుకు సంబంధించిన నిర్దిష్ట వ్యాపార విభాగాలపై ఆంక్షలు విధించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

స్పీడ్ తగ్గిన హెచ్‌యూఎల్

- లాభం రూ. 2,561 కోట్లు
- రూ. 24 తుది డివిడెండ్



న్యూఢిల్లీ: నాలుగో త్రైమాసికంలో హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) నికర లాభం స్వల్పంగా తగ్గి (1.53%) రూ. 2,561 కోట్లుగా నమోదైంది. తాజా సమీక్షాకాలంలో ఆదాయం రూ. 15,375 కోట్ల నుంచి స్వల్ప వృద్ధితో రూ. 15,441 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 11,962 కోట్ల నుంచి రూ. 12,100 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ. 61,092 కోట్ల నుంచి రూ. 62,707 కోట్లకు చేరింది. లాభం రూ. 10,143 కోట్లుగా నమోదైంది. బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు.. రూ.1 ముఖ విలువ చేసే షేరు ఒక్కింటికి రూ. 24 చొప్పున తుది డివిడెండ్ ఇవ్వాలని ప్రతిపాదించింది. తాత్కాలిక డివిడెండ్ రూ. 18 కూడా కలిపితే పూర్తి సంవత్సరానికి మొత్తం మీద ఒక్కో షేరుకి రూ. 42 డివిడెండ్ ఇచ్చినట్లవుతుందని సంస్థ తెలిపింది.

బుధవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ. 2,259.15 వద్ద క్లోజయ్యింది.

యాక్సిస్ లాభం రూ. 7,129 కోట్లు

- క్యూ4లో ఆదాయం రూ. 35,990 కోట్లు
- రూ. 1 డివిడెండు



ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 7,129 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2022–23 క్యూ4లో బ్యాంకు రూ. 5,728 కోట్ల నికర నష్టం నమోదు చేసింది. ఇక తాజాగా ఆదాయం రూ. 28,758 కోట్ల నుంచి రూ. 35,990 కోట్లకు ఎగిసింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 11 శాతం పెరిగి రూ. 13,089 కోట్లుగా నమోదైంది. మరోవైపు, 2023–24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు నికర లాభం 160 శాతం పెరిగి రూ. 24,861 కోట్లకు చేరింది. వ్యాపార పరిమాణం 12% వృద్ధి చెంది రూ. 14,77,209 కోట్లకు ఎగిసింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ. 2 ముఖ విలువ గల షేరుపై రూ. 1 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని బ్యాంకు బోర్డు నిర్ణయించింది. సిటీ బ్యాంకు వ్యాపార కార్యకలాపాలను అనుసంధానం చేసే ప్రక్రియ వచ్చే ఆరు నెలల్లో పూర్తి కావచ్చని బ్యాంకు సీఈవో అమితాబ్ చౌదరి తెలిపారు. భారత్‌లో సిటీబ్యాంక్ కన్జూమర్ వ్యాపారాన్ని యాక్సిస్ బ్యాంక్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

మరిన్ని విశేషాలు..

- స్థూల మొండి బాకీలు 2.02% నుంచి 1.43 శాతానికి తగ్గాయి.
- పూర్తి ఆర్థిక సంవత్సరంలో 475, నాలుగో క్వార్టర్లో 125 శాఖలను తెరవడంతో దేశీయంగా మొత్తం బ్రాంచీల నెట్‌వర్క్ 5,377కి చేరింది.
- మార్చి క్వార్టర్‌లో 12.4 లక్షల క్రెడిట్ కార్డులను కొత్తగా జారీ చేయడం ద్వారా గత తొమ్మిది క్వార్టర్లలో దేశీయంగా అత్యధిక సంఖ్యలో క్రెడిట్ కార్డులను జారీ చేసిన బ్యాంకుల్లో ఒకటిగా బ్యాంక్ నిల్చింది.

బుధవారం బ్యాంకు షేరు బీఎస్‌ఈలో 0.69% పెరిగి రూ. 1,063.70 వద్ద క్లోజయ్యింది.

ఎల్‌టీఐ మైండ్‌ట్రీ లాభం రూ.1,101 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 1.2 శాతం క్షీణించి రూ.1,101 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 2.32 శాతం ఎగసి రూ.8,893 కోట్లను తాకింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 4 శాతం అధికమై రూ.4,584 కోట్లు సాధించింది. టర్నోవర్ 7 శాతం దూసుకెళ్లి రూ.35,517 కోట్లకు చేరింది. ఆర్డర్ బుక్ 15.7 శాతం పెరిగి 5.6 బిలియన్ డాలర్లుగా ఉందని కంపెనీ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400-00
చిత్తూరు	453-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380-00
విజయవాడ	380-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10

హైరింగ్ ప్రణాళికల్లో క్రిటికల్‌రివర్


సీఈవో అంజి మారం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ క్రిటికల్‌రివర్ తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగా దేశీయంగా నియామకాలు చేపట్టే యోచనలో ఉంది. కంపెనీకి అంతర్జాతీయంగా 1,000 మంది సిబ్బంది ఉండగా వీరిలో దేశీయంగా సగం మంది ఉన్నారు. దీన్ని మరో 30–40% మేర పెంచుకునే అవకాశం ఉందని సంస్థ సీఈవో అంజి మారం తెలిపారు.

ఎస్‌బీఐ కొత్త ఎండీగా రాణా అశుతోశ్ కుమార్ సింగ్!



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ కొత్త ఎండీగా రాణా అశుతోశ్ కుమార్ సింగ్ పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్‌ఎస్‌ఐబీ) ప్రతిపాదించింది. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. ఎస్‌బీఐలో ప్రస్తుతం ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉన్నారు. ఎస్‌బీఐ కొత్త ఎండీ నియామకం కోసం 16 మందిని ఇంటర్వ్యూ చేశారు. కాగా ఇండియన్ బ్యాంక్ నూతన ఎండీగా ఆశీష్ పాండే పేరును బ్యూరో ప్రతిపాదించింది.

మోసపూరిత ప్రకటనలతో జాగ్రత్త: ఎల్‌ఐసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తమ సంస్థ పేరుతో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న మోసపూరిత ప్రకటనల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) హెచ్చరించింది. 'కంపెనీ సమ్మతి లేకుండా మా సీనియర్ అధికారి, మాజీ అధికారుల ఫొటోలు, లోగో, బ్రాండ్ పేరును దుర్వినియోగం చేయడం ద్వారా నిర్దిష్ట వ్యక్తులు/సంస్థలు వివిధ సామాజిక మాధ్యమాల్లో మోసపూరిత ప్రకటనల్లో అనధికార పద్ధతిలో నిమగ్నమై ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. పాలసీదారులు, ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలి. అటువంటి మోసపూరిత ప్రకటనల యూ ఆర్‌ఎల్ లింక్‌లను ఎల్ఐసీ అధికారిక సోషల్ మీడియా ఖాతాలలో నివేదించండి' అని ఎల్ఐసీ కోరింది.

నాలుగో రోజూ లాభాలే

రాణించిన మెటల్, ఫైనాన్స్ షేర్లు • 22,400 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: ఫైనాన్స్, మెటల్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు నాలుగో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 114 పాయింట్లు పెరిగి 73,853 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు బలపడి 22,402 వద్ద నిలిచింది. దేశీయ వ్యాపార కార్యకలాపాలు ఏప్రిల్‌లో 14 ఏళ్ల గరిష్టానికి చేరుకోవడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ఇన్వెస్టర్లు కార్పొరేట్ క్యూ4 ఫలితాలపై దృష్టి సారిస్తూ ట్రేడింగ్‌లో కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. ఒక దశలో సెన్సెక్స్ 383 పాయింట్లు పెరిగి 74,121 వద్ద, నిఫ్టీ 108 పాయింట్లు ఎగసి 22,476 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.92 శాతం చొప్పున పెరిగాయి. అయితే ట్రేడింగ్ చివర్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ, టెలికం, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి.



- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ 'నిఫ్టీ నెక్స్ట్ 50' సూచీలో కొత్తగా ప్రవేశపెట్టిన డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్‌కు సానుకూల స్పందన లభించింది. దేశవ్యాప్తంగా 375 మందికి పైగా సభ్యులు ఇండెక్స్ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో పాల్గొన్నారు. తొలిరోజు ఫ్యూచర్స్‌లో 1,233 కాంట్రాక్టులు ట్రేడయ్యాయి.
- నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,364 పాయింట్లు(2%) ర్యాలీతో బీఎస్‌ఈలో 8.48 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.401 లక్షల కోట్లకు చేరింది.
- అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు పెరగడంతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. సెయిల్ 7%, ఎన్‌ఎండీసీ 6%, హిండాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4%, టాటా స్టీల్, జిందాల్ స్టీల్ 3% పెరిగాయి. నాల్కో, వెల్‌స్పన్ కార్ప్, హిందూస్థాన్ కాపర్, వేదాంత, హిందూస్థాన్ జింక్ షేర్లు 2% లాభపడ్డాయి.

మోదీ పనితీరు అద్భుతం



జేపీ మోర్గాన్ సీఈవో ప్రశంసలు

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ అద్భుతమైన పనితీరు ప్రదర్శిస్తున్నారంటూ జేపీ మోర్గాన్ సీఈవో జేమీ డిమోన్ ప్రశంసించారు. ఎకనామిక్ క్లబ్ ఆఫ్ న్యూయార్క్ సంస్థ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మోదీ సంస్కరణలను డిమోన్ కొనియాడారు. ''సమ్మిళిత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి భారత్‌లో ప్రధాని మోదీ 40 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశారు. అక్కడ పలు రాష్ట్రాల్లోని పన్ను వ్యవస్థల సంక్లిష్టతలను ఛేదించి సంస్కరించారు. సానుకూల మార్పు దిశగా కఠిన నిర్ణయాలు తీసుకున్నారు'' అంటూ మోదీని పొగిడారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్‌టీ, తిరువనంతపురంలో పీహెచ్‌డీ ప్రవేశాలు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ), జూలై 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియోనిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
- » అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్/టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ లేదా కనీసం 75శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ స్కోరు సాధించి ఉండాలి లేదా సంబంధిత విభాగంలో ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్-జేఆర్ఎఫ్/లెక్చరర్‌షిప్, ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.
- » వయసు: 07.05.2024 నాటికి 35 ఏళ్లు మించ కూడదు.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:07.05.2024
- » ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష తేది: 29.05.2024.
- » పరీక్ష ఫలితాల వెల్లడి: 05.06.2024.
- » ఇంటర్వ్యూ తేదీలు: 19.06.2024 నుంచి 21.06.2024 వరకు
- » ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: 01.07.2024.
- » వెబ్‌సైట్: https://www.iist.ac.in

ఐఐఎం అహ్మదాబాద్‌లో ఆన్‌లైన్ ఎంబీఏ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్(ఐఐఎం).. 2024–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల ఆన్‌లైన్ ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » అర్హత: 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు కనీసం మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ ఐఐఎంఏ అడ్మిషన్ టెస్ట్(ఐటీఏ),క్యాట్,జీమ్యాట్ /జీఆర్ఈ స్కోరు, షార్ట్‌లిస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 10.05.2024.
- » ఐటీఏ అడ్మిట్ కార్డ్ వెలువడే తేది:14.05.2024
- » ఐటీఏ పరీక్ష: 19.05.2024, 26.05.2024.
- » వెబ్‌సైట్: https://www.iima.ac.in

నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ ప్రవేశాలు

కుండ్లి(హర్యానా)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్).. 2024–25 అడ్మిషన్ సెషన్‌కు సంబంధించి ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- » మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్): 100 సీట్లు: విభాగాలు: ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్,ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్.
- » మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ): 60 సీట్లు.
- » అర్హత: ఎంబీఏకు బ్యాచిలర్ డిగ్రీ, ఎంటెక్‌కు బీఈ/బీటెక్,బీఎస్సీ,ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.05.2024
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://niftem.ac.in

ఐఎంయూ, చెన్నైలో యూజీ-పీజీ ప్రవేశాలు

చెన్నైలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ (ఐఎంయూ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, యూజీ, డీఎస్ఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ సెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- » విభాగాలు: మెరైన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్, నాటికల్ సైన్స్, అప్లైడ్ న్యూట్రికల్ సైన్స్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్, డ్రెడ్జింగ్ హార్బర్ ఇంజనీరింగ్, మెరైన్ టెక్నాలజీ, ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్.
- » అర్హత: ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హతతో పాటు గేట్/సీయూఈటీ/పీజీ సెట్/క్యాట్/మ్యాట్/సీమ్యాట్ స్కోరు ఉండాలి.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:05.05.2024
- » ఐఎంయూ సెట్ పరీక్ష తేది: 08.06.2024.
- » వెబ్‌సైట్: https://www.imu.edu.in

అవుతారా.. న్యూట్రిషనిస్ట్!

- » బీఎస్సీ ఫుడ్, న్యూట్రిషన్ కోర్సుతో అవకాశాలు
- » బైపీసీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాలకు మార్గం
- » ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్
- » వీటిని పూర్తి చేసుకుంటే కార్పొరేట్ కొలువులు

బైపీసీ ఉత్తీర్ణులకు సంప్రదాయ బీఎస్సీ బీజెడ్‌సీతోపాటు పలు వినూత్న కాంబినేషన్లతో కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిని పూర్తి చేసుకుంటే.. జాబ్ మార్కెట్ అవకాశాలు విస్తృతం అవుతాయి. అలాంటి కోవకు చెందిన కోర్సు.. బీఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్! ఇటీవల కాలంలో ప్రజల్లో ఆరోగ్య శ్రద్ధ పెరగడంతో ఫుడ్, న్యూట్రిషన్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన ఆహార అలవాట్లు లేక ఎంతోమంది రోగాల బారిన పడుతున్నారు. అలాంటి వారికి తీసుకోవాల్సిన ఆహారం, పోషక పదార్థాల గురించి మార్గనిర్దేశం చేసే నిపుణులే.. న్యూట్రిషన్ స్పెషలిస్టులు.

డిగ్రీ, పీజీ కోర్సులు

ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్‌కు సంబంధించి ప్రస్తుతం డిగ్రీ, పీజీ స్థాయిలో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో న్యూట్రిషన్, బయాలజీ, కెమిస్ట్రీ కాంబినేషన్‌తో..అదే విధంగా ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ కాంబినేషన్లతో కోర్సులు అందిస్తున్నారు. దీంతోపాటు హోంసైన్స్ విభాగంలో గుర్తింపు పొందిన హైదరాబాద్(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ)లోని కాలేజ్ ఆఫ్ హోంసైన్స్‌లోనూ బీఎస్సీలో ఫుడ్, న్యూట్రిషన్, డైటిటిక్స్ అంశాలను బోధిస్తారు. ఇదే కాలేజ్‌లో పీజీ స్థాయిలో న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ స్పెషలైజేషన్‌తో కోర్సు అందుబాటులో ఉంది. జాతీయ స్థాయిలో పలు సెంట్రల్ యూనివర్సిటీల్లోనూ బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ఫుడ్, న్యూట్రిషన్ కోర్సులను అందిస్తున్నారు. సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగా వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్ఐఎన్‌లో ఎమ్మెస్సీ

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్).. ఎమ్మెస్సీ అప్లయిడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సులను అందిస్తోంది. వీటికి ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీలో అప్లయిడ్ న్యూట్రిషన్, హోం సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, నర్సింగ్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ తదితర స్పెషలైజేషన్లు పూర్తి చేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్ కల్పిస్తారు. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. జూన్ 23న ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుంది. దరఖాస్తులకు చివరి తేదీ 2024, మే 20. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://icmrnin.aptonline.in/ICMRNIN/Views/Application/Home

సెంట్రల్ వర్సిటీల్లో పీజీ

ప్రముఖ యూనివర్సిటీల్లో పీజీ స్థాయిలో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. బీహెచ్‌యూ-వారణాసి, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, ఇగ్నోతోపాటు పలు ప్రముఖ సెంట్రల్ యూనివర్సిటీల్లో లైఫ్ సైన్సెస్ విభాగాల పరిధిలో ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్‌తో పీజీ కోర్సులు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి సీయూఈటీ-పీజీ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి.

పీహెచ్‌డీ కూడా

ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంది. యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా, యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీలో చేరొచ్చు. ఇందుకోసం యూజీసీ-నెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రా యూనివర్సిటీలో, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసే వీలుంది. తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో చేరే అవకాశముంది.

కోర్సులో బోధించేవి

ఫుడ్ న్యూట్రిషన్ సైన్స్ కోర్సుల్లో భాగంగా న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ, శానిటైజేషన్, హైజీన్, డైట్ థెరపీ, పబ్లిక్ హెల్త్, కమ్యూనిటీ న్యూట్రిషన్ వంటి అంశాలను బోధిస్తారు. కరిక్యులంలో భాగంగా ఫీల్డ్ స్టడీ కూడా చేయాల్సి ఉంటుంది. దీంతో అకడమిక్ స్థాయిలోనే విద్యార్థులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన వస్తుంది. ఫలితంగా కోర్సు పూర్తయ్యే నాటికి నైపుణ్యాలు సొంతం చేసుకుని జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపొందే అవకాశం ఉంటుంది.

ఉపాధి వేదికలు

ఫుడ్, న్యూట్రిషన్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హాస్పిటల్స్, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. రోగులకు.. ఆహార నియమాలను వివరించడానికి కార్పొరేట్ హాస్పిటల్స్ ప్రత్యేకంగా డైటీషియన్స్‌ను నియమించుకుంటున్నాయి. ఇందుకోసం ఈ విభాగంలో డిగ్రీ, పీజీ చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నాయి. అదే విధంగా స్పోర్ట్స్ క్లబ్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఐసీడీఎస్ విభాగాల్లోనూ న్యూట్రిషన్, డైటిషియన్ నిపుణుల అవసరం నెలకొంది.

కార్పొరేట్ సంస్థలు

ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలిస్ట్‌లకు కార్పొరేట్ కంపెనీల్లోనూ ఉపాధి లభిస్తోంది. ముఖ్యంగా ఆహార పదార్థాల తయారీ సంస్థలు..ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలిస్ట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆయా ఆహార పదార్థాల తయారీలో పొందుపర్చాల్సిన పోషకాల శాతం, వాటి నిల్వకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు వీరిని నియమించుకుంటున్నాయి. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో న్యూట్రిషిన్ నిపుణులకు ప్రాధాన్యం పెరుగుతోంది. నెస్లె, బ్రిటానియా, క్వాలిటీ, హాట్సన్, డాబర్, క్యాడ్‌బరీ, ఐటీసీ వంటి సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నాయి.

జాబ్ ప్రొఫైల్స్ ఇవే

ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్‌లో బ్యాచిలర్, పీజీ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి విభిన్న జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. ముఖ్యంగా వీరు న్యూట్రిషనిస్ట్, డైటిషియన్, ఫుడ్ రీసెర్చ్ అనలిస్ట్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. వీరికి ప్రారంభంలో రూ.రెండు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు వార్షిక అందుతోంది.

న్యూట్రిషనిస్ట్

హెల్త్‌కేర్ రంగంలో, ముఖ్యంగా హాస్పిటల్స్‌లో న్యూట్రిషనిస్ట్ ఉద్యోగాలు లభిస్తాయి. రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి.. వారు పాటించాల్సిన ఆహార నియమాలపై సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆహార నియామాలను సూచించాల్సి ఉంటుంది.

డైటిషియన్

వ్యక్తులు ఆరోగ్యవంతంగా జీవించడానికి అవసరమైన ఆహారపు అలవాట్లను డైటిషియన్‌లు సూచిస్తారు. పోషకాహారం అంటే ఏమిటి.. ఆయా వ్యక్తుల అవసరాలకు తగ్గట్టు తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నిబంధనలు తదితరాలను వీరు వివరిస్తారు.

ఫుడ్ రీసెర్చ్ అనలిస్ట్

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడం, అదే విధంగా వీటికి సంబంధించి పరిశోధనలు చేయడం వంటి విధులు ఉంటాయి. ఆహార పదార్థాలను కెమికల్‌గా, బయలాజికల్‌గా పరీక్షించి.. నాణ్యమైన ఉత్పత్తిని రూపొందించేలా సూచనలు చేయాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలు ఆహార పదార్థాల తయారీ సంస్థల్లో లభిస్తాయి.

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్/ఎగ్జిక్యూటివ్

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, వాటిలో లోటుపాట్లను గుర్తించడం.. నాణ్యమైన ఆహారం తయారీకి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రెండు రంగాల్లోనూ ఈ కొలువులు లభిస్తున్నాయి.

హెల్త్ ఎడ్యుకేటర్

ప్రభుత్వ విభాగంలో లభించే ఉద్యోగాల్లో ముఖ్యమైనది.. హెల్త్ ఎడ్యుకేటర్. ఆయా ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ,అందుకోసం పాటించాల్సిన ఆహార నియమాలను సూచించడం వంటి విధులు వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్ విభాగంలో ఈ కొలువులు లభిస్తాయి.